# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 3 - సంచిక 11 ఆగస్టు 2025 వెల : రూ.15

అపహాస్యం పాలైన ఎన్నికల కమిషన్

కాళ్ల కింద నేల కదులుతోంది, గమనించారా !

బీహార్లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరిస్తుందా ?

జాతీయ పౌర జాబితా తయారు చేస్తుందా ?

జాబితాల విశ్వసనీయత ఎంత ?

సర్ : సమస్యకు తప్పుడు పరిష్కారం

ఓట్ల చోరీ : పత్రికా రంగం నిబద్ధత - బడా మీడియా పాత్ర

ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. రాజ్యాంగ నీతి తెలిసిన న్యాయమూర్తి

మాలెగావ్ తీర్పే కాదు, విచారణా విచిత్రమే !

గాంధీని హత్య చేసిన గాడ్సే హిందువు కాదా..?

ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ లక్షణాలు.. పరిశీలన

మోడీ కులగణన

ఓ వైపు పేదరికం.. మరో వైపు బిలియనీర్లు

నేరం వారిది కాదు.. కానీ శిక్ష వారికేనా ?

నేటి వ్యవస్థలో సంక్షోభాలు, పరిష్కారాలు

పి.సి.జోషి - భారతీయ సాంస్కృతిక పునర్జీవనం

నాటకంగా కొడవటిగంటి కుటుంబరావు 'బకాసుర'

స్వాతంత్ర్య దినాన గుర్తు చేసుకోవాల్సిన మంచి విషయాలు

వివక్ష, విధ్వంసాలపై కవితాస్త్రం

ఒక తరం మానసిక పరిస్థితికి ప్రతీక 'అంపశయ్య' నవల

ఆగస్టు - 2025 పేజీలు : 47

# దారి దీపం
మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 11


**డి.వి.వి.యస్.వర్మ**
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) అపహాస్యం పాలైన ఎన్నికల కమిషన్ - సంపాదకీయం 3
2) కాళ్ల కింద నేల కదులుతోంది, గమనించారా ! - కె.శ్రీనివాస్ 4
3) బీహార్లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరిస్తుందా ? జాతీయ పౌర జాబితా తయారు చేస్తుందా ? - జగదీప్ ఎస్ చోకర్ 6
4) జాబితాల విశ్వసనీయత ఎంత - పి.చిదంబరం 19
5) సర్ : సమస్యకు తప్పుడు పరిష్కారం - యోగేంద్ర యాదవ్ 12
6) ఓట్ల చోరీ : పత్రికా రంగం నిబద్ధత.. బడా మీడియా పాత్ర - పామెలా ఫిలిపోస్ 14
7) ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. రాజ్యాంగ నీతి తెలిసిన న్యాయమూర్తి - ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ 15
8) మాలెగావ్ తీర్పే కాదు, విచారణా విచిత్రమే ! - ఎన్ వేణుగోపాల్ 17
9) గాంధిని హత్య చేసిన గాడ్సే హిందువు కాదా..? - బద్రీ రైనా 19
10) ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ లక్షణాలు.. పరిశీలన - పి.బి.చారి 20
11) మోడీ కులగణన - క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ 23
12) ఓ వైపు పేదరికం.. మరో వైపు బిలియనీర్లు - బొల్లిముంత సాంబశివరావు 26
13) నేరం వారిది కాదు.. కానీ శిక్ష వారికేనా ? - ఈడుగ రంజిత్ 28
14) నేటి వ్యవస్థలో సంక్షోభాలు, పరిష్కారాలు - మహమ్మద్ అక్బర్ 30
15) పి.సి.జోషి - భారతీయ సాంస్కృతిక పునర్జీవనం - అనిల్ రజీమ్‌వాలే 32
16) నాటకంగా కొడవటిగంటి కుటుంబరావు 'బకాసుర' - దివికుమార్ 37
17) స్వాతంత్ర్య దినాన గుర్తు చేసుకోవాల్సిన మంచి విషయాలు - డాక్టర్ దేవరాజు మహారాజు 40
18) వివక్ష, విధ్వంసాలపై కవితాస్త్రం - తంగిరాల సోని 42
19) ఒక తరం మానసిక పరిస్థితికి ప్రతీక 'అంపశయ్య' నవల - ఏఆర్ శ్రీకాంత్ 44
20) కార్టూన్స్ 46
21) కొత్త పుస్తకాలు స్వీకారం 47




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

**దారి దీపం**
**మాసపత్రిక**
**మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి**

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**



# అపహాస్యం పాలైన ఎన్నికల కమిషన్

ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కోల్పోవడం గతంలో జరిగిన ఎన్నికలలో మనం చూస్తూనే వున్నాం. ఇప్పటి ప్రత్యేకత ఏమిటంటే అది అపహాస్యం పాలు కావడం. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణపదమైనవి. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా పక్షపాతరహితంగా నిర్వహించకపోతే అది ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఎన్నికలకు సరైన ఓటర్ల జాబితా వుండాలి. అర్హులందరికీ ఓటు హక్కు వుండాలి. కాని, ప్రతి ఎన్నికలోనూ పోలింగ్ కేంద్రాల వద్ద చాలా మంది ఓటర్లు తమ ఓట్లు గల్లంతయ్యాయని, ఓటరు కార్డులతో ప్రదర్శనలు చేస్తూనే వున్నారు. ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఓటర్ల సవరణ జరుగుతూనే వుంటుంది. అయినప్పటికీ అర్హులైన అందరికీ ఓటు హక్కు గల ఓటర్ల జాబితాలు మాత్రం వుండడం లేదు. తప్పుల తడక ఓటర్ల లిస్టు దొంగ ఓట్లకు వీలు కల్పిస్తుంది. ఎన్నికల రోజున మద్యం, డబ్బు, యథేచ్ఛగా పంపిణీ సాగుతున్నది. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని చెప్పుకునే ఎన్నికల కమిషన్ ఎన్నికల రోజు జరిగే ఈ పంపిణీ వ్యవహారాన్ని పత్రికలు, మీడియా ప్రదర్శిస్తున్నా ఈసీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూనే వుంది. ఇక ఈవీఎంల మీద అనేక మోసాలు వున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. బీజేపీకి చెందిన పార్లమెంటు సభ్యుడు బాహాటంగానే "మీరు ఎవరికి ఓటు వేసినా అది నాకే వస్తుంది" అని ప్రకటించడం గమనార్హం. ఇటీవల సుప్రీంకోర్టు ఒక ఓడిపోయిన అభ్యర్థి ఓట్లను(ఈవీఎం) లెక్కించి ఆయనే గెలిచినట్లు ప్రకటించింది. ఇంత జరుగుతున్నా ఈసీ మాత్రం ఈ అనుమానాల నివృత్తికి సిద్ధం కావడం లేదు. వీటికితోడు పోలింగ్ పూర్తయిన వెంటనే వివరాలు ప్రకటించకుండా రోజుల తరబడి ఆలస్యం చేస్తున్నారు. ఓట్ల లెక్కింపులో పోలైన ఓట్ల కంటే లక్షల సంఖ్యలో అదనపు ఓట్లు చేరిపోతున్నాయి. వీటిపట్ల ఎన్నికల కమిషన్ జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదు. అందుకే ఈసీపై విశ్వసనీయత నానాటికి సడలిపోతున్నది.

ఇప్పుడు బిహార్‌లో "సర్" పేరుతో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పేరిట ఈసీ చేపట్టిన చర్యలు అర్థరహితమైనవిగా అపహాస్యం పాలవుతున్నాయి. ఎన్నికల సమగ్ర సవరణకు ఇంతకు ముందున్న ఓటర్ల జాబితా ప్రాతిపదిక కాకుండా 22 ఏళ్ల కిందటి 2003 ఓటర్ల జాబితాను ఈసీ ఎంచుకున్నది. ఆ జాబితాలో వున్న వాళ్లే నికరమైన ఓటర్లుగా ప్రకటించింది. అంటే ఆ తర్వాత 22 ఏళ్లుగా ఓటర్లుగా చేరిన వారందరినీ అనర్హులను చేసింది. వారు తిరిగి కొత్త ఓటర్లుగా చేరడానికి సవాలక్ష పత్రాలను పూర్తిచేసి ఇవ్వాలి. బిహార్ లాంటి వెనుకబడిన ప్రాంతంలో పేదలు ఈ పత్రాలు సేకరించి ఇవ్వడం కష్టసాధ్యం చేసి వారిని జాబితా నుంచి తొలగించడానికి పూనుకుంది. మైనారిటీలను, బెంగాలీ భాష మాట్లాడే వారిని ఈ తొలగింపు ప్రక్రియలో ప్రధానం చేసింది. వివరాలు ప్రకటించకుండా సుమారు 65 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ప్రతి ఎన్నికకీ ఏ రాష్ట్రంలోనైనా ఓటర్లు పెరుగుతారు. కాని, బిహార్‌లో మాత్రం తగ్గిపోయారు. ఇంటింటి సర్వేలు ఫారాల సేకరణ వగైరా తర్వాత ఈసీ ప్రకటించిన ముసాయిదా తప్పులతడకగా వుంది. మరణించాడని తొలగించిన వారు సుప్రీంకోర్టులో దర్శనం ఇచ్చారు. రాహుల్‌గాంధీతో టీ తాగుతున్నారు.

ఇళ్లు లేని వారికి ఇంటి నెంబరు '0' జీరో ఇచ్చారట. ఈసీ బిహార్‌లో వేల సంఖ్యలో ఇళ్లు లేని వారిని చేసింది. తల్లిదండ్రుల పేర్లు లేని వారు వేల సంఖ్యలో వున్నట్లు ఓటర్ల జాబితా ప్రకటించింది. ఓటర్లను ఎందుకు తొలగించామో చెప్పాల్సిన అవసరం లేదని బుకాయించింది. కారణాలు చెప్పాల్సిన పనిలేదని ప్రకటించింది. సుప్రీంకోర్టు ఈ వాదనను తిరస్కరించింది. ఎందుకు తొలగించారో తెలుసుకునే హక్కు ఓటర్లకు వుందని, తొలగించిన పేర్లు కారణాలు ప్రకటించాలని ఆదేశించింది. సీ.సీ. టీ.వీ ఫుటేజ్ ఇస్తే అది మహిళల ప్రైవసీకి భంగం కలుగుతుందని ఈసీ చేసిన ప్రకటనతో నవ్వులపాలైంది. ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ అమిత్ షాకు ఆప్తుడు. ఆయన నిర్వహించిన శాఖలకు ముఖ్య కార్యదర్శిగా సన్నిహితుడు. ఇప్పుడు ఈ పదవిలో రాజుకు మించిన రాజభక్తిని ప్రదర్శిస్తున్నాడు. ఓట్లు తారుమారులో ముద్దాయిగా వున్నాడు. పౌరుని ఓటు హక్కుని కాజేసే అధికారం ఎవరికీ లేదు. ఈసీ అభిశంసనకు అర్హుడు.

**- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

# కాళ్ల కింద నేల కదులుతోంది, గమనించారా !



- కె.శ్రీనివాస్

సంక్షోభం అంటే ఏమిటి ? యథాస్థితి చెదిరిపోవడానికి దారి తీసే పరిణామాలేమిటి ? సర్వం సహా చక్రవర్తులు, తిరుగులేని అధికారాన్ని చెలాయించే నియంతలు కూడా ఏదో ఒకదశలో ఎందుకు బలహీనులవుతారు ? ధర్మం ఒక్కపాదం మీద కూడా నడవని స్థితి వచ్చినప్పుడు ఎందుకు లోకధేనువు కుప్పకూలిపోతుంది ? నరేంద్రమోదీ, ఆయన పార్టీ నిన్న మొన్నటి దాకా సాగించిన విజృంభణ చూసినప్పుడు, కనుచూపు మేరలో దానికి నిష్కృతి కనిపించలేదు. బయటి నుంచి పోటీ ఇవ్వగల ప్రత్యర్థులు లేరు. లోపలి నుంచే ఎవరో ఒకరు అస్థిరపరిస్తే తప్ప, ఈ పాలనకు తిరుగులేదు - అన్న విశ్లేషణలు వినిపిస్తూ వచ్చాయి.

ఎన్నికల ద్వారా జరగగల మరమ్మతు కూడా 2024 సాధారణ ఎన్నికల్లో, గురికి బెత్తెడు దూరంలో నిలిచిపోయింది. ఊతకర్రల సాయంతో తాబేటి నడక కాక, బయటి మద్దతుదారులను కూడా విధేయులను చేసుకుని ప్రభుత్వం పరుగులు తీస్తూనే ఉంది. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ఖాతరుచేయని నిరంకుశత్వాన్ని నిలబెట్టినది ఏది ? ప్రజామోదం కొంత, భారతీయ సమాజంలో ఆలోచనాసరళిని, విసంపుటిని తలకిందులు చేయగలిగిన ప్రచార కథనాల ప్రభావం కొంత అధికార సౌధానికి సుస్థిరత ఇస్తూ వచ్చాయి. భారత రాజ్యాన్ని సరైన దారిలోకి మళ్లిస్తున్నాడని, లోపలి – బయటి శత్రువుల నుంచి ప్రజలను రక్షిస్తున్నాడని, మైనారిటీలను రెండో తరగతికి కుదించడం ద్వారా తమను ప్రథమ శ్రేణిలోకి ఎదిగించాడని, కునారిల్లిపోయి ఆత్మ విశ్వాసం అంతరించిన భారతీయ ఆత్మకు విశ్వాసాన్ని, గర్వాన్ని సమకూరుస్తున్నాడని నరేంద్ర మోదీని, రాజ్యాంగ వ్యవస్థల మీద కంటె హెచ్చు విశ్వాసంతో, ప్రజలు అభిమానించారు. తమకు మంచి చేస్తున్నప్పుడు, తమ మనోభావాలను ఉత్తేజపరుస్తున్నప్పుడు, రాజ్యాంగ విలువలను పాటిస్తే ఏమిటి, పాటించకపోతే ఏమిటి, వాటికి సవరింపులు చేస్తే ఏమిటి – అన్న బేఖాతరు ధోరణిలో మెజారిటీ భారతీయ సమాజం పడిపోయింది.

మరి ఇప్పుడు అట్లాగే ఉందా ? సజావుగా సాగుతున్న ఆకాశ యానంలో ఈ కుదుపులు ఏమిటి ? అందరూ అంగీకరించక పోవచ్చును. కానీ, పదకొండు ఏళ్ల తర్వాత నరేంద్రమోదీ




ప్రభుత్వం మొదటిసారి గట్టి సవాల్‌ను ఎదుర్కొంటున్నది. అదేమిటి, ఇప్పుడు సాధారణ ఎన్నికలు లేవు కదా, బీహారో, తమిళనాడో గెలిచినా, ఓడినా కలిగే అదనపు లాభం, అధిగమించలేని ప్రమాదం ఏముంటాయి ? అన్న సందేహం కలుగవచ్చు. కానీ, ఇప్పుడు మాట్లాడుకుంటున్నది నైతిక సంక్షోభం గురించి, లెజిటిమసీ సంక్షోభం గురించి. మొదటి సారిగా ప్రజల మనస్సుల్లో బలంగా నాటుకున్న అవిశ్వాసం గురించి. నైతిక ప్రాతిపదికలనే అంగీకరించని వారికి నైతిక సంక్షోభమేమిటి అని విమర్శకులు ప్రశ్నిస్తారు. ఒంటి పాదంతో నడిచినప్పుడు కూడా, ఎంతో కొంత బేలన్స్ ఉంటుంది. ఆ ఒక్క కాలు కుంగినప్పుడు, వ్యవస్థ కంపిస్తుంది. నరేంద్రమోదీ, ఆయన పార్టీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి లెజిటమసీ ఇస్తున్న అంశాలన్నీ పూర్వ పక్షమై పోతున్న సన్నివేశంలో ఇప్పుడు ఉన్నాము.

2014లో అధికారానికి వచ్చిన వెంటనే బీజేపీ మీడియాను ప్రక్షాళన చేసేపనిలో పడింది. సామాజిక మాధ్యమాలను బహుముఖ ప్రయోజనాలకు వినియోగించుకునే భారీ ప్రాజెక్టును మొదలుపెట్టింది. మరోవైపు, అధికార యంత్రాంగంలో మార్పులు చేసుకుంది. చట్టసభలలో తిరుగులేని బలం ఎట్లాగూ ఉన్నది. న్యాయవ్యవస్థతో కొంత సమస్య వచ్చింది కానీ, కీలక విషయాల్లో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తపడింది. కొందరు న్యాయమూర్తులకు పదవీ విరమణానంతర పునరావాసాలు కల్పించారు. కొందరి చేతికి కీలక వ్యాజ్యాలు రాకుండా చూసుకున్నారు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరిని తగిన విధంగా చతుర్విధ ఉపాయాలతో నిర్వహిస్తూనే, మొత్తంగా న్యాయ వ్యవస్థకు అధికారాలు తగ్గించడానికి ప్రయత్నాలు చేశారు. ప్రజలలో ఉన్న ఉద్వేగపూరితమైన మద్దతు వివిధ వ్యవస్థలు నిష్పక్షపాతంగా

వ్యవహరించడానికి అడ్డుగా ఉంటుంది కూడా. ఒక రకమైన భయంతో కూడిన ఒత్తిడి న్యాయమూర్తుల మీద కూడా పనిచేస్తూ ఉంటుంది.

మరొక రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం, కమిషనర్ల ఎంపికలో ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేబినెట్ మంత్రికి చోటు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ జరిగింది. ఫలితంగా, ముగ్గురి ఎంపిక కమిటీలో ప్రధాని, ఆయన కేబినెట్ సహచరులొకరు, ప్రతిపక్ష నాయకులు సభ్యులు కావడంతో ఏకపక్ష నిర్ణయాలకు ఆస్కారం కలిగింది. ఆ చట్ట సవరణ న్యాయపరీక్షలో ఉండగానే, ప్రస్తుత కమిషనర్లను ఈ ఏడాది కొత్త పద్ధతిలో నియమించడం వివాదం అయింది. ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక కమిటీ నుంచి తొలగించడంతో సగం విశ్వసనీయత కోల్పోయిన ఎన్నికల సంఘం, కొత్త నియామ కాలు చేసిన తీరుతో మరింత అప్రదిష్ట పాలయింది.

నరేంద్రమోదీ ప్రభుత్వానికి జనాదరణ అందించిన అంశాలలో తీవ్ర జాతీయవాదం ఒకటి. పెహల్గాం సంఘటన అనంతరం మోదీ వెనుక సమీకృతమైన దేశం, పాకిస్థాన్ మీద బాలాకోట్ దాడులకు మించిన గట్టి చర్యను ఆశించింది. అట్లా ఆశించే విధంగా 'పెహల్గామ్' అనంతర కథనాలు ప్రభావితం చేశాయి కూడా. 'ఆపరేషన్ సిందూర్' అటువంటి సంతృప్తిని ఇస్తుందని మోదీ అభిమానులైన జాతీయవాదులు అనుకున్నారు. అర్థాంత రంగా ఆ సైనికచర్య ముగియడం, ఆ నిర్ణయం వెనుక తన ఒత్తిడి ఉన్నదన్నట్టుగా అమెరికా అధ్యక్షుడు పదే పదే ప్రకటించ డం, మోదీ ప్రభుత్వ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేసింది. పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చినందునే ఆపరేషన్‌ను నిలిపివేశాం అని ప్రభుత్వం ఎంత చెప్పినా, అందుకు విరుద్ధమైన ప్రకటనలు అమెరికా నుంచి, పాకిస్థాన్ నుంచి వచ్చాయి. పైగా, పాకిస్థాన్‌కు తాను అండగా ఉంటున్నట్టు డొనాల్డ్ ట్రంప్ అనేక సంకేతాలు ఇస్తూ వచ్చారు. మొన్నటి పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం ఈ విషయంలో ఎంతో ఆత్మరక్షణలో పడినట్టు స్పష్టంగా కనిపించింది. ఈ నెలలో ప్రధాని అమెరికా పర్యటన, ట్రంప్‌ను మంచి చేసుకోవడానికేనని, అది ఎటువంటి ఫలితాలను ఇస్తుందో చెప్పలేమని అంటున్నారు. పాక్ వివాదానికి తోడు, టారిఫ్‌ల విషయంలో ట్రంప్ భారత్‌తో వ్యవహరిస్తున్న తీరు, దానికి దీటైన ప్రతిస్పందన ఇవ్వడంలో మోదీ ప్రభుత్వ వైఫల్యం, తన కీలక బలాలైన జాతీయవాద, దేశభక్తి భావనల్లో బీజేపీ ప్రతిష్ఠను నష్టపోయేట్టు చేసింది.

ఆగస్టు 15 ఎర్రకోట ప్రసంగం మోదీకి ఒక కీలకమైన అవకాశం. ఆర్థిక రంగంలో అమెరికా చేస్తున్న అన్యాయమైన ఒత్తిడిని, పాకిస్థాన్‌తో అది చేస్తున్న మైత్రిని స్పష్టమైన, దృఢమైన స్వరంతో ఆయన ఖండించి ఉండవలసింది. కానీ, తిరిగి పాకిస్థాన్‌ను ఉద్దేశించి మాత్రమే ప్రధాని భీషణ ప్రతిజ్ఞలు చేశారు. అమెరికా సుంకాల దాడి నుంచి దేశ రైతాంగాన్ని కాపాడతామని చెప్పవలసింది పోయి, భారతీయ రైతులకు దక్కవలసిన సింధుజలాలను కాపాడుకుంటామని ఆయన చెప్పారు. రాహుల్‌గాంధీ లోక్‌సభలో చెప్పినట్టు, చైనా చొర బాటును కానీ, అమెరికా ఒత్తిడిని కానీ ఎదుర్కొనలేని బలహీనతలో కేంద్రం పడిపోయింది. పాకిస్థాన్‌కు మాత్రమే హెచ్చరికలు చేయగలిగే స్థితిలో ఉండడం జాతీయవాద ఫ్రంట్‌లో బీజేపీ ప్రభుత్వ బేలతనాన్ని సూచిస్తోంది.

ఈ నెల ఏడో తేదీన రాహుల్‌గాంధీ పేల్చిన 'ఆటం బాంబు' మోదీ ప్రభుత్వాన్ని చాలా సంకటంలో పడవేసింది. ఓట్ల దొంగత నానికి సంబంధించి ఎన్నికల కమిషన్ మీద సోదాహరణంగా చేసిన విమర్శలు, సమాధానం లేనివి. ఎన్నికల సంఘం చాలా బలహీనమైన ప్రతిస్పందనలు మాత్రమే ఇవ్వగలిగింది. ఎన్నికల సంఘాన్ని సమర్థించుకుంటూ రంగంలోకి దిగిన బీజేపీని సహ ముద్దాయిని చేసింది. ఎన్నికల సంఘం – బీజేపీ కలసి ఈ ఓట్ల దొంగతనం చేస్తున్నారన్నట్టు రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణకు బలం చేకూరింది. రాహుల్ వెల్లడించిన వివరాలకు సమాధానం ఇవ్వకుండా, పోటీ ఆరోపణలు చేయడం, సాంకేతికంగా మార్పిడి చేసిన డాక్యుమెంట్లను ప్రచారంలో పెట్టడం, బీజేపీని మరీ పలచన చేసింది.

రాహుల్‌గాంధీ బెంగళూరులోని ఒక నియోజకవర్గాన్ని నమూనాగా తీసుకుని పరిశోధన చేశారు. కానీ, ఆయన అక్రమాలను ఆవిష్కరించిన సందర్భం ఎన్నికల సంఘం బిహార్ నిర్వహిస్తున్న 'సర్' (ఓటర్ల జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ) కార్యక్రమం. తాను బయటపెట్టిన 'ఓట్ల దొంగతనం' నేపథ్యం లోనే, ఈ ఆదివారం నుంచి రాహుల్‌గాంధీ బిహార్‌లో 'ఓట్ అధికార్ యాత్ర'ను తలపెట్టారు. దీనికంతా కూడా అతి త్వరలో జరగనున్న బిహార్ ఎన్నికలు నేపథ్యం అన్నది తెలిసిందే. సుప్రీంకోర్టు 'సర్' విషయంలో పారదర్శకత కోరుతూ ఆదేశాలు ఇవ్వడం కూడా ఈ వాతావరణంలోనే జరిగింది. బిహార్ ప్రయోగం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆశించిన ఫలితాలు ఇప్పుడు సమకూరకపోవచ్చు. ప్రధాని ఎర్రకోట ప్రసంగంలో ఈ ఉదంతాన్ని ప్రస్తావించలేదు. కానీ తాము దేశమంతటా చొర బాటుదారులు, అక్రమ వలసదారులను (ఘుస్పేటియే) గుర్తించి చర్యలు తీసుకోవడం గురించి గొప్పగా చెప్పారు. సరిహద్దుల నుంచి వస్తున్న ఈ పరాయివారు, భారతీయుల ఉద్యోగాలను, వ్యాపారాలను అపహరిస్తున్నారని, ఆడవాళ్లను లాగేసుకుంటా రని, ఏమంత హుందాగా లేని రీతిలో హెచ్చరించారు. 'సర్' కార్యక్రమానికి ఈ చొరబాటుదారులు తొలగింపును సమర్థనగా ప్రచారం చేసి, రాహుల్‌యాత్రను బీజేపీ ఎదుర్కొనే అవకాశం ఉంది. కానీ, రాహుల్‌గాంధీ వెల్లడి వల్ల, దేశప్రజలకు ఓటర్ల జాబితాల మీద, ఎన్నికల ప్రక్రియ మీద, **(మిగతా పదో పేజీలో)**

# బిహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరిస్తుందా ? జాతీయ పౌర జాబితా తయారు చేస్తుందా ?



- జగదీప్ ఎస్ చోకర్

మొదటిగా వాస్తవాలు చూద్దాం.

బిహార్ శాసనసభ పదవీకాలం 2025 నవంబర్ 22తో ముగుస్తుంది. అంటే ఆలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలి. కేంద్ర ఎన్నికల సంఘం సమన్య సమంజసం అని భావిస్తే ఏ నియోజకవర్గంలోనైనా లేదా ఏదైనా నియోజకవర్గంలో ఒక భాగంలో నేనా ఓటర్ల జాబితాను సవరించడానికి ప్రత్యేకమైన అధికారాలు 1950 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టంలో సెక్షన్ 21(3) ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉన్నాయి. అయితే అటువంటి నిర్ణయం తీసుకునేటప్పుడు ఆ నిర్ణయానికి ప్రేరేపించిన కారణాలను కేంద్ర ఎన్నికల సంఘం నమోదు చేయాల్సి ఉంది. 1960 నాటి ఓటర్లు జాబితా నమోదు నిబంధనలలో రూల్ 25 కూడా ఈ అధికారాన్ని ధ్రువీకరిస్తుంది. ప్రజా ప్రాప్తికి చట్టం సెక్షన్ 21 సబ్‌సెక్షన్ రెండు ప్రకారం ప్రతి నియోజక వర్గంలోనూ ఓటర్ల జాబితాను సమగ్రంగా గాని, సారాంశం గానీ సవరించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయవచ్చు.

**2025 జూన్ 24వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నాలుగు పేజీల పత్రికా ప్రకటనలో..**

- 1.బిహార్‌లో ఓటర్ల జాబితాలను సమగ్రంగా సవరించాలని ఆదేశించింది.
- 2.01.07.2025 మొదలుకుని ఓటర్ల జాబితాలో ప్రత్యేకమైన సమగ్ర సవరణ చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ 19 పేజీల ఉత్తరం రాసింది. ఇందులో మూడు పేజీలు లేఖ అదనంగా నాలుగు అనుబంధాలు జోడించింది.
- అ) ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు సంబంధించిన ఆదేశం మూడు పేజీలు.
- ఆ) తొమ్మిది పేజీల నిడివిలో ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తుకు మార్గదర్శకాలు.
- ఇ) రెండు పేజీలు నమోదు పత్రం, ధ్రువీకరణ ప్రకటన.
- ఈ) మరో రెండు పేజీల ధ్రువీకరణ పత్రం – ఇందులో ధృవీకరణతోపాటు సదరు ఓటరు ఓటర్ల జాబితా సవరణ అధికారికి సమర్పించే పత్రాలు జాబితా (ఒక్కొక్క ఓటరు తన కోసం తన తల్లిదండ్రుల కోసం వేరు వేరు అఫిడవిట్లు దాఖలు చేయాలి. ఈ అఫిడవిట్లలో 2003 జనవరి ఒకటో తేదీ నాటికి ఆయా సభ్యులు ఏయే నియోజకవర్గాలలో ఓటర్లుగా ఉన్నారో ఈ వివరాలు కూడా ఆధారాలతో జత చేయాలి)

రాష్ట్ర ఎన్నికల అధికారికి రాసిన లేఖలో ఏడో పేరలో బిహార్ ఓటర్ల జాబితా సవరణ ప్రత్యేక కార్యక్రమం క్రింద ప్రస్తావించిన టైమ్ టేబుల్ ప్రకారం పూర్తి కావాలి అని ఆదేశించింది. ఈ టైమ్ టేబుల్ ప్రకారం జూన్ 25న పని మొదలు కావాలి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఉదయం మొదలు పెట్టాలన్న లేఖ రాసింది జూన్ 24. మొదలు పెట్టాల్సి గడువు జూన్ 25.

**కార్యక్రమం చేపట్టాల్సిన చర్యలు ఇవి :**

- ఓటరు నమోదు అధికారులు నమోదు ఫారాలు అచ్చు వేయించాలి. వీటిని పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు అందజేయాలి. రాష్ట్రంలో ఎంత మంది ఓటర్లు ఉంటే అంత మందికి సరిపడా నమోదు ఫారాలు అచ్చు వేయించాలి.
- నమోదు ఫారాలు నింపటానికి, నింపిన ఫారాలు తనిఖీ చేయటానికి సంబంధించి పోలింగ్ బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలి.
- ఇంటింటికి తిరిగి ఓటరు నమోదు ఫారాలు ఓటర్లకు అంద చేయాలి.
- ఇంటింటికి తిరిగి నింపిన ఫారాలు సేకరించాలి.
- ఉన్నతస్థాయి అధికారులు ఈ ఫారాలు తనిఖీ చేయాలి.
- పోలింగ్‌స్టేషన్ల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ, పోలింగ్ స్టేషన్ల హద్దులు ఖరారు చేయటం.
- ఆగస్టు ఒకటో తేదీ నాటికి ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయాలి.
- ఓటర్ల జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు అంటే తెలియజేసేందుకు గడువు ఇవ్వాలి
- అభ్యంతరాలకు సంబంధించిన ఫిర్యాదులు పరిష్కరించి తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 30 నాటికి సిద్ధం చేయాలి.

**ఈ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అవసరం సందర్భంపై కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పత్రికా ప్రకటన ప్రకారం**

"వేగవంతమైన పట్టణీకరణ, పెరుగుతున్న వలసలు, తొలి తరం ఓటర్లు, మరణాల వివరాలు సమగ్రంగా నమోదు కాకపో

వడం, విదేశాల నుంచిఅక్రమంగా వచ్చిన వారికి ఓటు హక్కు దఖలుపర్చడం వంటి కారణాల రీత్యా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అవసరమైంది. ఈ కసరత్తు ద్వారా లోపరహితమైన ఓటర్ల జాబితాను చేయటానికి ఈ కసరత్తు అవసరం" అని పేర్కొన్నది. జూన్ 24వ తేదీ జారీ చేసిన ఆదేశంలో "ఈ లక్ష్యానికి అనుగుణంగా ఎన్నికల సంఘం గతంలో కూడా 1952-1956, 1957, 1961, 1965, 1966, 1983-84, 1987-89, 1992, 1993, 1995, 2002, 2003, 2004లో కూడా ఈ కసరత్తు దేశవ్యాప్తంగా గానీ కొన్ని ప్రాంతాలకు సంబంధించినంత వరకు కానీ జరిగింది. బిహార్‌కు సంబంధిం చినంత వరకు చివరిసారిగా ఈ సమగ్ర సవరణ 2003లో జరిగింది."

### ఈ వివరణ మరికొన్ని సమస్యలు ముందుకు తీస్తోంది.

వేగవంతమైన పట్టణీకరణ, పెరుగుతున్న వలసలు, తొలి తరం ఓటర్లు, మరణాల వివరాలు సమగ్రంగా నమోదు కాకపోవడం, విదేశాల నుంచి అక్రమంగా వచ్చిన వారికి ఓటు హక్కు దఖలుపర్చడం వంటివి నిరంతరం జరుగుతున్న లేదా కొనసాగుతున్న పరిణామాలా ? లేక కొంత కాలంగా మాత్రమే చోటు చేసుకుంటున్న పరిణామాలా ? అన్నవి ఈ ప్రశ్నలు.

ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఎన్నికల సంఘం ప్రకటన ప్రకారమే 1952 నుంచి 2004 వరకు ఎన్నోసార్లు ఓటర్ల జాబితా సమగ్ర సవరణలు జరిగినపుడు మరి గత పన్నెండేళ్లుగా ఈ కసరత్తు ఎందుకు చేపట్టలేదు !

2004 నుంచి నేటి వరకు ఏమి జరిగింది ? ఏమీ జరగలేదు ? ఎందుకు ? అన్న ప్రశ్నలకు ప్రస్తుత కేంద్ర ఎన్నికల సంఘం సభ్యులు బాధ్యులు కాదు అన్న సమాధానం చెప్పొచ్చు. కానీ ఈ సమాధానం దేశ ప్రజలను సంతృప్తిపర్చలేవు. ఎందుకంటే ఎన్నికల సంఘం శాశ్వతమైన సంస్థ. మధ్యలో అధికారులు వస్తారు.. వెళ్తారు. ఎవరు ఉన్నా, లేకున్నా సంస్థాబాన్న తర్వాత దానికంటూ ఓ చరిత్ర అనుభవాలు వారసత్వం ఉంటాయి. 21 సంవత్సరాలు అన్నది ఏమీ తక్కువ కాలం కాదు.

### ఈ టైమ్ టేబుల్ ఆచరణ సాధ్యమా ?

పైన ప్రస్తావించిన మొత్తం టైమ్ టేబుల్ ఆచరణ సాధ్యం కాదు. పోలింగ్ బూత్ అధికారులు జూన్ 24వ తేదీ ఆదేశాలు అందుకున్న వెంటనే నమూనా ఓటరు నమోదు ఫారాలు తయారు చేసి అచ్చు వేసే తెల్లారేసరికి ఓటర్లకు చేరుస్తారని నమ్ముతున్నారా ? లేక అందరినీ ఓటరు నమోదు ఫారాలు వాట్సాప్‌లో పంపితే ఓటర్లు అందరూ తెల్లారేసరికి ప్రింట్ అవుట్ తీసుకుని వివరాలు నింపి తిరిగి పోలింగ్ బూత్ అధికారులకు అందజేయటానికి క్యూ కట్టి నిలబడతారు అనుకుంటున్నారా ? ఒకవేళ ఇవన్నీ సాధ్యమే అనుకున్నా రాష్ట్రమంతా రెండు దఫాలుగా ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదు ఫారంలో ఉన్న వివరాలు తనిఖీ చేసి పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లను పునః పంపిణీ చేయటం తదనుగుణంగా ఓటర్ల జాబితా ఖరారు చేయటం సాధ్యమవుతుందా ?

ఈ విషయంలో ఎన్నికల సంఘం తమ అత్యాశ ఎంతటిదో అర్థం చేసుకోవడానికి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ సైన్సెస్ పని తీరును ఒక్కసారి గమనిస్తే ఉపయోగంగా ఉంటుంది.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ కసరత్తు మొదలుపెట్టే టైమ్. ఓటర్ల జాబితా సమగ్రంగా సవరించడం ఉపయోగమే. ఈ కసరత్తు ఇంకా తగినంత ముందుగానే మొదలైతే మరింత అర్థవంతంగా పూర్తి చేయటానికి వీలయ్యేది.

ఎన్నికల సంఘం జారీ చేసిన పత్రికా ప్రకటనలో ఈ కసరత్తు సజావుగా పూర్తి చేయటానికి రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అన్నీ సంపూర్ణంగా సహకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసింది.

అంతేకాదు. "ఏ ఎన్నికల క్రమంలోనైనా ఓటర్లు పార్టీలు అసలైన పాత్రధారులు. ఇంతటి భారీ కసరత్తు సమర్థవంతంగా సజావుగా పూర్తి కావాలంటే ఈ పాత్ర ధారులు పూర్తిస్థాయిలో పాల్గొనాలి. ఎన్నికల సంఘం దృష్టిలో ఓటర్లు పార్టీలు కీలకమైన పాత్రధారులు అయినపుడు ఇంత మహత్తరమైన కసరత్తు కు సంబంధించిన ప్రణాళిక తయారీలో వారిని భాగస్వాములను చేయటం అవసరమని కేంద్ర ఎన్నికల సంఘం భావించలేదా?

### చట్టపరమైన సమస్యలు - ఆచరణాత్మక సమస్యలు

కేంద్ర ఎన్నికల సంఘం జూన్ 24న ఇచ్చిన ఆదేశంలో "గత సవరణ 2003లో జరిగింది. కనుక 2003 జనవరి 1ను ప్రామాణిక తేదీగా పరిగణించి తాజా సవరణ జరగాలి. 2003 నాటికి ఓటర్ల జాబితాలో ఉన్న వాళ్లను యధాతథంగా ఓటర్లుగా గుర్తించాలి. వారిని పౌరులుగా గుర్తించాలి" అని ప్రకటించింది.

అంతే కాదు.

'2003 నాటికి ఓటర్ల జాబితాలో లేని వారు అనేక ప్రభుత్వ ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాతనే సదరు పౌరులు ఓటర్లుగా నమోదయ్యే అర్హత పొందుతారు. ఈ రెండు పేరాలు కలిపి చదివితే (చట్టపరమైన వ్యాఖ్యానం పక్కన పెట్టి) 2003 నాటికి ఓటరు కానీ వారిని భారతీయ పౌరులుగా గుర్తించరన్నది సారాంశం. ఇది పెద్ద మాటగా కనిపించవచ్చు.

కానీ అదే లేఖలో 11వ పేరా చూడండి. ఈ పేరాలో ఎన్నికల సంఘం "పౌరసత్వ ధ్రువీకరణతో సహా 2003 జనవరి 1 నాటికి ఓటరు కానీ వారు తమ ధ్రువీకరణను రుజువు చేసుకోవాల్సి ఉంటుంది". అటువంటి వారు తమ పౌరసత్వాన్ని తద్వారా ఓటరు హక్కును ధృవీకరించుకోవడానికి అనేక పత్రాలు జమ చేయాలి. అందులో కొన్ని పత్రాలు పౌరసత్వ

ధ్రువీకరణ కూడా చేసుకోవాల్సినవి ఉంటాయి.

**ఇక్కడ మూడు ప్రశ్నలు అర్థం కాకుండా ఉన్నాయి.**

- **మొదటిది** : 2003 జనవరి ఒకటో తేదీ నాటికి ఓటర్లుగా నమోదు కాకుండా తర్వాత కాలంలో నమోదు అయితే తాజా ఆదేశాల ప్రకారం వారిని ఓటర్లుగా ఎన్నిక సంఘం గుర్తించడం లేదా ? అటువంటపుడు 2003 నుంచి గత పాతికేళ్లలో జరిగిన ఎన్నికల్లో వాళ్ళు వేసిన ఓట్ల పరిస్థితి ఏమిటి ? ఆ ఓట్లు ఆధారంగా గెలిచిన అభ్యర్థులకు ఉన్న చట్టబద్ధత ఏమిటి ? ఈ సమస్యను ఎలా అర్థం చేసుకోవాలి?
- **రెండు** : 2003 తర్వాత ఓటర్లుగా నమోదు అయినా వారిని తాజా ఆదేశాల ప్రకారం ఓటర్లుగా గుర్తించక పోతే వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లేనా ? అలా జరిగితే అనేక తీవ్ర పరిణామాలు పర్యవసానాలు తలెత్తను న్నాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనలు 21 ఎ ప్రకారం ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. తదనుగుణంగా పాటించాల్సిన విధి విధానాలు కూడా స్పష్టంగా నమోదు అయి ఉన్నాయి. ఏ ఓటరు పేరు తొలగించాలని ఎన్నికల అధికారి నిర్ణయించుకుంటే సదరు ఓటరుకు తన వాదన వినిపించుకునేందుకు సంపూర్ణ అవకాశం ఇవ్వాలి. అంటే జనవరి 1, 2003 నాటికి ఓటర్లుగా నమోదు కాని వారు ఆ తర్వాత ఓటర్లుగా నమోదు ఆయన వారికి తాజా ఆదేశాల ప్రకారం తమ పేర్లు తొలగించటానికి ముందు లేదా తొలగించినట్లు పరిగణించటానికి ముందు కనీస వివరణ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వలేదు అని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధంగా ఓటరు హక్కు రద్దు అయిన పౌరులు ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే తుది పర్యవసానం కోర్టు తీర్పుపై ఆధారపడి ఉంటుంది.
- **మూడు** : ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించిన సమస్య. జూన్ 24వ తేదీన జారీ చేసిన ప్రకటనకు ముందు ఓటరు నమోదు చేసుకోదల్చుకున్న వ్యక్తి ఎవరైనా ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ క్రింది డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది :

**నాకు తెలిసినంత వరకు ఈ క్రింద తెలిపిన విషయాలు వాస్తవాలు.**

- 1.నేను భారతీయ పౌరుడిని. గ్రామం/తాలూకా/జిల్లా/రాష్ట్రం లో పుట్టాను.
- 2. నా సాధారణ నివాసం..
- 3.మరే ఇతర నియోజకవర్గంలోనూ నేను ఓటరుగా నమోదు చేసుకోలేదు.
- 4.ఇప్పటి వరకూ అసెంబ్లీ ఎన్నికల్లో కానీ పార్లమెంట్ ఎన్నికల్లో కానీ ఓటరుగా నమోదు కాలేదు.

అని కానీ లేదా

- నా పేరు .. నియోజకవర్గంలో నమోదు అయి ఉంది. నా పేరు సదరు ఓటరు జాబితా నుంచి తొలగించాలని కోరుతున్నాను.
- ఫారం 6లో తల్లితండ్రుల గురించిన వివరాలు ఏమీ తెలియజేయాల్సిన అవసరం లేదు.

కానీ తాజా ప్రకటన ప్రకారం ఓటరుగా నమోదు కాదల్చుకున్న వ్యక్తి తమ విజ్ఞప్తితోపాటు కొన్ని పత్రాలను జత చేయాల్సి ఉంటుందని సూచించింది. తల్లి తండ్రుల గురించి తన గురించి స్వీయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఇంత మౌలిక మార్పు జరుగుతున్నపుడు ఈ మార్పు అవసరం గురించి కానీ ఆచరణ సాధ్యత గురించి కానీ కనీస ప్రాథమిక చర్చ కూడా జరగలేదు.

**ఆచరణకు సంబంధించిన సమస్యలు**

- పత్రికా ప్రకటనలో ఈ క్రింది విషయాలు ప్రధానమైనవి ఎన్నికల సంఘం ప్రకటించింది.
- జూన్ 24వ తేదీ నాటికి ఓటర్ల జాబితాలో ఎంత మంది ఉన్నారో అన్ని ఫారాలు అచ్చు వేయాలి. వాటిని బూత్ స్థాయి అధికారులకు చేర్చాలి.
- పోలింగ్ బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఈ ఫారాలు ఓటర్లకు అందజేయాలి.
- ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న వారంతా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి ఈ ఫారాన్ని డౌన్లోడ్ చేసుకుని పూర్తి చేసి అందించవచ్చు.
- వెబ్‌సైట్‌లో ఈ ఫారాలు అందుబాటులో ఉండటం మంచిదే. కానీ ఎంత మంది వెబ్‌సైట్ నుంచి ఫారం డౌన్లోడ్ చేసుకునే అవగాహన కలిగి ఉన్నారు ?

ఇక వలసల సమస్య కూడా తీవ్రమైనదే. బతుకుదెరువు కోసం వలసలు వెళ్లే బిహారీల గురించి అందరికీ తెలిసిందే. వలస కార్మికుల కష్టాలు మనకు తెలిసిందే. పొట్ట చేతబట్టుకుని బతుకుదెరువు కోసం వెళ్లిన కార్మికులు బూత్ స్థాయి అధికారి తనిఖీ కోసం ఇంటికి వచ్చినపుడు ఇంటిదగ్గర అందుబాటులో ఉండలేరు. అటువంటి వాళ్ళు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోంచి ఫారం డౌన్లోడ్ చేసుకుని పూర్తి చేసి తిరిగి అప్లోడ్ చేయగల సాంకేతిక అవగాహన భౌతిక పరిస్థితిలో అంటారా ?

తాజా ఆదేశాలతో ఇలాంటి ఎంతమంది అభాగ్యులు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఎదుర్కోనున్నారో !

### పారదర్శకత

- పత్రికా ప్రకటనలో నాలుగో పేరాలో ఉన్న విషయాలు మరింత ఆసక్తికరమైనది.
- పారదర్శకత కోసం బూత్ పోలింగ్ అధికారులు సేకరించే వివరాలు అన్నిటినీ ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. అయితే గోప్యత సమస్యల నేపథ్యంలో ఈ వివరాలు కొంత మంది ఎన్నికల సంఘం అధికారులు మాత్రమే ఇది ఖచ్చితంగా ఇబ్బందికరమైన పారదర్శకత.
- అందరికీ అందుబాటులో ఉండటానికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అయ్యే వివరాలు కొందరికి మాత్రమే చూసే వీలు కల్పించడం ఏ రకమైన పారదర్శకత ?!

### మరో కోణం

జూన్ 25వ తేదీ జాతీయ పత్రిక రాసిన సంపాదకీయంలో : "2004 తర్వాత పుట్టిన వారి జనన ధ్రువీకరణ పత్రంతోపాటు తల్లిదండ్రులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి రావడం అనేక గందరగోళానికి దారి తీసే ఆ ఆకాశం ఉంది. జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో బీజేపీ చేతిలో పావుగా మారిన అక్రమ వలసదారుల నినాదం రాష్ట్రంలో ఆర్థికంగా వెనకబడిన తరగతులు వారిని, ముస్లింలను లక్ష్యంగా మార్చుకోవడానికి రంగం సిద్ధం అవుతుందా అన్న సందేహం కలుగుతుంది. బిహార్‌లో పేద ఓటర్లు తాము ఓటర్లమే, చట్టబద్ధమైన పౌరులమే అని నిరూపించుకోవడానికి తిరగాల్సి రావడం సరైనది కాదు. అది కూడా ఋతుపవవాలు సమీపిస్తున్న తరుణంలో అసలు పనికిరాని పరుగులాట" అని వ్యాఖ్యానించింది. ఏ రకంగా చూసినా ఎన్నికల సంఘం ప్రకటించిన సంహార్ ఓటరు సవరణ కసరత్తు ఉన్న ఫలంగా పూర్తి చేయటం ఆచరణ సాధ్యం కాదు. ఈ రకమైన హడావుడి కసరత్తు రాష్ట్రంలో లక్షలాది మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ముంచుకొస్తోంది. సమగ్ర ఓటరు జాబితా సవరణ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం దీర్ఘకాలంగా అమలు చేస్తూ వచ్చిన విధి విధానాలనే తుంగలో తొక్కుతోంది. ఈ నిర్ణయం అనేక న్యాయపరమైన సమస్యలను ముందుకు తెస్తోంది.

### చివరి మాట

2003 తర్వాత కాలంలో ఓటర్లుగా నమోదైన వాళ్ళు తమ ఓటు హక్కు కాపాడుకోవడానికి గాను చూపించాల్సిన అనేక కాగితాల జాబితాను పరిశీలిస్తే చివరకు బిహార్ కూడా పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక ఉద్యమం ఇచ్చిన పిలుపు మేము కాగితాలు చూపించం అన్న నినాదాన్ని అందుకోవాల్సిన సమయం వచ్చినట్టు కనిపిస్తోంది. ❑

**అనువాదం కొండూరి వీరయ్య**

# కాళ్ల కింద నేల కదులుతోంది, గమనించారా !

(5వ పేజీ తరువాయి)

మొత్తంగా ఎన్నికల యంత్రాంగం మీద అపనమ్మకం అయితే ఏర్పడింది. ఆ అపనమ్మకాన్ని ఈ చౌరబాటుదారుల ప్రక్షాళన ఆశయం ఎదుర్కొనగలదా? ఓటర్ల తొలగింపునకు బీజేపీ, మోదీ చెబుతున్న కారణాలను ప్రజలు నమ్ముతారా? రాహుల్ వెల్లడి వల్ల ఎన్నికల సంఘమే కాదు, ప్రధాన మీడియా కూడా మరోసారి బోనెక్కింది. మీడియా ప్రాధాన్యాలు ఎట్లా ఉంటాయో, ఎంతగా తిమ్మిని బమ్మి చేస్తాయో, రాహుల్ సుదీర్ఘ ప్రెస్ మీట్‌కు ఇచ్చిన కవరేజ్ బట్టబయలు చేసింది. ఒక ప్రజా ప్రాముఖ్యమున్న అంశాన్ని అప్రధానం చేయడంలో ఎవరు ఎవరితో కుమ్మక్కై పనిచేస్తున్నారో ఏమంత రాజకీయ పరిజ్ఞానం లేని సామాన్యులకు అర్థమైపోయింది. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం అని చెప్పే మీడియా పతన దశ గురించి ఇంతకు ముందు నుంచి అనుకుంటున్నదే కానీ, ఈ ఘట్టంలో అది తిరుగులేని వాస్తవంగా ముందుకు వచ్చింది. 'సర్' మీద కొంత సానుకూల నిర్ణయాన్ని ప్రకటించి న్యాయవ్యవస్థ ఆశను మిగిల్చింది కానీ, ఇటీవలి పరిణామాలు తక్కిన వ్యవస్థలన్నిటి మీద తీవ్రమైన సంశయాన్ని కలిగించాయి. ఈ సంశయస్థితిని ఎంతోకొంత సవరించలేకపోతే, ప్రభుత్వానికి ఆమోదనీయత ఉండదు. అది లేకపోతే, అధికారంలో కొనసాగడానికి మరింత తీవ్రమైన నిరంకుశ విధానాలను అనుసరిస్తూ, హెచ్చుస్థాయిలో బలప్రయోగాన్ని, నిర్బంధచర్యలను ఆశ్రయించవలసి వస్తుంది. లేదా, సంస్థాగతంగా కలిగే కల్లోలానికి గురి కావలసి వస్తుంది. ఎర్ర కోట మీద తొలిసారిగా ఒక ప్రధాని ఆర్‌ఎస్‌ఎస్‌ను కీర్తించడం విశేషమే. ఆ సంస్థ నూరేళ్ల పండగ సందర్భంగా ఒక సంఘ్ ప్రచారక్ అయిన మోదీ ఆ పని చేయడాన్ని అర్థం చేసుకోవచ్చు. అంతమాత్రమేనా, ఈ సంక్షోభం నుంచి తనను గట్టెక్కించమని 'సంఘ్'కు అభ్యర్థన పంపడం కూడా ఆ ప్రశంసలో ఇమిడి ఉందా? డెబ్బై అయిదేళ్ల వయస్సు సందర్భంగా ప్రభుత్వ సారథ్యంలో మార్పును 'సంఘ్' కోరుతోందని కథనాలు వచ్చాయి. మరో పక్క ప్రతిపక్షంలో ఐక్యత, చొరవ, క్రియాశీలత పెరిగింది. ప్రభుత్వం దగ్గర కొత్త రాజకీయ ఆయుధాలు ఏవీ లేవని, పార్టీలో ప్రభుత్వంలో సృజనాత్మకత లోపించిందని ఎర్రకోట ప్రసంగం సూచిస్తోంది. 'ధర్మం' అంటే అనేకార్థాలు ఉన్నాయి కానీ, ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల నిలకడకి ప్రజల ఆలోచనల్లో ఉండే ఆమోదనీయత అటువంటిదే. ఆ లెజిటమసీ అనే ధర్మం లోపించి, ఒక్క కాలు కూడా వ్యవస్థకు ఊతం అందించని స్థితి వచ్చింది. ఇరుసులు విరిగిన రథం ఎంత దూరం పరుగులు తీయగలదు. ❑

# జాబితాల విశ్వసనీయత ఎంత



- పి.చిదంబరం

**బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్)ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం గత వారాంతంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కు రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. అవి : ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలి. ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా అంగీకరించాలి. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగుతోంది. అయితే 'సర్'కు సంబంధించి, న్యాయ సమీక్ష పరిధిలోకి రాని, అంశాలు కొన్ని ఉన్నాయి. అవి అసాధారణమైనవే కాదు. చాలా కలవరం కలిగిస్తున్నవి కూడా.**

**ముందుగా పేర్కొనవలసినది సవరణ ప్రక్రియ పేరు.** గతంలో ఓటర్ల జాబితా సవరణను ప్రత్యేక లేదా సంగ్రహ సవరణగా పేర్కొనేవారు. **రెండోది సవరణను చేపట్టిన నిర్దిష్ట సమయం :** ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. **మూడోది టైమ్ షెడ్యూల్ :** ఈ ప్రత్యేక సమగ్ర సవరణ తొలిదశను కేవలం 30 రోజులలో పూర్తి చేశారు. అభ్యంతరాలు, వాదనలను మరో 30 రోజుల్లో పరిష్కరిస్తారు. **నాలుగోది 'సర్' పరిధి :** ఇంతకుముందు ఓటర్ల జాబితా సవరణకు అప్పటికి చివరిసారిగా జరిగిన సవరణను ప్రాతిపదికగా తీసుకునేవారు. అయితే బిహార్ 'సర్'కు 2024 ఓటర్ల జాబితాలను ప్రాతిపదికగా తీసుకోలేదు. వాటిని పక్కన పెట్టేశారు. బిహార్‌కు పూర్తిగా సరికొత్త ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ 'సర్' లక్ష్యం, సందేహం లేదు. **ఐదోది :** ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఎనలేని ప్రాధాన్యమిస్తూ కొత్త ఓటర్ల పేర్లను చేర్చడంపై మౌనం వహించడం.

ఎన్నికల సంఘం అనుసరిస్తున్న ఈ వైఖరి వింతగా ఉన్నది. ఈ ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించినట్టు', ఏడు లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించుకున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా




ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది.

జనన, మరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సరైన విషయమే. అయితే 18 సంవత్సరాల వయసు వచ్చిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం సముచితం కాదూ? ఇది ఎన్నికల సంఘం విద్యుక్తధర్మం కాదూ ?

బిహార్ ముడి జనన రేటు (క్రూడ్ బర్త్ రేట్ – ఒక నిర్దిష్ట సంవత్సరంలో ప్రతి 1000 మంది జనాభాకు సంభవించే ప్రత్యేక జననాల సంఖ్యను సూచిస్తుంది. ఇది సంతానోత్పత్తి స్థాయి, జనాభా పెరుగుదలకు ప్రాథమిక సూచన) దృష్ట్యా 2024లో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి 18 సంవత్సరాల వయస్సు వచ్చిన యువతీ యువకులు లక్షల సంఖ్యలో ఉంటారు. ఇది సందేహాతీతమైన వాస్తవం. మరి ఈ కొత్త వయోజనుల పేర్లను కొత్త జాబితాలో చేర్చారా ? ఈసీఐ ప్రతిస్పందించలేదు. కారణమేమిటి ? ఎవరికీ తెలియదు.

36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియని వారు' అన్న నిర్ణయానికి ఈసీఐ ఎలా వచ్చింది ? ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారా ? సంబంధిత వ్యక్తులు తాము శాశ్వతంగా బిహార్ నుంచి వెలుపలి ప్రదేశాలకు వలసపోయామని తమకు తామే అంగీకరించారా ? సదరు 36 లక్షల మంది ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి ప్రయత్నించిందా ? 'సాధారణంగా స్థానికుడు' అన్న భావన ప్రామాణికతకు న్యాయపరమైన వ్యాఖ్యానాన్ని త్రోసిపుచ్చి దానికి ప్రత్యామ్నాయంగా 'శాశ్వతంగా వలస పోయినవాడు' అన్న భావనను ఈసీఐ ఎప్పుడు, ఎందుకు

ప్రవేశపెట్టింది ? ఏ ఒక్కరికీ తెలియదు. 'సర్' కార్యక్రమానికి విశ్వసనీయత లేదు. పారదర్శకత లోపించింది. సమర్థించే సాక్ష్యాధారాలు, సహేతుకమైన నిర్ణయాలు కొరవడ్డాయి. అసలు ఈ ప్రత్యేక సమగ్ర సవరణను ముందస్తు భావనలతో చేపట్టినట్టు కనిపిస్తోంది. వాటిని నిరూపించేందుకే ఆ కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నట్టుగా ఉన్నది. జాతి జనాభా ఏటా 0.89 శాతం చొప్పున పెరుగుతున్న దేశంలో ఓటర్ల జాబితా సవరణ ఏ విధంగా చేసినా ఓటర్ల సంఖ్య విధిగా పెరుగుతుంది. అయితే భారత ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన 'సర్' కార్యక్రమం అందుకు పూర్తి విరుద్ధమైన ఫలితాలనే చూపిస్తోంది ! 'సర్' అసలు ఉద్దేశం సంఖ్యానేక ప్రజల ఓటు హక్కును రద్దు చేయడమే. ఈ కారణంగానే తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు. ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటు వేసేందుకు అనుమతి ఉండదేమోనని ఎంతో మంది బిహారీలు సహేతుకంగానే శంకిస్తున్నారు. 'సర్'ను ఇతర రాష్ట్రాలలో కూడా చేపడతారని తెలుస్తోంది. బిహార్‌లో ఆ ప్రక్రియ ఫలితాల ఆధారంగా చూస్తే కోట్లాది ప్రజల ఓటు హక్కు రద్దయ్యే అవకాశమున్నది.

కర్ణాటకలో ఓటర్ల జాబితాకు సంబంధించి బహిర్గతమైన మరొక వాస్తవం ప్రజాస్వామ్యవాదులను అమితంగా జడిపిస్తోంది. ఆ రాష్ట్రంలోని 28 పార్లమెంటరీ నియోజక వర్గాలలో బెంగళూరు సెంట్రల్ ఒకటి. ఆ లోక్‌సభా నియోజకవర్గంలో ఎనిమిది శాసనసభా నియోజకవర్గాలు ఉన్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో బెంగళూరు సెంట్రల్ ఫలితాలు చూద్దాం. అందులోని ఎనిమిది శాసనసభా నియోజకవర్గాలలో ఒకటైన మహదేవపుర విషయాన్ని కాసేపు పక్కన పెడదాం. కాంగ్రెస్ అభ్యర్థి నాలుగు అసెంబ్లీ, బీజేపీ అభ్యర్థి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలోను ఆధిక్యతలో ఉన్నారు. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నికర ఆధిక్యత 82,178 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా ఉన్నది.

ఇప్పుడు మహదేవపుర నియోజకవర్గ ఫలితాన్ని చూద్దాం. ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 1,14,046 ఓట్ల ఆధిక్యత ఉన్నది. ఇది, కాంగ్రెస్ అభ్యర్థికి ఉన్న 82,178 నికర ఓట్ల ఆధిక్యతను రద్దు చేసి బీజేపీ అభ్యర్థికి 31,868 ఓట్ల మెజారిటీతో విజయాన్ని సమకూర్చింది. వీటికితోడు పోస్టల్ బ్యాలెట్లను కలుపుకుని బీజేపీ అభ్యర్థి మొత్తం 32,707 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. స్పష్టంగా ఉన్న ఈ వివరాలు తుది ఫలితాన్ని అనుమానాస్పదం చేయలేదు. అయితే ఈ 32,707 ఓట్ల ఆధిక్యత ఎలా సాధ్యమయింది ? ఈ విషయాన్ని నిశితంగా పరిశీలించాలి. కాంగ్రెస్ అభ్యర్థి, ఆయన బృందం ఓటర్ల జాబితాలు, ఇతర డాక్యుమెంట్లను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి కొన్ని అసాధారణ తప్పులను కనుగొన్నారు. బలవత్తరమైన ఈ ప్రాథమిక సమాచారం ఆధారంగా బీజేపీ అభ్యర్థికి లభించిన ఆధిక్యతలోని గుట్లు తెలుసుకున్నారు. మితిమీరిన సంఖ్యలో విభిన్న ఓటర్లు ఒకే నివాసంలో ఉన్నట్టుగా నమోదయ్యారు. సదరు ఓటర్ల ఓటర్ కార్డుపై వారి తండ్రి పేరు Xtkaprbsu అని అర్థం కాని విధంగా ఉన్నది. ఓటరు కార్డుపై ఓటర్ల వయసు '0' లేదా '124' అని ఉన్నది. ఇటువంటి ప్రాథమిక తప్పులు వేల సంఖ్యలో ఉన్నాయి.

ఓటర్ల జాబితాలో ఇటువంటి తప్పులు ఉన్నట్టు స్పష్టంగా వెల్లడయినప్పుడు వాటిపై విచారణ జరిపించవలసిన అవసరం లేదా ? సామాన్య వ్యక్తి ఎవరైనా 'అవును, జరిపించాల్సిందే' అని వెను వెంటనే ప్రతిస్పందిస్తాడు. అయితే మన ఎన్నికల సంఘం ఇంకెంత మాత్రం నియమబద్ధమైన ఒక మామూలు వ్యక్తిగా లేదా సంస్థగా వ్యవహరించడం లేదు! తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని, ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీని కానని ఈసీఐ గర్విస్తోంది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై పౌర సమాజ ఆక్షేపణలు, రాజకీయ పార్టీల ఆరోపణల విషయమై పార్లమెంటు ఉభయసభలలో చర్చించేందుకు గౌరవనీయ సభాపతులు ఇరువురూ విముఖత చూపుతున్నారు. దీనితో ఈసీఐ తనను తాను ఒక 'న్యాయస్థానం'గా భావించుకుంటూ రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు అఫిడవిట్లు దాఖలు చేయాలని డిమాండ్ చేస్తోంది !

**ఈ వ్యవహారంలో మహదేవపుర శాసనసభా నియోజకవర్గ ఓటర్ల జాబితా విశ్వసనీయత ఒక ప్రధాన వాదాంశం అన్న వాస్తవాన్ని ఎట్టి పరిస్థితులలోను విస్మరించకూడదు. పార్లమెంటులో దానిపై చర్చ జరగాలి. ఆ అంశంపైన కాకుండా అన్య అంశాలపై పార్లమెంటు దృష్టి పెట్టేందుకు అనుమతించకూడదు. ఈ విషయాన్ని మళ్లీ నొక్కి చెప్పుతున్నాను. ప్రధాన వాదాంశం ఓటర్ల జాబితాల విశ్వసనీయతే. మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందినవైనా లేదా బిహార్‌కు చెందినవైనా ఓటర్ల జాబితాల విశ్వసనీయతే ప్రధాన వాదాంశం. ఈ రోజు కాకపోయినా భవిష్యత్తులో ఈ మహోన్నత ప్రజాస్వామ్య దేశ ఓటర్లు తమ తీర్పు చెప్పే రోజునైనా భారత ఎన్నికల సంఘం కచ్చితంగా సమాధానమివ్వవలసి ఉంది.** ❑

# సర్ : సమస్యకు తప్పుడు పరిష్కారం



- యోగేంద్ర యాదవ్

ఓటర్ జాబితాలలోని సమస్యలకు ప్రత్యేక సమగ్ర సవరణే (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్) పరిష్కారమని భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ పునరుద్ఘాటించారు. ఇది పాత వాదనే. అయితే బెంగళూరులోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో మోసాలను రాహుల్‌గాంధీ బహిర్గతం చేసిన తరువాత ప్రత్యేక సమగ్ర సవరణే నిశ్చితమైన పరిష్కారమని సీఈసీ మరింతగా నొక్కి చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు వలలో పడ్డాడని బీజేపీ సామాజిక మాధ్యమాల గణాలు భావించాయి. ఓటర్ జాబితాల లోని లొసుగుల గురించి ఆయనెలా ఫిర్యాదు చేస్తున్నారు? వాటన్నిటినీ ప్రక్షాళన చేసేందుకే చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు ప్రతిపక్షనేత ఎందుకు మద్దతునివ్వడం లేదు? ఇత్యాది ప్రశ్నలు గుప్పించాయి. సీఈసీ సైతం ఇదే ఆలోచనా సరళిని అనుసరించారు. మూడు రోజుల క్రితం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు ఆ విషయాన్ని స్పష్టం చేసింది.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ బహుశా, 'యస్ మినిస్టర్'ను చూసి ఉండకపోవచ్చు. ఆ సుప్రసిద్ధ రాజకీయ వ్యంగ్య ధారావాహిక ఆ అప్రమాణిక ఆలోచనా సరళిని 'రాజకీయవేత్త తర్క పద్ధతి' అని అభివర్ణించింది. అదిలా ఉంటుంది. 'మనం ఏదో ఒకటి చేయాలి. ఆ నిర్దిష్ట పని ఇదే. కనుక మనం దాన్ని చేయాలి'. ఒక మౌలిక ప్రశ్నను అడగకపోవడమే ఈ ఆలోచనా సరళిలోని తార్కిక దోషం : మనం చేయవలసిన ఆ 'ఏదో ఒకటి', మనం చేయవలసిన 'నిర్దిష్ట పని'గా మనకు సూచించినదేనా? రాహుల్‌గాంధీని అపహసిస్తున్న వారు సరిగ్గా అడగని ప్రశ్న ఇదే : మనం చేయవలసిన పని 'ప్రత్యేక సమగ్ర సవరణ' ఓటర్ జాబితాలలోని లొసుగులు, మోసాలు, తప్పులను తొలగించేం దుకు చేపట్టవలసిన 'నిర్దిష్ట చర్యేనా?' సమాధానమేమిటి? ఇదీ అని భావిస్తే సరిపోదు. మన ఓటర్ జాబితాలలోని సమస్యలకు ప్రత్యేక సమగ్ర సవరణ తప్పనిసరి, తగిన ఫలితాలనిచ్చే సరైన పరిష్కారమనే నమ్మకం దురదృష్టవశాత్తు ఎవరికీ కలగడం లేదు. అయినా సీఈసీ వాదనను, దానిలో తర్క బద్ధత ఉందని భావించి, నిశితంగా పరీక్షిద్దాం.

మన ఓటర్ జాబితాలలో తీవ్ర లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూ మన తార్కిక విమర్శను ప్రారంభిద్దాం. ఓటర్ జాబితాల 'సమగ్రత' విషయంలో భారత ఎన్నికల వ్యవస్థ ప్రశస్తంగా ఉందనడంలో సందేహం లేదు. అయితే ఆ జాబితాల 'కచ్చితత్వం' లేదా 'నిర్దుష్టత' ఉండవలసిన రీతిలో లేదనేది ఒక వాస్తవం. ఇదేమీ కొత్త సమస్య కాదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల ఓటర్ జాబితాలలో కచ్చితత్వం ఉండవలసిన రీతిలో ఉండడం లేదు. ఆ జాబితాలలో మార్పులు, చేర్పుల విషయమై ఆరోపణలు పెద్దగా లేకపోవడం వల్ల వాటిలో కచ్చితత్వం తక్కువగా ఉందన్న వాస్తవం ప్రజల దృష్టికి రాలేదు. మహారాష్ట్ర, మహదేవపురలో ఓటర్ జాబితాలలోని మోసాలను బహిర్గతం చేసిన తరువాత ఆ తీవ్ర లోపం దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి వచ్చింది.

ఓటర్ జాబితాలలో లొసుగులు, లోపాలు తొలగించేందుకు ఎన్నికల సంఘం గత కొద్ది సంవత్సరాలుగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్న సీఈసీ వాదనను అంగీకరిద్దాం. యథాలాపంగా చేసే ఓటర్ జాబితాల సవరణ పరిష్కారం కాదు, కాబోదు. ఎందుకని? పౌరబాధ్యతల స్పృహ ఉన్న వారు తమ పేర్ల చేర్పుకు లేదా తీసివేతకు లేదా దిద్దుబాటుకు, నివాస ప్రదేశాల మార్పు గురించి తెలియజేయడానికి నివేదించిన అభ్యర్థనలకే ఈ సవరణ ప్రక్రియ పరిమితమవుతుంది. వార్షిక సంగ్రహ సవరణ మెరుగైనది. భారీ సంఖ్యలో చేర్పులు, తీసివేతలను సమగ్రంగా సమీక్షించేందుకు ఈ ప్రక్రియలో అవకాశమున్నది.. అయినా ఇది కూడా సంతృప్తికరమైన పరిష్కారం కాదు. ఎందుకని ? ఈ సంగ్రహ సవరణ సమయంలో బీఎల్ఓ (పోలింగ్ బూత్ స్థాయి అధికారి) ప్రతి ఇంటికి వెళ్లి యథార్థాలు తెలుసుకోవలసిన అవసరముండదు. ఏమైనా ప్రస్తుత విధానంలో సంవత్సరాలుగా అనేక లొసుగులు లోపాలు కొనసాగుతున్నాయి.

ఈ వాస్తవాల దృష్ట్యా పరిస్థితులను చక్కదిద్దేందుకు ఒక నిర్దిష్ట చర్య చేపట్ట వలసిన అవసరమున్నది. ఆ నిర్దిష్ట చర్య మరింత సమగ్రంగా, క్రమబద్ధంగా ఉండాలి. అదే సమయంలో అది మరింత పారదర్శకంగా, న్యాయబద్ధంగా కూడా ఉండి తీరాలి. సాధారణ సవరణలు, వార్షిక సంగ్రహ సవరణలతో పాటు ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టవలసిన అవసరమున్నది. ఈ ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలి. కొత్త ఓటర్లను

నమోదుచేయాలి. మృతులు, ఇతర ప్రదేశాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలి. ఇలా ఓటర్ జాబితాలను సవరించవలసి ఉన్నది. ఇదంతా ప్రామాణిక పద్ధతులలో జరగాలి. మరి బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఈ బాధ్యతలనే నిర్వర్తిస్తున్నది కదా అని ఆ ప్రక్రియను సమర్థిస్తున్న వారు తప్పక ప్రశ్నిస్తారు. నేను వారితో ఏకీభవించడం లేదు. వాస్తవమేమిటంటే ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు మనకు అవసరమైనదీ, మన ఎన్నికల చట్టాలను రూపొందించిన వారు ఉద్దేశించిందీ కాదు. ఈ 'ప్రత్యేక' సమగ్ర సవరణ తప్పని సరైనదీ కాదు, ఓటర్ జాబితాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సరిపోయేదీ కాదు. అనవసరంగా స్టెరాయిడ్లు, ప్రమాదకరమైన పదార్థాలు కలిసిన ఔషధమది. మనం ఎదుర్కొంటున్న సమస్యకు ఆ 'సర్' పరిష్కారం కాదు. అది సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. ఇప్పటికే చేసింది కూడా. బిహార్ 'సర్' ఎన్నికల చట్టం ఉద్దేశ్యంతో గానీ, ప్రత్యేక సవరణ స్ఫూర్తితో గానీ ముడివడి ఉన్న ప్రక్రియ కాదు. ఈ విషయాలను మరింత వివరంగా పరిశీలిద్దాం.

బిహార్‌లో చేపట్టిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రకారం సంభావ్య ఓటర్లు అందరూ ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తి చేసి ఇవ్వాలి. ఇవ్వని పక్షంలో తమంతట తామే ఓటరుగా నమోదు అయ్యేందుకు అనర్హులవుతారు. భారతదేశ ఎన్నికల చరిత్రలో ఇంతకు ముందెన్నడూ లేని నిబంధన ఇది. దీనికి ఏ విధమైన చట్ట ప్రాతిపదిక లేదు. చాలా చిన్న విషయం గా కనిపిస్తున్నా వాస్తవానికి మన ఎన్నికల వ్యవస్థలో ఒక మౌలిక మార్పు అని చెప్పి తీరాలి. గతంలో ఓటర్ల నమోదుకు ప్రభుత్వమే చొరవ చూపేది. ఇప్పుడు ఓటరుగా నమోదు కాదలుచుకున్న వారే అందుకు సొంతంగా శ్రద్ధ చూపాలి. అంటే వయోజనులను ఓటరుగా నమోదు చేసే బాధ్యత ఎన్నికల అధికారులకు ఉండదు. ప్రత్యేక సమగ్ర సవరణ ఆ బాధ్యతను ఓటర్ల పైనే మోపింది. ఓటర్ల నమోదులో ఇటువంటి మార్పు పర్యవసానాలు ఎలా ఉంటాయి ? పేద ప్రజలు, అవిద్యావంతులు, వలస జీవులు, మైనారిటీలు, మహిళలు ఓటర్లుగా నమోదు కావడం గణనీయంగా తగ్గిపోతుందనేది పలు దేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రతి ఒక్క సంభావ్య ఓటర్ కూడా ఓటరుగా నమోదయ్యేం దుకు తన అర్హతను నిరూపించుకునేందుకై వివిధ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తీరాలి. ఓటర్‌గా నమోదయేందుకు పలు డాక్యుమెంట్లను విధిగా సమర్పించవలసి రావడమనేది ఇంతకు ముందెన్నడూ జరగలేదు. ఈ కొత్త నిబంధనకు చట్టబద్ధమైన ఆధారమేమీ లేదు. అంతేకాదు పౌరసత్వ భావనను వ్యతిరేకి స్తుంది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకారం ఓటరుగా నమోదు కాగోరు వారు తమ తల్లిదండ్రుల పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలు సమర్పించాలి. ఇది పౌరసత్వ భావనను తారుమారు చేస్తుంది. తన పౌరసత్వాన్ని రుజువు చేసుకునే బాధ్యతను ఓటర్‌పైనే మోపుతుంది. ఈ అసంబద్ధతల సంచిత ప్రభావం సామూహికంగా ఓటు హక్కు తొలగింపు అనడంలో సందేహం లేదు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అసంబద్ధ నిబంధనల వల్ల చాలామంది తమ ఓటు హక్కును కోల్పోతారు. బిహార్‌లో 'సర్' సాధిస్తుంది ఇదే కాదూ ? ప్రత్యేక సమగ్ర సవరణ విధిగా ఓటర్ జాబితాల కచ్చితత్వాన్ని మెరుగు పరిచి తీరాలి. కానీ అలా జరగడం లేదు. ఈ బాధ్యతపై అసలు శ్రద్ధ పెట్టడం లేదని కూడా చెప్పాలి. ప్రతి ఇంటికీ వెళ్లి నిర్వహించే ఎన్యూమరేషన్‌లో తొలగింపులకు ఇచ్చే ప్రాధాన్యాన్ని అదనపు చేర్పులకు కూడా ఇవ్వాలి. బిహార్‌లో ఇలా జరగలేదు. జూన్ 25–జూలై 25 మధ్య నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో 65 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. అయితే అదనంగా ఒక్క పేరును ఆ జాబితాలలో చేర్చలేదు. నిజంగా ఇది సమగ్ర సవరణ కానేకాదు. అది సమగ్ర తొలగింపు ప్రక్రియ. ఇదొక నిష్ఠుర సత్యం.

ఓటర్ జాబితాల నుంచి నిర్దిష్ట ఓటర్ల పేర్లు తొలగించే ముందు వారు 'మృతులు', 'ఇతర ప్రదేశాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారు', 'జాడ తెలియడం లేదు' అని నమోదు చేసేముందు ఎన్నికల సంఘం నెలకొల్పిన సవివరమైన మార్గదర్శకాలను అనుసరించి ఉండవల్సింది. ఈ ప్రకారం ప్రామాణిక చట్టబద్ధ ప్రక్రియ (నోటీస్, విచారణ, అప్పీల్)ను అనుసరించి ఉన్నట్టయితే చాలా మంది 'మృత' ఓటర్ల ఫిర్యాదులకు గురికావల్సిన ఇబ్బంది ఎన్నికల సంఘంకు ఇప్పుడు ఉండేదికాదు.

ఓటర్ జాబితాల నాణ్యతను నిర్ధారించేందుకు వాటిని స్వతంత్ర తనిఖీకి నివేదించి ఉండవల్సింది. వాటి 'సంపూర్ణత్వం'పై సమాచారమున్నది గానీ, వాటి 'కచ్చితత్వం'పై సమాచారం లేదు. సువ్యవస్థిత, ఉన్నత ప్రమాణాల గణాంకాల వ్యవస్థలు ఉన్నా మన ఓటర్ జాబితాల నాణ్యత నిర్ధారణ లోపభూయిష్ఠంగా ఉండడం భారత్‌కు అప్రతిష్ఠాకరం. జనన మరణాల రిజిస్టర్‌పై స్వతంత్ర నమూనా తనిఖీ ఉన్నట్టుగానే ఓటర్ జాబితాల విషయంలో కూడా ఉండి తీరాలి. ప్రత్యేక సమగ్ర సవరణతోపాటు ఓటర్ జాబితాలలోని మోసాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై న్యాయసమ్మతమైన, విశ్వసనీయ విచారణ జరగాలి. అయితే ఈ విచారణ ఓటర్ జాబితాలను రూపొందించే బాధ్యతలలో పాల్గొంటున్న వారిచే జరిపించకూడదు. ఇది జరిగే పనేనా ? ఎన్నికల సంఘం అందుకు అనుమతించదని చెప్పవచ్చు. ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# ఓట్ల చోరీ : పత్రికా రంగం నిబద్ధత - బడా మీడియా పాత్ర



- పామెలా ఫిలిపోస్

యావత్ ప్రజాస్వామ్యానికి కీలకమైన అంశాలకు సంబంధించిన సమగ్ర పరిశీలన, పరిశోధన కోణాలు రాహుల్ గాంధీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పరిశోధక పాత్రికేయులకు కనిపిస్తాయి. ఎన్నికలు స్వేచ్ఛగా పారదర్శకంగానూ జరగడమే ప్రజాస్వామ్యానికి ఆరోగ్యదాయకం. ఆగస్టు 7వ తేదీ రాహుల్ గాంధీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సమావేశంలో అత్యున్నత స్థాయిలో చట్టబద్ధత ముసుగు వేసుకుంటున్న వ్యవస్థీకృత అవినీతిని బట్ట బయలు చేశారు. ఈ ఆరోపణలకు ప్రాతిపదికగా విశ్వసనీయమైన సమాచారం, స్పష్టమైన ప్రతిపాదనలు, వ్యక్తీకరణలు గాంధీ మాటల్లో, ఆయన చూపించిన ప్రజెంటేషన్‌లో ఉన్నాయి. ఈ చర్చలో ఓ విషయం స్పష్టమైంది. బెంగళూరు పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఉన్న మహదేవ్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో ఎక్కువ మొత్తంలో అవకతవకలు జరిగాయి. కేవలం ఈ ఒక్క నియోజవర్గంలోనే లక్ష అక్రమ ఓట్లు తారసపడ్డాయి. మహదేవ్‌పురలో గెలుపొందటానికి కావల సిన పథకాన్ని బీజేపీ సిద్ధం చేసుకున్నట్లు దీనివల్ల తేటతెల్లం అయ్యింది.

**అసలు విషయం వదిలేసి అల్పాహారం కోసం ఆబగా ఎదురుచూసిన విలేకరులు..**

లక్ష మంది అక్రమ ఓటర్లు అన్న మాటే విలేకరులను పరుగులు తీయించాలి. ఈ వాస్తవాల వెలుగులో విలేకరులు, వార్తా సంస్థలు తమ మేధో మథనానికి పదును పెట్టాలి. దేశంలో మారుమూల ఒకచోట జరిగినా మోసమే ఇంత భారీ స్థాయిలో ఉంటే, ఇటువంటి వ్యూహాలు దేశవ్యాప్తంగా అమలు జరిగి ఉన్నట్లయితే, దాని ప్రమాదకర పర్యవసానాలు ఇంకా ఎంత తీవ్రంగా ఉంటాయి ? సమావేశం పూర్తయిన తర్వాత హాజరైన విలేకరులు లేచి నిలబడ్డారు, ఆవలించారు. ఆ తర్వాత పక్కనే ఎదురుచూస్తున్న ఫలహారం వైపు పరుగులు తీశారు. అంతేతప్ప ఇంత పెద్ద వార్తను ఎలా కథనంగా మార్చాలి ? ఎటువంటి శీర్షికలు ఎంచుకోవాలి ? అన్న దిశగా చర్చలు లేవు. అభిప్రాయాలు, వ్యక్తీకరణలు లేవు. వీక్షకులు, పాఠకుల ముందు ఏదో ఒకటి వల్లె వేయడానికి సిద్ధపడిపోయారు. ప్రస్తుతం చుట్టూ ఉన్న మీడియా సంస్థలు బాకాలుగా ఎలా మారాయి అన్నది తెలుసుకోవడానికి రాహుల్‌గాంధీ నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్ తరువాత విషయాలను పరిశీలిస్తే సరిపోతుంది.

కేథరిన్ ది గ్రేట్ మహారాణిని మెప్పించడం కోసం ఆ దేశ సైన్యాధినేత గ్రిగొరి పోటెంకిన్ ఓ వ్యూహాన్ని పన్నుతాడు. సమకాలీన రష్యాలో దుర్భర గ్రామీణ జీవితాలను మహారాణి కంటపడకుండా చేయడానికి సైన్యాధినేత బ్రహ్మాండమైన రహదారిని నిర్మిస్తాడు. దాంతో దేశమంతా సస్యశ్యామలంగా ఉంది అనుకుంటుందా మహారాణి. మన చుట్టూ అపారమైన వార్తా ప్రపంచం విస్తరించి ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకునేలా మాట్లాడే యాంకర్లు – న్యూస్ రీడర్లు, నిత్యం జరిగే ఇష్టాగోష్ఠులు, ప్రతిభా పాటవాలు కలిగిన వారితో విశ్లేషణలు అన్ని కనిపిస్తూనే ఉంటాయి. కానీ ఇందులో ఏది వాస్తవానికి దగ్గరగా ఉండదు. గ్రిగొరి పోటెంకిన్ సృష్టించిన నకిలీ సస్య శ్యామలత్వమే కనిపిస్తుంది. **గాంధీ ప్రెస్ కాన్ఫరెన్స్ తరువాత వార్తా సంస్థల స్పందన..** మన కోసం వండి వార్చే పోటెంకిన్ వ్యవస్థలో అంతర్భాగమైన సమాచార వనరుల మీద మాత్రమే ఈ వార్త సంస్థలన్నీ ఆధారపడ్డాయి. ఎన్ఐ లాంటి వార్తా సంస్థలు, బీజేపీ ఐటీసెల్‌లు అలా పోటేంకిన్ తరహా వార్తలను వండి వారుస్తూ ఉంటాయి. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ ముగిసిన కాసేపటికి బీజేపీ ప్రముఖుల నుంచి వెలువడిన అద్భుతమైన మాటలు విని, చదివి చూడవల సిందే. వెలుగుచూసిన వాస్తవాలపై దుమ్మెత్తి పోయడానికి రవిశంకర్ ప్రసాద్, సంబిత్ పాత్ర లాంటి వాళ్లు ఎలాను ఉండనే ఉన్నారు. సాయంత్రం టీవీ చర్చల్లోనూ, తెల్లారి పత్రికల్లోనూ కనిపించిన వినిపించిన వ్యాఖ్యానం ఒకటే. 'ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు. ప్రజాస్వామ్యంలో కీలకమైనది అదే', 'ఎన్నికల సంఘం చర్చలకు పిలుస్తోంది. అయినా కావాలనే పార్లమెంటు నిర్వహణకు అవంతరాలు కల్పిస్తున్నారు' 'బాధ్యతారహితం, దేశ ద్రోహం' వంటి మాటలే వార్తలుగా చలామణి అవుతు న్నాయి. మరికొంతమంది దూకుడుగా "ఆయన అబద్దాలకోరు, అబద్ధాలు ఆడటం కాంగ్రెస్ సంస్కృతి" అంటూ ఆరోపిస్తున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాహు ల్‌గాంధీ చర్చకు పెట్టిన విషయాలను లోతుగా పరిశీలించడా నికి, విశ్లేషించడానికి విముఖత చూపించటం.

**తప్పుడు వార్తలను ఉద్ధృతం చేయటం రెండవ అంశం.** ఆజ్ తక్ ఒక వార్తను ప్రచురించింది. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలు ఫ్యాక్ట్ చెక్ చేస్తే, రాహుల్ గాంధీ ఆరోపణలకు ఆధారాలు లేవని పేర్కొన్నది. వెంటనే ఆ వార్తను, సోకాల్డ్ వార్తా సంస్థల వెబ్‌సైట్ పత్రికల్లో వైరల్ అయ్యింది. బీజేపీ సోషల్ మీడియా విభాగం కూడా ఈ తరహా వార్తలను విస్తృతంగా వ్యాపించేలా చేస్తుంది, చూస్తుంది. ప్రతిభావంతులైన ఫ్యాక్ట్ చెక్కర్స్ ఈ మోసపూరిత ఫ్యాక్ట్ **(మిగతా 16వ పేజీలో)**

# ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ నీతి తెలిసిన న్యాయమూర్తి

- ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్



రాజకీయం ఏమిటో తెలుసు. రాజ్యాంగ నీతి ఏమిటో తెలుసు. సంకుచితమైన పరిపాలనల గురించి తెలుసు. కనుక రాజ్యాంగానికి రాజకీయానికి తేడా తెలియని ప్రభుత్వాలను ప్రశ్నించిన వారు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి (సుప్రీంకోర్టు న్యాయమూర్తి: 2007-2011), ఆయన సాల్వా జుడుం కేసులో గుర్తుంచుకోవలసి గొప్ప రాజ్యాంగ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు ద్వారా గిరిజన వర్గాలను రక్షించడంతోపాటు రాజ్యాంగ బద్ధ పరిపాలన బలోపేతం చేశారు. ముందు న్యాయమూర్తిగా తరువాత లోకాయుక్తగా, పర్యావరణ పర్యవేక్షణ బాధ్యతను నిర్వహిస్తున్న సందర్భంలోను ఆయన న్యాయం రాజ్యాంగ నీతి పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. భారతదేశంలో రాజ్యాంగ వ్యవస్థను రూల్ ఆఫ్ లాను పరిరక్షించడంలో అవినీతి నిరోధక పర్యవేక్షణ, సంస్థాగత సమగ్రతను నిలిపించడానికి చేసిన కృషి ఒక విశిష్టమైన న్యాయ వారసత్వాన్ని నిలబెట్టారు.

ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ఎంపికైన జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో చాలామంది తెలిసిన వారే అయినా మన రాజ్యాంగ న్యాయం గురించి బాగా తెలిసిన జడ్జి. ఆయన తీర్పులు గణనీయమైనవి. ముఖ్యంగా అణగారిన వర్గాల ను పరిరక్షించడంలో, ప్రభుత్వాలు అధికారాన్ని దుర్మార్గంగా వాడుకునే పరిస్థితులను నియంత్రించడంలో ఆయన తీర్పులను అందరూ గుర్తుంచుకొంటారు. ఆయన తీర్పులు ఒక లోతైన రాజ్యాంగ స్ఫూర్తిని అర్థం చేసుకునే వీలుంటుంది. ప్రత్యేకించి, సాల్వా జుడుం తీర్పు మన భారత రాజ్యాంగ అమలులో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఈ తీర్పు ద్వారా, తీవ్రవాద వ్యతిరేక చర్యలు ప్రాథమిక హక్కులను కాలరాసేలా ఉండకూడ దని ధర్మాసనం ప్రభుత్వానికి హెచ్చరించింది. ఆ తీర్పును అమలు చేసిందా లేదా అని న్యాయవ్యవస్థ వివరించడం కష్టం. పదవీ కాలం ముగించిన తరువాత ఎవరు పట్టించుకుంటారు? రోజూ వందలాది తీర్పులు ఇచ్చే న్యాయమూర్తులు విడిగా వాటి అమలు కార్యక్రమం చేయడం సాధ్యం కాదు. స్వయంగా ప్రభుత్వం, మంత్రివర్గం, ఐఎఎస్, ఐపిఎస్ వంటి అధికార గణం, మొత్తం బ్యూరోక్రసీ బాధ్యత వహించాలి. చేయకపోతే, అమలు కోసం కొత్త కేసులు ఎన్ని కేసులు ఇస్తూ ఉంటారు ?

న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా పదవికి తమ అభ్యర్థిగా నామినేట్ చేయాలన్న ఇండియా కూటమి నిర్ణయం నిజంగా ప్రశంసనీయం. ప్రతి



కోణం నుండి చూసినా, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఈ రాజ్యాంగ పదవికి అత్యంత అర్హులు. నేటి రాజకీయంగా అల్లకల్లోలంగా ఉన్న వాతావరణంలో, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వంటి ఒక వ్యక్తిని అభ్యర్థిగా ఎంచుకోవడం, నీతి, రాజకీయ ప్రజాస్వామ్య విలువలకు నిలబడటాన్ని సూచిస్తుంది. ఇండియా కూటమి ఎంపిక నిర్ణయం న్యాయవ్యవస్థ సమగ్రత, రాజ్యాంగ పదవుల గౌరవం పట్ల వారికి ఉన్న గౌరవాన్ని తెలియజేసే అవకాశాన్ని ఇస్తుంది. ప్రతిపక్షంగా తప్పులు ప్రశ్నించే అవకాశం వస్తుంది. గెలుస్తారా లేదా అనేది వేరే విషయం. కొన్ని సిద్ధాంత కర్తలు వ్యతిరేకించినా సరే, భారత రాజ్యాంగం మూలస్తంభాలలో న్యాయవ్యవస్థకు ఒక కీలక పాత్ర ఉందని విశ్వసించవలసిందే. కొంతమంది న్యాయమూర్తులు తమ అచంచలమైన సమగ్రత, ప్రత్యేకమైన దార్శనికత, ప్రజాస్వామ్య సూత్రాలపై విశ్వాసం ద్వారా చరిత్రలో తమ పేర్లను లిఖించడం సాధ్యమవుతుంది. అందులో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఒకరని లెక్కబెట్టుకోవచ్చు.

## ఒక న్యాయ విద్యార్థి

నిజంగా ఆయన ఒక న్యాయ విద్యార్థి - అప్పటికీ ఇప్పటికీ. ఇక న్యాయవాదిగా జస్టిస్ రెడ్డి న్యాయవ్యవస్థను రాజకీయ అనారోగ్య ప్రభావం నుండి దూరంగా ఉంచాలనే బలమైన విశ్వాసం కలిగిన వాడు. ప్రశ్నిస్తాడు. జనంతో నడుస్తారు. సమావేశాల్లో స్వయంగా రూల్ ఆఫ్ లా గురించి స్పష్టంగా మాట్లాడతారు. భయపడరు. అందుకే ఆయన ఇచ్చిన మైలురాయి తీర్పులు

న్యాయ నిపుణులకు ఇప్పటికీ మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. జాతీయ ప్రాముఖ్యత కలిగిన కేసులలో ఆయన తీర్పులు సమాజంపై లోతైన ప్రభావాన్ని చూపగలవు. రాజ్యసభలో రాజకీయానికి రాజ్యాంగానికి తేడా చెప్పగలరు. 1946లో జన్మించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌లో తన న్యాయ విద్యను అభ్యసించి, లా కాలేజీ నుండి తన న్యాయ పట్టాను పొందారు. విద్యార్థి దశలోనే, ఆయన న్యాయవ్యవస్థ పట్ల ఒక బలమైన నిబద్ధతను, రాజ్యాంగ విలువలను లోతుగా అర్థం చేసుకోవడాన్ని సామాజిక న్యాయం పట్ల అంకితమైన వ్యక్తి. ఆయన 1971లో తన న్యాయ వృత్తిని ప్రారంభించి, హైకోర్టులు, సుప్రీంకోర్టులలో రాజ్యాంగ సంబంధిత విషయాలపై జనం పక్షాన వాదించారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు రాజ్యాంగ పరమైన సమస్యలలో ఆయన నిర్భయమైన వాదనచేసినందుకు గుర్తింపు పొందారు. 1995లో ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు, ఆ తర్వాత 2007లో సుప్రీంకోర్టు న్యాయ మూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. సామాన్య పౌరులకు న్యాయం అందేలా చూసేందుకు అనేక కార్యక్రమాలను ప్రారంభించిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (NALSA) ఛైర్మన్‌గా కూడా ఆయన పనిచేశారు.

నిస్సహాయులకు ఒక కవచంలా నిలిచేందుకు సిద్ధం రాజ్యాంగ విలువలు తరచుగా రాజకీయ ప్రయోజనాలతో ఘర్షణ పడుతున్న ఈ కాలంలో, జస్టిస్ రెడ్డి కృషి ఒక నిశ్శబ్దమైన కానీ శక్తివంతమైన వాదనగా నిలిచారనే ఆశాదీపం వెలుగుతుందను కుంటారు. రాజ్యాంగం కేవలం డబ్బున్నవారికి, మరీ శక్తిమంతులకు వారికి మాత్రమే ఒక సాధనం కాకూడదు, అది నిస్సహాయులకు ఒక కవచం అనే నమ్మకం రావాలి.

## సాల్వాజుడుం చదవండి

కొనసాగుతున్న భారతదేశం రాజ్యాంగ ప్రయాణంలో, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి చూపిన స్పష్టత ధైర్యంతో ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను నిరూపించిన న్యాయమూర్తులు కొద్దిమందే ఉన్నారు. 2007 మరియు 2011 మధ్య సుప్రీంకోర్టులో ఆయన సేవలు స్వల్ప కాలమే అయినా, అది రాజ్యాంగ న్యాయశాస్త్రంపై ఒక లోతైన ముద్ర వేసింది, ముఖ్యంగా సాల్వా జుడుం కేసులో ఇచ్చిన తీర్పు ద్వారా. 2011లో నందిని సుందర్ & ఇతరులు వర్సెస్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కేసులో జస్టిస్ రెడ్డి ప్రముఖ నిర్మాగా తీర్పు, వివాదాస్ప దమైన సాల్వా జుడుం ఉద్యమాన్ని, ప్రభుత్వం మద్దతుతో, స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ (SPOs) ద్వారా కొత్త సైన్యం వలె, సాయుధ నిఘా బృందం అనే పేరుతో నడపకూడదని గట్టిగా కొట్టివేసింది. ఈ SPOలలో చాలా మందికి శిక్షణ లేని గిరిజన యువకులు. అటువంటి పద్ధతి రాజ్యాంగేతరంగా రాష్ట్ర హింసను బయటి వారికి అప్పగించడం, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లను ఉల్లంఘించడమేనని తీర్పు పేర్కొంది. కనుకనే ఈ నిర్ణయం పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించడంలో రాజ్యాంగ విలువలను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించింది.

## రాజ్యాంగ బాధ్యతను విడిచిపెట్టడం తప్పు

జస్టిస్ రెడ్డి అభిప్రాయం ప్రకారం రాజ్యాంగ లోతైన నైతికతపై ఆధారపడి ఉంటుంది. అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 355 ప్రకారం పాలించాలన్న కేంద్ర రాష్ట్రాల బాధ్యతను, అనాగరిక మైన చట్టవ్యతిరేక మార్గాల ద్వారా కాదని, ఖచ్చితంగాకా కూడ దని గుర్తుచేసింది. పౌరులకు ఆయుధాలు ఇచ్చి హింసాత్మక సంఘర్షణకు గురిచేయడం "రాజ్యాంగ బాధ్యతను విడిచిపెట్ట డమే" అని స్పష్టంగా ప్రకటించారు. ఈ నిర్ణయం ఛత్తీస్‌గఢ్‌లో SPO వ్యవస్థను రద్దు చేయడమే కాకుండా, ఒక నైతిక ప్రమాణాన్ని నెలకొల్పింది : భద్రతా విధానాలు ఎంత అత్యవసర మైనవి లేదా రాజకీయంగా ప్రయోజనకరమైనవి అయినా, అవి రాజ్యాంగ పరిధిలోనే పనిచేయాలి.

## కాపలా కాయాల్సిన వ్యవస్థలు

శాసనసభ, న్యాయవ్యవస్థ మధ్య హద్దులను కాపాడుకోవాలి. కాపలాకాయడం వంటిది ఈ తీర్పు. ఆ తర్వాత సంవత్సరాలలో, శాసనపరమైన మార్గాల ద్వారా తీర్పును తప్పించుకోవడానికి ప్రయత్నాలు జరిగాయి. చేస్తారు. ప్రతిఘటిస్తారు. అయితే, 2025లో, సుప్రీంకోర్టు సాల్వా జుడుం తీర్పును సమర్థిస్తూనే అదే విషయంపై కొత్త కొత్త చట్టాలు చేసుకుంటూ, కొన్ని స్వల్ప మైన మార్పులతో సహా, తనంత తాను చేయవలసిన మంచి పనులు చేయకుండా ఉండడమే కాక, ఏదో రకంగా కోర్టుల నుంచి తప్పించుకోవడం ద్వారా అది కోర్టు ధిక్కరణ కాదని ప్రభుత్వవర్గాలు పరోక్షంగా ఆదేశిస్తున్నారు. తద్వారాకేంద్ర, రాష్ట్రాల అధికారాల విభజనను, మూడు వ్యవస్థల మధ్య విభజన లను మళ్లీ మళ్లీ ధృవీకరించింది. జస్టిస్ రెడ్డి గీసిన న్యాయ పరమైన గీత, పాలన ప్రాథమిక హక్కుల సంక్లిష్ట గందరగోళా ప్రాంతాన్ని బయటకు నడిపించడానికి ఒక మార్గదర్శకంగా ఇవి ఉంటాయి.

## నైతిక నిబద్ధత

రాజ్యాంగ లక్ష్యాన్ని కొనసాగించడం జస్టిస్ రెడ్డి రాజ్యాంగ విలువలకు ఆయన నిబద్ధత పదవీ విరమణతో ముగిసిపోలేదు. 2022లో, కర్ణాటకలో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల కోసం సమగ్ర పర్యావరణ ప్రణాళిక (CEPMIZ)ను పర్యవేక్షించే బాధ్యతను సుప్రీంకోర్టు ఆయనకు అప్పగించింది. ఈ పాత్ర ఆయన నిష్పాక్షికత మరియు పరిపాలనా నైపుణ్యంపై న్యాయవ్యవస్థకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుంది, ముఖ్యంగా పర్యావరణ న్యాయం మరియు సమానమైన అభివృద్ధి కలిసి జరిగేలా చూసుకోవడంలో. **(మిగతా 45వ పేజీలో)**

# మాలెగావ్ తీర్పే కాదు, విచారణా విచిత్రమే !



- ఎన్ వేణుగోపాల్

మహారాష్ట్రలోని మాలెగావ్‌లో 2008 సెప్టెంబర్ 29న జరిగిన బాంబుపేలుళ్ల కేసులో నిందితులుగా పదిహేడేళ్లుగా విచారణను ఎదుర్కొంటున్న ఏడుగురు నిందితులు నేరం చేశారని ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని ముంబైలోని ప్రత్యేక ఎన్ఐఏ న్యాయస్థానం న్యాయమూర్తి ఏకే లాహోటి జూలై 31న తీర్పు ప్రకటించారు. ఆరుగురు మరణించిన, వంద మంది దాకా గాయపడిన ఆ నేరం ఎవరుచేశారో ఇప్పటికీ బైట పడలేదు ! ఈ కేసు గురించి, విచారణ క్రమం గురించి, తీర్పు గురించి ఆలోచించవలసిన ఆసక్తిదాయకమైన అంశాలెన్నో ఉన్నాయి. ఇంత సుదీర్ఘకాలం విచారణ జరిపి కొండను తవ్వి ఎలుకను కూడా పట్టకపోవడం ఒక ఎత్తయితే, అసలు కొండను తవ్వే పనే సక్రమంగా జరగలేదని, అలా సక్రమంగా జరగకపోవడం ఉద్దేశపూర్వకమని, రాజకీయ ప్రేరితమని బైటపడుతున్నది.

ముస్లిం జనాభా ఎక్కువగా ఉండే మాలెగావ్‌లో ఒక మసీదు సమీపంలో నిలిచి ఉన్న మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబులు పేలి, ఆరుగురు మరణించిన ఆ కేసు దర్యాప్తును అప్పటి ప్రభుత్వం మహారాష్ట్ర ఆంటీ టెర్రర్ స్క్వాడ్ (ఏటీఎస్)కు అప్పగించింది. అప్పటి ఏటీఎస్ అధిపతి హేమంత్ కర్కరే నాయకత్వంలో ఆ దర్యాప్తు జరిగి అక్టోబర్-నవంబర్‌లలో 11 మంది అనుమానితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అఖిల భారత విద్యార్థి పరిషత్ మాజీ నాయకురాలు సాధ్వి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, మతాచార్యులు దయానంద పాండే అలియాస్ స్వామి అమృతానంద, రిటైర్డ్ సైనికాధికారి మేజర్ రమేష్ ఉపాధ్యాయ, అప్పటికి సైన్యంలో పనిచేస్తున్న అధికారి లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్ ఉన్నారు. వారిలో అత్యధికులు సంఘ్ పరివారంలో భాగమైన అభినవ భారత్ అనే సంస్థ సభ్యులని, ఆ సంస్థ హిందూరాజ్య స్థాపన లక్ష్యంతో విధ్వంసాలకు పూనుకుంటున్నదని ఏటీఎస్ అధికారి హేమంత్ కర్కరే చేసిన దర్యాప్తులో తేలిన విషయాలు చెప్పినప్పుడు, దేశంలోనే మొదటిసారి హిందుత్వ తీవ్రవాద సంస్థల కార్యకలాపాల గురించి బైటపడింది. ఈ సంస్థకు, అనుబంధ సంస్థలకు దేశంలో 19 చోట్ల జరిగిన పేలుళ్లతో సంబంధం ఉందని కూడా కర్కరే అన్నారు.

ఈ దర్యాప్తు వివరాలు బైటపడడంతోనే "కాషాయ తీవ్రవాదం" అనే మాట ప్రచారంలోకి వచ్చింది. అప్పటికి రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉండిన బీజేపీ, శివసేన ఇదంతా కాంగ్రెస్ పన్నాగమనీ, కేసు దర్యాప్తు ఇలా సాగించిన హేమంత్ కర్కరే "దేశద్రోహి" అనీ ప్రకటించారు. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ ఏటీఎస్ దర్యాప్తు మన సైనిక బలగాల నైతిక ధృతిని కించపరిచేలా ఉందని విమర్శించారు.

హేమంత్ కర్కరే ఈ దర్యాప్తు వివరాలు బైటపెట్టి, నిందితులను అరెస్టు చేసిన నెల రోజుల తర్వాత ముంబయి మీద జరిగిన తీవ్రవాద దాడిలో హేమంత్ కర్కరేను గురి చూసి కాల్చి చంపారు. ఆయన తీవ్రవాదుల కాల్పుల్లో చనిపోయారనే అభిప్రాయం ఎంత ఉందో, ఆయన హత్య వెనుక కుట్ర ఉందనే అభిప్రాయం అంత ఉంది. ఆయన చనిపోగానే తన శాపం వల్లనే చనిపోయాడని, సర్వనాశనం అవుతావు అని తానన్న మాట నిజమయిందని, కర్కరేను చంపినది కర్మ అని సాధ్వి ప్రజ్ఞా సింగ్ అన్న మాటలు ఆ అనుమానాలకు మరింత ఆజ్యం పోశాయి. మాజీ పోలీసు అధికారి ఎస్.ఎం.ముష్రిఫ్ 'హు కిల్డ్ కర్కరే ? ది రియల్ ఫేస్ ఆఫ్ టెర్రరిజం ఇన్ ఇండియా' అని పరిశోధనాత్మక పుస్తకం కూడా రాశారు.

మరొకవైపు, ఏటీఎస్ 2009 జనవరి 20న పదకొండు మంది నిందితుల మీద చార్జిషీట్ దాఖలు చేసింది. అప్పటికి ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పింది. 2011 ఏప్రిల్‌లో ఈ కేసును ఎన్ఐఏ తన పరిధిలోకి తీసుకుని, 2012లో మరొక ఇద్దరిని అరెస్టు చేసి నిందితుల సంఖ్యను 14కు చేర్చింది. 2016 మేలో ఎన్ఐఏ కొత్త చార్జిషీట్ తయారు చేసింది. ఊపా చట్టం కింద ఆరోపణలున్నప్పటికీ, 2017లో నిందితులందరూ బెయిల్ మీద బైటికి వచ్చారు. 2018లో విచారణ ప్రారంభమైంది. 323 మంది ప్రాసిక్యూషన్ సాక్షులను, ఎనిమిది మంది డిఫెన్స్ సాక్షులను విచారించిన తర్వాత, ప్రాసిక్యూషన్ నేర నిర్ధారణకు తగినంత విశ్వసనీయంగా, నిస్సందేహంగా సాక్ష్యాధారాలను సమర్పించలేదని తీర్పు వెలువడింది. ఈ మధ్యలో 2019లో సాధ్వి ప్రజ్ఞాసింగ్ బీజేపీ టికెట్ మీద లోకసభకు పోటీ చేసి గెలిచారు. ఆ తీర్పులోనే న్యాయమూర్తి కొందరు కీలకమైన సాక్షులను ఎన్ఐఏ ఉపసంహరించుకోవడం ప్రాసిక్యూషన్ ఉద్దేశాల గురించి ప్రతికూల నిర్ధారణలకు అవకాశం ఇచ్చిందని అన్నారు. ఆ సాక్షులను ప్రవేశపెట్టి ఉంటే, ఆరోపణలను రుజువు చేయడంలో చాలా ఖాళీలు పూరించబడేవని అన్నారు. "తీవ్రమైన అనుమానాలు" ఉన్నప్పటికీ, ప్రాసిక్యూషన్ వైఫల్యం వల్ల తాను నిర్ధారణలు చేయలేకపోయానన్నారు. కేసు విచారణకు, నేర నిరూపణకు ఉపయోగపడే సాక్షులను ప్రాసిక్యూషన్ తనంతట తానే ఎలా పక్కన పెట్టిందో తీర్పులో వివరంగా రాశారు. అలాగే, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 164 కింద మెజిస్ట్రేట్

దగ్గర నమోదు చేసిన పదమూడు మంది సాక్షుల వాంగ్మూలాలు మాయమైపోయాయని ఎన్ఐఏ కోర్టుకు చెప్పింది. అసలు పత్రాలు మాయమైపోతే, వాటి ఫొటోస్టాట్ కాపీలు వాడవచ్చునా అని చర్చ జరిగింది గాని, అవి కూడా విచారణకు రాలేదు. ఆ పత్రాలు మాయమైనప్పుడు, అవి ఏ మెజిస్ట్రేట్ ముందర నమోదయ్యాయో ఆ మెజిస్ట్రేట్‌ను విచారించాలి. కాని ప్రాసిక్యూషన్ వ్యతిరేకించింది. అయితే ఇలా ప్రాసిక్యూషన్ తప్పులను జాగ్రత్తగా నమోదు చేసిన న్యాయమూర్తి, ప్రాసిక్యూషన్ వ్యతిరేకించినా అవసరమైన సాక్షులను పిలవడానికి తనకున్న హక్కును ఎందుకు వాడుకోలేదో వివరణ ఇవ్వలేదు! విచారణలో మరొక పెద్ద మలుపు ఉంది. కేసు మొదలైనప్పటి నుంచీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వున్న రోహిణి సాలియాన్ ఈ కేసు విచారణలో వేగంగా సాగవద్దని ఎన్ఐఏ నుంచి తనకు ఆదేశాలు వచ్చాయని 2015లో బైట పెట్టారు. ఆ తర్వాత ఆమెను ఎన్ఐఏ ప్రాసిక్యూటర్ల జాబితా నుంచి తొలగించారు.

ఏటీఎస్ నేతృత్వంలో తాము చాలా బలమైన సాక్ష్యాధారాలు తయారు చేశామని, ప్రస్తుత కేసు ఓటమి సాక్ష్యాధారాల లేమి వల్ల జరగలేదని, సంస్థాగత, రాజకీయ నిజాయితీ కుప్పకూలడం వల్ల జరిగిందని ఆమె అన్నారు. కేసును ఎన్ఐఏ తీసుకున్న తర్వాత అప్పటికి సేకరించిన సాక్ష్యాధారాలను, అప్పటికే దాఖలైన చార్జిషీటును పక్కన పెట్టి, కొత్త దర్యాప్తు ప్రారంభించారని ఆమె అన్నారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక కేసు ఉద్దేశ పూర్వకంగా దారి తప్పించబడిందని అన్నారు. "చట్టాన్ని అమలు చేయవలసినవారే అధికారంలో ఉన్నవారిని సంతృప్తి పరచడం కోసం దురుద్దేశాలతో పని చేస్తే న్యాయం పట్టాలు తప్పడంలో ఆశ్చర్యమేమీ లేదు" అన్నారామె. ఇది కేవలం పద్ధతుల లోపం కాదనీ, రాజ్యాంగ వైఫల్యమనీ అన్నారు. ఇదీ మన నేర విచారణా, దర్యాప్తు వ్యవస్థల పని తీరు!! ❑

# ఓట్ల చోరీ : పత్రికా రంగం నిబద్ధత

**(14వ పేజీ తరువాయి)**

చెక్‌లోని విషయాలను బట్టబయలు చేసేంత వరకు ఈ వ్యాఖ్యానాలు చలామణి అవుతూనే ఉన్నాయి.


**ఇక మూడో అంశం టాకింగ్ పాయింట్స్ గురించి..** రాహుల్ గాంధీ చెబుతున్న విషయాలు ప్రమాణం చేసి, ప్రమాణ పత్రం సమర్పించి చెబితే, తగు చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తప్పులు బయటకు తీసిన వారిని ప్రమాణం చేయమని కోరటం పారదర్శకం కాదు. ఓ రకమైన బెదిరింపు మాత్రమే. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు లేవనెత్తిన అంశాలలో, లోతుపాతులు పరిశీలించి దేశానికి భరోసా ఇచ్చే విధంగా స్పందించాల్సిన ఎన్నికల సంఘం ఈ విధంగా గీత గీసి బరిలోకి దిగిన విధంగా వ్యవహరించటం ఎన్నికల సంఘం దురుద్దేశాలను వెల్లడిస్తోంది. కానీ ప్రైమ్ టైం వార్తా కథనాల్లో ఎన్నికల సంఘం విసిరిన ప్రతి సవాలే కీలకంగా చర్చనీయాం శం అయింది. రాహుల్‌గాంధీ విధి విధానాలు పాటించడం లేదు అన్న అభిప్రాయాన్ని దేశవ్యాప్తంగా కల్పించడానికి ప్రైమ్ టైం చర్చలు ప్రయత్నించాయి. మర్నాడు పత్రికల్లో వచ్చిన ప్రధాన శీర్షికలు ఎన్నికల సంఘం వాదనకే మొగ్గు చూపాయి. ఓ పత్రిక అయితే ఏకంగా ప్రమాణ పత్రం అందజేస్తారా, లేక ఆరోపణలు ఉపసంహరించుకుంటారా అని సవాలు విసిరింది.

**ఇక నాలుగో అంశం టీవీ చర్చలలో కనిపించిన ధోరణులు..** లేవనెత్తిన అంశాలు పసలేనివని చెప్పడానికి మాత్రమే ప్రతి టీవీ చర్చలోను విమర్శకులు ప్రాధాన్యతనిచ్చారు. పత్రికల్లో వచ్చిన ప్రధాన శీర్షికలలో రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలపై స్పందించిన తీరులో ఈ ధోరణి కనిపిస్తుంది. రాహుల్ గాంధీ ఎత్తుకున్న ఓట్ల దొంగల రాగం కాంగ్రెస్‌కే నష్టం కలిగించిందని టైమ్స్ నౌ నిర్ధారిస్తే, ఆటం బాంబా లేక పొగ బాంబా – బాంబా లేక హడావుడా అని ఇండియా టుడే వ్యాఖ్యానించింది.

**ఇక ఐదో అంశం,** ఒకటో అరో మినహాయింపులు తప్ప ప్రధాన పత్రికలన్నీ రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉన్న పలువురు వ్యక్తులు ప్రధాన మీడియా మోసపూరిత వైఖరి పట్ల అప్రమత్తంగా వ్యవహరించారు. తరుణ్‌గౌతమ్ అనే అతను మర్నాడు పత్రికల ప్రధాన శీర్షికలను ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ దైనిక్ జాగరణ్, అమర్ ఉజాల వంటి పత్రికలు కనీసం రాహుల్ గాంధీ ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో చెప్పిన విషయాలకు స్థానమే కల్పించలేదు అన్న విషయాన్ని బహిర్గతం చేశారు.

ఈ మొత్తం వ్యవహారంలో కనిపించేది ఏంటంటే, పౌర సమాజం నుంచి రాజకీయ రంగం నుంచి తలెత్తుతున్న ప్రశ్నలకు రాజ్యాంగబద్ధమైన సాధికారిక సంస్థగా స్పందించాల్సిన ఎన్నికల సంఘం ఒక రాజకీయ పార్టీలాగా స్పందించిందని ఒక రాజకీయ వ్యాఖ్యాత విశ్లేషించటం ముఖ్యమైన పరిణామం. ఇదిలా ఉండగా, కుహనా మీడియా సాధ్యమైన అన్ని ప్రయత్నాలలో రాహుల్‌గాంధీని కించపరిచే విధంగా వ్యవహరించడమే కాక ఎన్నికల సంఘం వైఫల్యాలను గుర్తించ నిరాకరించే విధంగా వ్యవహరించింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే మిర్రర్, ఇండియా టుడే విలేకరులు 80 మంది ఓటర్లకు నివాసంగా వున్న చిన్న గదిని ప్రత్యక్షంగా సందర్శించారు. రాహుల్‌గాంధీ దేశం ముందుంచిన విషయాలు వాస్తవమైనవేనని ధృవీకరించారు. ఈ పత్రికల విలేకరులు తమంతట తామే చొరవగా వెళ్లారా ? లేక న్యూస్ లాండ్రీ, న్యూస్ మినిట్ వంటి పత్రికల ప్రతినిధులతో వెళ్లారా ? ❑

# గాంధిని హత్య చేసిన గాడ్సే హిందువు కాదా..?




- బద్రీ రైనా

**వా**స్తవాల వెలుగులో హిందువులెవరూ ఉగ్రవాదులు కాలేరన్న ప్రభుత్వ వాదనలోని డొల్లతనం వెల్లడవుతోంది. 2006లో జరిగిన ప్రెజర్ కుక్కర్ పేలుడు కేసులో 12 మంది ముద్దాయి లను న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటిస్తూ జూలై 31న తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వచ్చిన రెండో రోజునే మహారాష్ట్ర ప్రభుత్వం తీర్పుపై అప్పీలు చేసింది. ఈ తీర్పు మహారాష్ట్ర సమీకృత నేరాల చట్టం కింద విచారణ జరుగుతున్న అనేక కేసులపై ప్రతికూల ప్రభావం చూపేదిగా ఉందని, అందు వల్లనే తీర్పుపై అప్పీలు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. బాంబే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు పాక్షికంగా స్టే విధించింది. పది రోజుల తర్వాత మాలెగాంలో కల్నల్ పురోహిత్, సాధ్వీ ప్రగ్యా సింగ్ ఠాకూర్‌లు ప్రధాన ముద్దాయిలుగా ఉన్న బాంబు పేలుళ్ల కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పులో ముద్దాయిలు అందరూ నిర్దోషులని ప్రకటించింది. ఈ బాంబు పేలుళ్లల్లో సుమారు వంద మంది గాయపడ్డారు. ఆరుగురు చనిపోయారు. ఈ తీర్పు వెలువడిన కొన్ని గంటల వ్యవధిలోనే భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి బాంబే హైకోర్టు తీర్పును కొనియాడారు. కాషాయ ఉగ్రవాదమనే వాదన ముందుకు తెచ్చినందుకు కాంగ్రెస్ పార్టీని దుయ్యబట్టారు.

ప్రెజర్ కుక్కర్ కేసులో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన మహారాష్ట్ర ప్రభుత్వం, మాలెగాం బాంబు పేలుళ్ల కేసులో మాత్రం ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం తీర్పును శాశ్వత తీర్పు అన్నట్లు వ్యవహరిస్తోంది. ఇది న్యాయపరమైన ప్రమాణాల ప్రకారం తీసుకున్న నిర్ణయం కాదు. ఎందుకంటే ఏ న్యాయ ప్రమాణమూ ఓ తీర్పును తాత్కాలికమైనదిగానూ, మరో తీర్పును శాశ్వతమైనదిగానూ చెప్పదు. అటువంటి వర్గీకరణ పాలక పార్టీల ప్రయోజనాలు ప్రమాణాల ప్రకారమే తప్ప చట్ట పరమైన వర్గీకరణ కాదు. హిందువులు ఎవ్వరూ ఉగ్రవాదులు కాలేరు, ముస్లిం మతంలోనే అటువంటి ధోరణులు ఉంటాయన్న సైద్ధాంతిక కోణం నుంచి వస్తున్న ప్రకటనల్లో అర్థం లేదు.

ఈ ప్రమాణాన్ని బట్టి చూస్తే నాథూరాం గాడ్సేను హిందువు కాదని ప్రకటించాలి. శ్రీలంకలో ఆత్మాహుతి దళాలను తయారు చేసిన ఎల్టీటీఈ శ్రేణులు హిందువులు కాదని ప్రకటించాలి. మావోయిస్టులు ఉగ్రవాదులేనని ఘంటాపథంగా చెప్తున్న హిందూత్వ శక్తులు, ఇప్పుడు వీరందరినీ హిందువులు కాదని ప్రకటించాలి. సిక్కులను కూడా హిందువులుగానే పరిగణిస్తున్న



కాషాయ దళాలు ఖలిస్తాన్ ఉగ్రవాదానికి పాల్పడ్డవారందరినీ హిందువులు కాదని తీర్మానం చేయాలి. వలసవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసాత్మక చర్యలకు పాల్పడిన ప్రముఖ హిందువులను, బ్రిటిష్ ప్రభుత్వం ఉగ్రవాదులుగా ప్రకటించి ఉరిశిక్షలు వేసిన విషయాన్ని మినహాయిస్తే, పైన ప్రస్తావించిన ఉదాహరణలన్నీ తాజా అనుభవాలే.

### ప్రభుత్వ ప్రాసిక్యూటర్ దిగ్భ్రాంతి..

మాలెగాం బాంబు బ్లాస్టు కేసుల్లో ప్రభుత్వ ప్రాసిక్యూటర్‌గా రోహిణి సాలియన్ వ్యవహరించారు. ఆమె ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలో సాలియన్ చెప్పిన విషయాలు దిగ్భ్రాంతి కలిగించేవిగా ఉన్నాయి. 2014లో కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత ఎన్ఐఏ అధికారి తనను కలవల్సిందిగా కబురు పంపిన విష యాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. పై నుంచి ఇచ్చిన ఆదేశాల ప్రకారం, మాలెగాం కేసులో దూకుడుగా వ్యవహరించరాదని సలహా ఇచ్చారని సాలియన్ చెప్పారు. 164 స్టేట్‌మెంట్ల ద్వారా సేకరించిన సాక్ష్యాలన్నింటినీ పక్కకు పెట్టి ఎన్ఐఏ అధికారులు కొత్తగా సాక్ష్యాలు సేకరించి కోర్టు ముందుంచారని ఆమె గుర్తు చేశారు. కల్నల్ పురోహిత్‌ను నిర్దోషిగా విడుదల చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు తాను ఊహించినదేనని సాలియన్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించి మాలెగాం తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందా లేదా అన్నది చూడాలి. ❑

**అనువాదం: కొండూరి వీరయ్య**

# ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్ట్ లక్షణాలు.. పరిశీలన

- పి.బి.చారి

**'రాజ్యం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు, దాని ఫలితం సామాజిక సంక్షోభం, రాజకీయ సంక్షోభం, సాంస్కృతి సంక్షోభంగా విస్తరిస్తున్నప్పుడు నగ్నంగా, బహిరంగంగా రాజ్యమే టెర్రరిస్ట్ రూపం ధరిస్తుంది' అదే ఫాసిజం అని స్టాలిన్ నిర్వచించాడు. ఫాసిజం అంటే అసహనం దాని మౌలిక లక్షణం. ఆ అసహనం ద్వేషం వైపునకు దారితీస్తుంది. మనుషులను విభజిస్తుంది. ఈ విభజన రేఖను అడ్డుకునే కమ్యూనిస్టులు, ప్రగతి శీల శక్తులు ఈ సమాజం మారాలని, కుల మత వ్యవస్థ లేని, మనుషుల మధ్య ఎలాంటి అంతరం లేని సమాజం సృష్టి కోసం ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నాన్ని ఆటంకపరిచేదే ఫాసిజం.**

వందేళ్లకు ముందే ఈ ఫాసిజం యూరప్‌ను కుదిపివేసింది. 1919లో మార్చ్ ఆన్ రోమ్ అనే పేరుతో "బెనిటో ముస్సోలిని" రోమన్ చక్రవర్తి ఇంటి మీద దాడి చేశాడు. ఆ దాడికి భయపడి చక్రవర్తి అధికారాన్ని ముసోలినికి అప్పగించాడు. ఈ ఫాసిస్ట్ సిద్ధాంతాలు జర్మనీకి వ్యాపించి అక్కడ హిట్లర్, అలాగే స్పెయిన్‌లో అప్పటికే ఉన్న ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని రద్దుచేసి "ఫ్రాంక్" అధికారంలోకి వచ్చాడు.

రెండవ ప్రపంచ యుద్ధంలో రెండు కోట్ల మంది సోవియట్ యూనియన్ రెడ్‌ఆర్మీ ప్రాణత్యాగాలతో ఫాసిజం ఓడించబడింది. ముస్సోలిని నడిబజార్‌లో విప్లవ శక్తులు, ప్రజలు ఖండ ఖండాలుగా నరికి చంపారు. రష్యన్ ఎర్ర సైన్యం దెబ్బకు హిట్లర్ స్వగృహంలో ఆత్మహత్య చేసుకుని కుక్క చావు చచ్చాడు. 1930 నాటి హిట్లర్ అకృత్యాలను గుర్తు చేస్తూ ఫాసిజం లక్షణాలను 'హోలోకాస్ట్' అనే మ్యూజియంలో ఒక పోస్టర్ మీద రాసి పెట్టారు. అలాంటి లక్షణాలు ఇప్పటికీ వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. అవి మన దేశంలోను చొరబడ్డాయి. ఆర్‌ఎస్‌ఎస్ పాలనలో శరవేగంగా అమలు చేయబడుతున్నాయి.

### 1. శక్తివంతమైన జాతీయవాదాన్ని ప్రబోధించటం :

ప్రపంచంలోని అన్ని జాతులకన్నా మన జాతి మాత్రమే ఉన్నతమైనదని, శక్తివంతమైనదనే ఆధిక్య భావనను ప్రదర్శించడం. హిట్లర్, జర్మన్ జాతి ఆర్యన్ జాతి అని అది అన్ని జాతులుకన్నా గొప్పదని ప్రపంచాన్ని పరిపాలించే శక్తి దానికే ఉన్నదని ఒక కుహనా జాతీయ భావనని రెచ్చగొట్టాడు. ఆ




విధంగా జర్మన్లను జాతి పేరుతో ఏకం చేయటానికి ప్రయత్నించాడు. మన దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ హిందూ మతాన్ని ఒక జాతిగా అంటే హిందూ జాతిగా చెబుతూ ఇతర మతాలను ఇతర జాతులుగా నిర్వచిస్తూ, మనమంతా 'హిందువులం, సింధూ నది బిందువులం. మన జాతి అత్యుత్తమమైనది, మన గతం ఎంతో గొప్పది. మనం విశ్వ గురువులం అంటూ లేని అధికృతను ప్రచారం చేస్తూ ఇతర మతాల మీద ద్వేష భావాన్ని రెచ్చగొట్టడం ద్వారా హిందువులను ముస్లింలకు వ్యతిరేకంగా పోలరైజ్ చేయటం చూస్తూనే ఉన్నాం. హిట్లర్ యూదులను టార్గెట్ చేస్తే మన దేశంలోని ఆర్‌ఎస్‌ఎస్ ముస్లింలను, క్రిస్టియన్లను, దళితులను టార్గెట్ చేస్తూ ఉంది.

### 2. మానవ హక్కుల పట్ల వ్యతిరేకత

మనుషులకు కొన్ని సహజమైన హక్కులు ఉంటాయని, ఆ హక్కులను గౌరవించాల్సి ఉంటుందని గుర్తించకపోవడం. ఇప్పుడు మన దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతున్నది. ప్రజలు ఏ దుస్తులు ధరించాలో, ఏ ఆహారాన్ని భుజించాలో నిర్ణయించుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఆ హక్కుల మీద ఈ రోజున దాడి జరుగుతున్నది. మాంసాహారం తింటే తామస ప్రవృత్తి వస్తుందని, బ్రాహ్మణ సాత్వికాహారం తినాలని ప్రచారం చేస్తున్నారు. భారతదేశంలో 90 నుంచి 95 శాతం మంది మాంసాహారులే. కేవలం ఐదు శాతం మంది మాత్రమే శాఖాహారులు. ఐదు శాతం మంది ఆహారపు అలవాట్లను 95శాతం మంది మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచంలో సైన్స్‌తోపాటు అనేక రంగాలలో కొత్త కొత్త

ఆవిష్కరణలు చేసిన శాస్త్రవేత్తలు అందరూ మాంసాహారులే ఆ విషయాన్ని మరుగుపరిచి వీళ్ళు ప్రచారం చేస్తున్నారు. జర్నలిస్టులు, మేధావులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాస్తే, గళమెత్తితే, అది దేశ వ్యతిరేకత అని వారి మీద రాజ ద్రోహం కేసులను మోపటం మనం కళ్ళ ముందు చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వం మీద వ్యతిరేకంగా రాస్తే అది దేశానికి వ్యతిరేకం ఎలా అవుతుంది ? అలా కాదని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యక్తపరిచిన అభిప్రాయాలు, దేశ వ్యతిరేకంగా వ్యక్తపరిచినవిగా భావించకూడదని సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పింది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తే అది దేశ వ్యతిరేకమని ప్రచారం చేయడమే ఫాసిస్టు లక్షణాల్లో ఒకటి.

### 3.ఒక శత్రువును సృష్టించుకుని దానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టడం :

లేని శత్రువును, శత్రువు కాని వారిని శత్రువులుగా సృష్టించి ఆ శత్రువు మన మీద దాడి చేయబోతుంది. మనమందరం ఐక్యమై దానికి వ్యతిరేకంగా పోట్లాడాలి. ఆనాడు హిట్లర్ యూదులను శత్రువులుగా చిత్రీకరించి వారిని అంతమొందించే ప్రయత్నం చేశాడు. ఈనాడు మనదేశంలో ఆర్ఎస్ఎస్ ముస్లింలను, క్రిస్టియన్లను, కమ్యూనిస్టులను శత్రువులుగా చిత్రీకరించటం చూస్తున్నాం.

### 4. స్త్రీలను చిన్నచూపు చూడటం

హౌలో కాస్ట్ మ్యూజియంలోని పోస్టర్ మీద రాసి ఉన్న ఫాసిస్టు లక్షణాల్లో ఇది ఒకటి. స్త్రీలకు హక్కులను నిరాకరించడం, వంటింటి కుందేళ్లుగనే ఉండేట్లు చేయటం. మనదేశంలోని ఆర్ఎస్ఎస్ నాయకుడు మోహన్ భగవత్ ఆడవాళ్లు వంటింటికే పరిమితం అవ్వాలని బోధిస్తున్నాడు. మనుధర్మ శాస్త్రంలో ఉన్నట్లు స్త్రీ చిన్నప్పుడు తండ్రి మీద, పెళ్లయిన తర్వాత భర్త మీద, విధవరాలు అయితే పిల్లల మీద మాత్రమే ఆధారపడి ఉండాలని, ఆమెకి ఎలాంటి స్వతంత్రత లేదని ఆ శాస్త్రం చెబుతుంది. అదే మన సమాజానికి హితమైనదని ఆ మనుస్మృతి యే మన రాజ్యాంగం అని, దానిని అమలు పరచడమే తమ కర్తవ్యమని ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తున్నది.

### 5. ప్రచార సాధనాలన్నీ తమ గుప్పెట్లో పెట్టుకోవటం :

దేశంలోని ప్రచార సాధనాలు అన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని తాము చెప్పే అబద్ధాలే నిజాలుగా ప్రచారం చేయడం. హిట్లర్ పాలనలో ప్రచార మంత్రిగా ఉన్న “గోబెల్స్” ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్తే అదే జనం నిజమని నమ్ముతారని అన్నాడు. అంటే అబద్ధాలే వాళ్ల ప్రచార ఆయుధాలు. ఈనాడు మన దేశంలో జాతీయ టీవీ చానల్స్ 70కి పైగా టీవీ 18 నెట్‌వర్క్ ఆధీనంలో ఉన్నాయి. దీని యజమాని అంబానీ. అంబానీ ఇప్పుడున్న ఆర్ఎస్ఎస్‌కు, ప్రభుత్వానికి అత్యంత సన్నిహితుడు. ప్రభుత్వ వ్యతిరేక గళం, ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపే ఎన్డీటీవీ సహితం ఆదాని హస్తగతం చేసుకున్నాడు. అదాని మోడీ ప్రభుత్వానికి ఆప్తమిత్రుడు. ఇప్పటి ప్రభుత్వం మీడియా మొత్తాన్ని నియంత్రించడం, ఎవరైనా ప్రభుత్వాన్ని విమర్శించే ది వైర్ లాంటి, దైనిక్ భాస్కర్, న్యూస్ క్లిక్ వంటి, ఇతర మాధ్యమాల మీద సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ టాక్స్ లాంటి దర్యాప్తు సంస్థలు దాడి చేయటం. స్వతంత్రంగా ఉండాల్సిన ఈ సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకోవటం, దాడులు చేసి లొంగదీసుకోవ డానికి ప్రయత్నం చేయటం, లొంగని వాళ్ళ మీద కేసులు పెట్టడం జైలుపాలు చేయటం మన దేశంలో నిత్య కృత్యంగా మారింది.

### 6. జాతీయ భద్రత :

మన జాతి మీద ఇతర జాతులు యుద్ధం చేయబోతున్నాయి అనే ఒక బూచిగా చూపటం. వాళ్లు యుద్ధం చేయబోతున్నారు కాబట్టి మనం భద్రంగా ఉండాలి అని అంటే ముందు మన అంతర్గతంగా ఉన్న శత్రువులను ముఖ్యంగా ముస్లింలను, క్రిస్టియన్లను, దళితులను, కమ్యూనిస్టులను తుదముట్టించాలి. వీళ్లకు వ్యతిరేకంగా జాతిని ఐక్యం చేయాలి అనే భావనలను ప్రచారంలోనూ ఆచరణలోనూ పెట్టే ప్రయత్నం చేయటం.

> **జాతీయ భద్రతకు ఎలాంటి ముప్పు లేకపోయినప్పటికీ ఏదో ప్రమాదం సంభవించబోతుంది అని ప్రజలలో భయాందోళనలు కలిగించే ప్రచారాలు చేసి ఎన్నికలలో లబ్ధి పొందటం. పుల్వామా దాడి ఘటన దీనికి రుజువు. పాకిస్థాన్ టెర్రరిస్ట్ చేతుల్లో 40 మందికి పైగా మన వీరజవాన్లు వీరమరణం పొందారు. వాళ్ల రోడ్డు మార్గం గుండా కాకుండా విమాన మార్గం ద్వారా వచ్చి ఉన్నట్లయితే వాళ్ల ప్రాణాలు పోయేవి కాదు. అలాంటిది అవసరమని విమానాలు పంపాలని, ఆనాటి కాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ప్రధానికి, హోం మంత్రికి, రక్షణ మంత్రికి, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కి చెప్పినప్పటికీ ఎలాంటి సౌకర్యం ఇవ్వకపోగా 40 మంది జవాన్ల మరణాలలో జరిగిన ప్రభుత్వ తప్పిదాన్ని ఎవరి వద్ద చెప్పవద్దని సత్యపాల్ మాలిక్‌కు హుకుం జారీ చేసినట్లుగా ఆయనే ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. ఆ దాడి అనంతరం సర్జికల్ స్ట్రైక్. ఆ సర్జికల్ స్ట్రైక్‌ని అడ్డం పెట్టుకొని దేశంలో జరిగిన ఎన్నికల్లో లబ్ధి పొందారు.**

ఇలాంటివన్నీ ఫాసిస్టు లక్షణాలే, మన దేశంలో మనం గమనిస్తూనే ఉన్నాం.

**7. మతం, రాజకీయాలు, పరిపాలన కలగలిసిపోవడం:**

మన దేశం ఒక సెక్యులర్ రాజ్యం. ఫెడరల్ వ్యవస్థ. అంటే సమాఖ్య దేశం. బహుళ సంస్కృతులు ఉన్న దేశం. సెక్యులర్ స్ట్రక్చర్. సెక్యులరిజం అంటే రాజ్యానికి మతం ఉండకూడదు. మత ప్రసక్తిలేని లౌకిక రాజ్యం. అంటే పరిపాలకులు మత ప్రచారాలలోనూ, మత క్రతువులలోనూ పాల్గొనరాదు. దేశంలోని ప్రజలు వారు ఏ మతాన్ని అయినా అవలంబించవచ్చు. ఏ మతంలోకి అయినా మారవచ్చు. అసలు మతమే అవసరం లేదు అనుకునే వారు మతరహితులుగా ఉండే అవకాశం కూడా రాజ్యాంగం కల్పించింది. అలాంటి గుండెకాయ లాంటి రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మోడీ ప్రభుత్వం మత క్రతువులలో పాల్గొనటమే కాదు, మత ప్రచారాలను ప్రోత్సహించడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడంలో కూడా ముందే ఉన్నది. మతం వ్యక్తిగతం. పరిపాలనలో మతాన్ని కలపకూడదు. కానీ కుంభమేళాలు, చండీ యాగాలు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భూమి పూజలు లాంటి వాటిలో పాల్గొంటూ, సమాజంలో భక్తి పేరుతో, దేవుడి పేరుతో ప్రజల మధ్య విభజనను పెంచుతున్నది. మన దేశంలో స్వతహాగా ఉన్న రాజ్యాంగంలో పొందుపరిచిన సెక్యులరిజం అన్నదాన్ని తీసివేయాల్సిందే అని ఆర్ఎస్ఎస్ బహిరంగంగానే ప్రకటిస్తున్నది. ఆ పదాన్ని తొలగించటానికి అనేక ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది. సెక్యులరిజాన్ని తీసేసి ఈ దేశాన్ని ఒక మత రాజ్యంగా మార్చాలని కుట్రలు పన్నుతున్నది ఆర్ఎస్ఎస్. ఇది ఫాసిస్టు లక్షణమే.

**9. కార్పొరేట్ ఆధిపత్యాన్ని సమర్థించడం :**

కార్పొరేట్ శక్తులు బలపడేలా చూడటం. ఈ శక్తులే ప్రభుత్వం మీద పెత్తనం చెలాయించడం. వాళ్ల చెప్పు చేతల్లోనూ, వాళ్ల కనుసన్నల్లోనే ప్రభుత్వాన్ని నడపటం. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని పెంచి పోషించటం. ప్రపంచంలో 603వ స్థానంలో ఉన్న ఆదాని, మోడీ అధికారంలోకి వచ్చిన 2014 తర్వాత నుండి మొన్న మొన్నటి వరకు ప్రపంచంలో మూడో స్థానానికి ఎలా ఎదిగాడు ? మోడీ, మోడీ ప్రభుత్వం అదాని లాంటి కార్పొరేట్ శక్తుల ఎదుగుదలకు నియమ నిబంధనలను కూడా ఉల్లంఘించి ఆదానికి సాయపడటం వలనే అది సాధ్యమైంది. అదాని మోడీ మైత్రి గురించి పార్లమెంట్లో ప్రస్తావిస్తే ప్రభుత్వం మౌనమే సమాధానం. అంతేకాదు వేరే కుంటిసాకులు చూపుతూ ఎదురుదాడి చేస్తూ, ప్రభుత్వమే పార్లమెంటు జరగకుండా స్తంభింపజేయటం మనం చూశాం. పార్లమెంటు సభ్యులు ఆ విషయాన్ని ప్రస్తావిస్తే, వారు ప్రస్తావించిన విషయాలను రికార్డుల నుంచి తొలగించడం, మైకులను కట్ చేయడం మోడీ ప్రభుత్వ దమననీతికి, ప్రజాస్వామ్యం మీద కనీస గౌరవం లేకపోవటానికి నిదర్శనం. కార్పొరేట్లకు కొమ్ము కాయటమంటే దేశంలోని కార్మిక, కర్షక సమస్త శ్రామికవర్గాన్ని అణిచి ఉంచటం.

**10. ప్రతి దాన్ని నేరంగా చూపించడం :**

నేరానికి శిక్ష వేయటం. ఒక మనిషి నేరం చేశాడని ఆరోపణ చేస్తే సరిపోదు. రాజ్యాంగం ప్రకారం ఒక రూల్ ఆఫ్ లా ఉన్నది. సహేతుకమైన ఎటువంటి అనుమానానికి తావు లేని పద్ధతిలో నేరం చేశాడని రుజువైతే తప్ప అతను నేరస్తుడు అని అనటానికి వీలు లేదు. కానీ ఈ రోజు దేశంలో ఏమి జరుగు తున్నది? వాళ్లే ఆరోపిస్తారు. వాళ్లే విచారణ జరుపుతారు. వాళ్లే శిక్షలు వేస్తారు, వాళ్లే అమలు జరుపుతారు. అన్నీ వాళ్లే. ఇది ఆధునిక ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. గత ఎనిమిది సంవత్సరాలుగా బుల్డోజర్ పాలన సాగుతోంది. ఒక బుల్డోజర్‌తో ఒక ఇంటిని కూలగొడుతారు. ఒక భిన్న అభిప్రాయాన్ని కూలగొడతారు. ముస్లింలను క్రిస్టియన్లు, దళితులను కూలగొడతారు. నా మాట వినని వాళ్ళందరినీ కూల కొడతామంటారు. ఫాసిస్టులు మాత్రమే ఇలాంటి పనులకు ఒడికడతారు.

**11.అవినీతి :**

మన దేశంలో మధ్యప్రదేశ్‌లోని వ్యాపం కుంభకోణం కానీ, కర్నాటకలోని అయితే ఇటీవల ఓడిన బీజేపీ ప్రభుత్వం నలభై శాతం కమిషన్ సర్కార్‌గా ముద్రపడింది. కమిషన్ లేకుండా ఏ పనికి క్లియరెన్స్ ఉండదు. వారి అనుకూల కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ సైతం 40 శాతం కమీషన్‌కు బలయ్యాడు. నేను అలా ఇవ్వలేనని అలా ఇస్తే గిట్టుబాటు కాదని నన్ను అలా మానసికంగా హింస పెట్టవద్దని చెబుతూ ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నాటక కాంట్రాక్టర్ల సంఘం ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి ఈ ఘటనను గురించి అది నిజమేనని ధృవపరుస్తూ న్యాయం చేయమని ఉత్తరాలు కూడా రాసుకున్నారు. రాఫెల్ కుంభకోణం, ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు వారికి కారు చౌకకు అమ్మటం, ప్రయివేటు పెట్టుబడిదారుల బకాయిలను వన్ టైం సెటిల్‌మెంట్ పేరుతో వారికి లబ్ధి చేకూర్చటం, గత ఎనిమిది సంవత్సరాలలో పెట్టుబడిదారుల రుణాలు రూ.12.50 లక్షల కోట్లు మాఫీ చేయడం, అసెట్ మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ ఆస్తులన్నింటినీ కారు చౌకగా పెట్టుబడిదారులకు అద్దెకివ్వటం ఇవన్నీ ఫాసిస్ట్ లక్షణాల నుంచి పుట్టినవే.

అందువల్ల ఈ రోజున భారత సమాజం ఎదుర్కొంటున్న ఫాసిజం మరింత లోతైనది. మరింత ప్రమాద భరితమైనది. భారతదేశంలో ఉన్న **(మిగతా 25వ పేజీలో)**

# మోడీ కులగణనకు ఎందుకు తలొగ్గారు ?



- క్రిస్టోఫ్ జాఫ్రెలాట్

**తా**త్కాలికంగా కలిగే రాజకీయ ప్రయోజనమైన కులగణన నిర్ణయం భారతీయ సమాజాన్ని, రాజకీయాలను వ్యవస్థాగతంగా ప్రభావితం చేయనున్నది. రానున్న జనగణనలో భాగంగా కుల గణన కూడా చేపట్టాలని ఏప్రిల్ 30వ తేదీ జరిగిన రాజకీయ వ్యవహారాల మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో నిర్ణయించారు. ఈ వైఖరి సంప్రదాయకంగా సంఘ పరివారం నాయకత్వం అనుసరిస్తున్న వైఖరికంటే భిన్నమైనది. కులగణన హిందువులను చీలుస్తుందని సంఘ పరివార నాయకత్వం గతంలో పదేపదే వాదించింది. 2023లో జరిగిన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ విజయం సాధించిన తర్వాత ప్రతిపక్షం లేవనెత్తిన కులగణన డిమాండ్‌ను ఉద్దేశించి “కొంతమంది ఎన్నికల సమయంలో దేశాన్ని కులాలవారీగా విభజించాలని ప్రయత్నం చేస్తున్నారు. నా దృష్టిలో నాలుగే కులాలు ఉన్నాయి. అవి మహిళలు, యువత, రైతులు, పేదలు” అన్నారు. రెండేళ్ళ ముందు లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర ప్రభుత్వం కులగణనను చేపట్టకూడదని నిర్ణయించిందని, షెడ్యూల్డ్ కులాల వరకు మాత్రమే కులగణన జరుగుతుందని తెలియజేశారు.

### ప్రస్తుతం మోడీ తీసుకున్న యూటర్న్‌ను ఎలా అర్థం చేసుకోవాలి ?

తక్షణమే సమీపించనున్న బిహార్ ఎన్నికలు కులగణన చేపట్టడానికి ఒక ముఖ్యమైన కారణం. వలస పాలన నాటి నుంచి రాష్ట్ర రాజకీయాలలో కులం గణనీయమైన పాత్రను పోషించింది. రాష్ట్ర రాజకీయాలలో కులం పాత్ర ఏ స్థాయిలో ఉందంటే చివరకు 2022లో నితీష్‌కుమార్ ప్రభుత్వం బిహార్‌లో కుల గణనను పూర్తి చేయాల్సి వచ్చింది. సరైన పద్ధతుల్లో కులగణన జరగాలనే అవగాహన నుంచి నితీష్ కుమార్ వైదొలిగితే దాని రాజకీయ పర్యవసానాలు ప్రభావాలు తీవ్రంగా ఉండేవి. ప్రస్తుత కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిలబడటానికి నితీష్‌కుమార్ అందించిన బలం కీలకమైందని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కేంద్ర ప్రభుత్వం కులగణన విషయంలో నిర్ణయం తీసుకోకపోయి ఉంటే బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్ పార్టీలు ఇదే అంశాన్ని పెద్ద ఎత్తున రాజకీయ ఎజెండాగా మార్చి ఉండేవి.

ఆసక్తికరమైన విషయం ఏంటంటే, అశ్విని వైష్ణవ్‌తో సహా పలువురు బీజేపీ నేతలు మోడీ అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారని ప్రశంసిస్తున్నారు. మరోవైపు స్వాతంత్ర్యానంతరం దీర్ఘకాలం ఢిల్లీలో ఏలుబడి సాగించిన కాంగ్రెస్ పార్టీ కుల గణనను నిర్లక్ష్యం చేసిందని విమర్శలు ప్రారంభించారు. 2011 జనగణనలో భాగంగా కులాల వారి వివరాలు కూడా కేంద్ర ప్రభుత్వం సేకరించిందన్న వాస్తవాన్ని వైష్ణవ్ ఉద్దేశపూర్వకంగా ప్రస్తావించటం లేదు. 2011 జనగణన ఆధారంగా వెల్లడైన కులాధారిత వివరాలను మోడీ ప్రభుత్వం బహిర్గతం చేయకుండా తొక్కిపెట్టిందన్న వాస్తవాన్ని బీజేపీ నాయకత్వం ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తుంది. బిహార్ ఎలక్షన్‌లతోపాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సామాజిక న్యాయం కోసం కులగణన నినాదాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేయడంతో కేంద్ర ప్రభుత్వంపై పెరిగిన ఒత్తిడి మోడీ ప్రభుత్వం తాజా నిర్ణయానికి మరో ముఖ్యమైన కారణం. కుల గణనకు కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవడంతో ఇప్పటి వరకు ఈ అంశంపై ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ చేతిలో విమర్శనాస్త్రాలు మరింత కుదించుకుపోతాయి. ఈ నిర్ణయం వెనుక మరికొన్ని కారణాలు ఉన్నాయి.

మోడీ, బీజేపీకి భారతదేశంలోని మధ్యతరగతికి మధ్య ఏర్పడిన బంధం అటువంటి కారణాల్లో ఒకటి. 1990 నుంచి కేంద్ర ప్రభుత్వాలు మండల కమిషన్ నివేదిక అమలు జరపాలని నిర్ణయించడంతో దేశంలోని మధ్య తరగతి, ఉన్నత తరగతులకు చెందిన ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపారు. బీజేపీ ప్రభుత్వం కులాధారిత రిజర్వేషన్లను నీరుగార్చాలని మధ్యతరగతి, ఉన్నత తరగతి ఓటర్లు ఆశించారు. బీజేపీ వారి విశ్వాసాన్ని వమ్ము చేయలేదు. మోడీ 11 ఏళ్ల పరిపాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను ఎంత దారుణంగా అమ్మేశారో ఆ మేరకు మొత్తం ఉద్యోగాలు తగ్గిపోయాయి. అందులో రిజర్వేషన్ క్యాటగిరి కింద జరిగిన నియామకాలు అదే మోతాదులో తగ్గిపోయాయి. అదే సమయంలో బీజేపీ ప్రభుత్వం అగ్రకులాలకు మరో శాతం రిజర్వేషన్లు కేటాయించింది. ఆర్థిక బలహీన తరగతుల కోసం ఈ సానుకూల చర్య తీసుకున్నామని ప్రభుత్వం సమర్థించుకునే ప్రయత్నం చేసింది. దీంతోపాటు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన వారు ఉన్నతస్థాయి ఉద్యోగాలలో నామమాత్రంగానే మిగిలిపోయారు. దీని అర్థం ఏంటి? ఆర్థిక వ్యవస్థ దివాలా తీసే కొద్ది, మధ్య తరగతి పొందే ప్రయోజనాలు కూడా తగ్గిపోతున్నాయి. దీంతో మోడీ పాలనను చూసి ఆయనను ఆకాశానికి ఎత్తిన మధ్య తరగతి ఆర్థికంగా పాతాళానికి పడిపోయింది.

2014లో మోడీ అధికారానికి వచ్చే నాటికి దేశంలో ఉన్న మధ్యతరగతిని మరింత విస్తరించి నయ మధ్య తరగతిని సృష్టించాలన్న ప్రయత్నానికి భిన్నంగా దేశంలో మధ్యతరగతి తగ్గిపోతూ వచ్చింది. దేశంలోని జనాభా పిరమిడ్‌లో శిఖరాగ్రాన ఉన్న 10% మంది మాత్రమే ఈ 11 ఏళ్ల మోడీ పరిపాలనలో మరింత కుబేరులు అయ్యారు. జనాభాలోని మధ్యతరగతి వర్గం ఆర్థికంగా ఈ కాలంలో పుంజుకోలేకపోయింది.

ప్రపంచ దేశాలలోని అసమానతల గురించి అధ్యయనం చేసే వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ 2024 సంవత్సరానికి తన అధ్యయన వివరాలను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో 1947లో సంపన్నులైన 10% జనాభా చేతిలో 37% సంపద కేంద్రీకృతమై ఉంటే 1980 నాటికి వీరి చేతిలో ఉన్న సంపద 30 శాతానికి తగ్గిపోయింది. తిరిగి 1990 నాటికి ఈ జనాభా చేతిలో ఉన్న సంపద విలువ 33.5 శాతానికి పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి భారత జనాభాలో 10% జనాభా చేతిలో ఉన్న సంపద విలువ 57.7 శాతానికి పెరిగింది. మిగిలిన గణాంకాలు కూడా ఇదే నిర్ధారణకు దారితీస్తున్నాయి.

వినిమయ వ్యయం గురించి చర్చను ముందుకు తీసుకుని రావడానికి ఈ గణాంకాలు దోహదం చేస్తున్నాయి. భారతదేశంలో పట్టణ ప్రాంతాల్లోని 50 శాతం జనాభా సగటున నెలకు 5,000 రూపాయలు కూడా ఖర్చు పెట్టలేని పరిస్థితిలో ఉంటే అత్యధికంగా సంపన్నులైన 5% జనాభా సుమారు నెలకు 21 వేల రూపాయల వరకు ఖర్చు పెట్టగలిగే స్తోమత కలిగి ఉన్నది. వారికి దిగువనున్న మరో 5% జనాభా నెలకు 12,399 రూపాయలు ఖర్చు పెట్టగలుగుతుంటే వారికి దిగువనున్న 10% జనాభా నెలకు దాదాపు 9,500 వరకు ఖర్చుపెట్టగలుగుతుంది. అట్టడుగు స్థాయిలో ఉన్న 50% జనాభాకు అత్యున్నత స్థాయిలో ఉన్న 20 శాతం జనాభాకు మధ్య బ్రతుకులు ఈడుస్తున్న వారిని మధ్యతరగతిగా పిలుస్తూ ఉంటాము. వీరి సగటు నెలసరి వ్యయం రూ.562 నుంచి రూ.7,673 మధ్య ఉంటుంది.

ఈ నేపథ్యంలోనే భారతదేశంలో కేవలం 12 శాతం జనాభా మాత్రమే కార్లు కొనుగోలు చేయగలిగిన సామర్థ్యం కలిగి ఉన్నారని మారుతి సుజుకి ఇండియా అధ్యక్షుడు ఆర్సీ భార్గవ చెప్పిన విషయాన్ని అర్థం చేసుకోవాలి. రేపోమాపో తాము కూడా నయ మధ్య తరగతిగా ఎదగగలమని ఆశించినటువంటి విశాలమైన జనాభాకు ఈ పరిణామాలు నిరాశ కలిగిస్తున్నాయి. ఈ జనాభాలో ఎక్కువమంది అట్టడుగు కులాల నుంచి వచ్చిన వారే. అందువల్ల ఈ తరగతి కులాధారిత రాజకీయ సమీకరణ ద్వారానే తమకు ఎంతో మేలు జరుగుతుందని భావించే స్థితికి చేరుకుంటున్నారు.

మరోవైపు కులాధారిత రాజకీయ సమీకరణాలపై చూపుతున్న మొగ్గు దేశంలోని అగ్రకులాలు, అగ్రవర్గాలకు ఆందోళన కలిగిస్తుంది. ఈ తరగతి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న హిందూత్వ రాజకీయాలవైపు మొగ్గుచూపుతున్నారు. మరి ఇంకా ఈ ఉన్నత ఆర్థిక తరగతులు ఎవరికి తమ మద్దతును తెలియజేయాలి? మొత్తం జనాభాలో వారికున్న ఓటింగ్ శాతం ఎంత?ఈ వివరాల నేపథ్యంలో మోడీ యూటర్న్ తీసుకోవడానికి దారితీసిన మరో పరిణామాన్ని పరిశీలించాల్సి ఉంది. సీఎస్‌డీఎస్ లోకనీతి సంస్థ నిర్వహించిన అధ్యయనాల ప్రకారం 2009 నాటికి పేదలలో కేవలం 16% మాత్రమే బీజేపీకి ఓటు బ్యాంకుగా ఉంటే 2014 నాటికి 24%, 2019 నాటికి 36%, 2024 నాటికి 37% పేదలు బీజేపీ జెండా నీడన చేరారు. సంపన్న తరగతి వర్గాలలో 41% శాతం మంది బీజేపీ పంచన చేరితే, పేదలు-మధ్యతరగతిలో 35% బీజేపీకి ఓటు వేస్తున్నారు. అంటే బీజేపీ ఓట్ బ్యాంకులో సంపన్నులకు, పేదలకు మధ్య ఉన్న వ్యత్యాసం కేవలం 6% మాత్రమే. అటువంటి పరిస్థితుల్లో పేదలంతా బీజేపీ వైపు నిలబడాలని ఆశిస్తున్న తరుణంలో కేవలం అగ్రకులాలు, ఉన్నత వర్గాలకు మాత్రమే ప్రయోజనం కలిగించే విధానాలకు పరిమితం కావలసిన అవసరం ఏముంటుంది?

మోడీ పదే పదే ఆత్మగౌరవ రాజకీయాలనే భావనను చర్చకు పెట్టడం, రాజకీయ ఎజెండాగా మార్చడం ద్వారా దేశంలోని పేదలలో ఎక్కువ మందిని ఆకర్షించగలిగారు. ప్రత్యేకించి మన్ కీ బాత్ ద్వారా ఆయన చేస్తున్న ఉపన్యాసాలలో ఈ కోణాన్ని నిశితంగా పరిశీలించవచ్చు. రోజువారి జీవితంలో పొట్ట పోసుకోవటానికి రెక్కలాడించే జనాభా గురించి ఆయన పదేపదే మాట్లాడుతారు. తనను కూడా వారిలో ఒకరిగా చెప్పుకుంటూ ఉంటారు. పేదల్లో మోడీ పట్ల సానుకూలత కలగటానికి ప్రభుత్వ అనుసరించిన సంక్షేమ విధానాలు మరో కారణం. దేశంలో వివిధ సాంఘిక సంక్షేమ పథకాలన్నీ ప్రధానమంత్రి పేరుతోనే మొదలవుతున్నాయి. ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన పేదలు ఎక్కువ మంది బీజేపీకి ఓటు వేయటానికి సానుకూలత చూపిస్తున్నారని సీఎస్డీఎస్ సర్వేలో తేలింది. ఈ కారణంగానే ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ నానాటికి దిగుదారుతున్న ప్పటికీ ఈ కారణంగా బీజేపీ ఓటు బ్యాంకుగా మారిన పేదలు భారీ స్థాయిలో బీజేపీని వీడి వెళ్లే సూచనలు కనిపించడం లేదు. పైగా ఈ కష్టకాలంలో కేంద్రంలో మోడీ ఆయన ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ విధానాలు తమకు మరింత అవసరమని పేదలు భావించే పరిస్థితులు ఉన్నాయి. నిజానికి అధికారదాహం ఉన్న ఏ రాజకీయ నాయకుడైన పేదలు నానాటికి దుర్బల పరిస్థితులకు దిగజారి పోవాలని, అటువంటి దుస్థితి నుంచి బయటకు రావడానికి తనలాంటి నాయకులపై ఆధారపడాలని ఆశించడం సహజమే.

కులానికి సంబంధించిన విషయంలోను ఇదే తరహా వర్తిస్తుంది. బీజేపీకి ఓటు బ్యాంకుగా మారిన హిందూ అగ్ర

కులాల జనాభాకు బీసీ జనాభాకు మధ్య పెద్దగా అంతరం లేదు. 2024లో జరిగిన లోక్సభ ఎన్నికల్లో అగ్రకులాలలో 53% మంది బీజేపీకి ఓటు వేస్తే వెనుకబడిన కులాలకు సంబంధించిన ఓటర్లలో 49 శాతం బీజేపీకి ఓటు వేశారు. బీజేపీ ఓటు బ్యాంకులో కలిసిపోతున్న ఈ రెండు పాయలను అర్థం చేసుకోవడానికి హిందుత్వ మెజారిటీ రాజకీయాలను అర్థం చేసుకోవాలి.

1990 నుంచి రామ జన్మభూమి ఉద్యమం పేరిట దేశంలోని కుల అస్తిత్వాలను మరుగున పెట్టి, హిందూ అస్తిత్వాన్ని రాజకీయ అస్తిత్వంగా ముందుకు తేవటంలో బీజేపీ–సంఘపరివారం సఫలమయ్యాయి. నిరంతరం ముస్లింలను, మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని రాజకీయ సైద్ధాంతిక భౌతిక దాడులకు దిగటం ఈ ప్రయత్నంలో ముఖ్యమైన వ్యూహం. తద్వారా కులాధారిత రాజకీయ సమీకరణాల స్థానంలో మతాధారిత రాజకీయ సమీకరణాలను బీజేపీ ముందుకు తెచ్చింది. 2024 లోకసభ ఎన్నికలకు సంబంధించి సీఎస్డీఎస్ నిర్వహించిన అధ్యయనంలో ఈ వ్యూహాలు బీజేపీకి రాజకీయంగా కలిసి వచ్చాయని రుజువయింది. బీజేపీకి ఓటు బ్యాంకుగా మారిన పేదలలోను అగ్ర కులాలలోనూ ముస్లిం వ్యతిరేకత ఉమ్మడి లక్షణంగా కనిపిస్తుంది. ముస్లింలు విశ్వసించదగిన వారు కాదని సీఎస్డీఎస్ నిర్వహించిన ఇంటర్వ్యూలలో పాల్గొన్న వారిలో 27 శాతం మంది హిందువులు అభిప్రాయపడ్డారు. బీజేపీకి ఓటు బ్యాంకుగా మారిన దళితుల్లో ఈ అభిప్రాయం 28.7% మందికి ఉన్నది. నిమ్న కులాలకు సంబంధించిన ఓటర్లను బీజేపీ తన వైపు లాగేసుకున్న తర్వాత వారిపై తన ఆధిపత్యాన్ని శాశ్వతం చేసుకోవటానికి కావలసిన విధి విధానాలు రాజకీయ వ్యవహారాలను రూపొందించే పనిలో ఉండటం సహజమే కదా. ఈ అవగాహనతో ముందుకొచ్చిందే కులగణన నిర్ణయం. అయితే ఇదేమంత తేలికైన వ్యవహారం కాదు. బీజేపీలో అగ్రకులాలదే ఆధిపత్యం. ప్రధానంగా ఆర్ఎస్ఎస్ శ్రేణులుగా ఉన్న పార్టీ కార్యకర్తల సామాజిక నేపథ్యాలు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది. బీజేపీ టికెట్లపై గెలిచిన ఎంపీల సామాజిక నేపథ్యాన్ని పరిశీలించిన ఇది అర్థమవుతుంది.

గిల్లేస్ వెర్నియర్స్ రాసిన ఓ పరిశోధనాత్మక వ్యాసం జర్నల్ ఆఫ్ ఇండియన్ పాలిటిక్స్ అండ్ పాలసీ త్వరలో ప్రచురించబడనున్నది. ఎన్డీఏ అభ్యర్థులలో 31 శాతానికి పైగా అభ్యర్థులు అగ్రకులాల నుంచి వచ్చిన వారేనని, ఇండియా కూటమిలో గెలిచిన అభ్యర్థులలో కేవలం 19 శాతం మాత్రమే అగ్ర కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని గిల్లేస్ తన వ్యాసంలో వివరించారు. అటువంటి పరిస్థితుల్లో బీజేపీ నాయకత్వ స్థాయిలో దిగువ కులాలకు ఎక్కువ ప్రాతినిధ్యం ఇవ్వటానికి సిద్ధమైతే ఇప్పటి వరకు ఆయా స్థానాలకు అంటిపెట్టుకొని కూర్చున్న అగ్రకులాలు ఏ విధంగా స్పందిస్తాయి?

ఇక రెండో అంశం. ప్రతిపక్షాలు బీసీలలో ఉన్న దిగువ కులాలను దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేసిన ఫలితమే 2024 ఎన్నికలలో ఈ తరగతులకు చెందిన ఓటర్లలో ఎక్కువ మంది బీజేపీకి ఓటు వేశారు. దీర్ఘకాలం ప్రతిపక్షం బీసీలలో ఉన్నత శ్రేణిలో ఉన్న కులాలకు మాత్రమే రాజకీయ ఆశ్రయం కల్పించింది. ఉత్తరప్రదేశ్లో మాత్రం సమాజ్వాది పార్టీ బీసీలలో ఉన్న ఉన్నతశ్రేణి కులాలకు చెందిన వారికి నామమాత్రంగా సీట్లు కేటాయించింది. ఈ తరగతిలోని నిమ్న కులాలకు ఎక్కువ టికెట్లు కేటాయించింది. యాదవులు సమాజ్వాదీ పార్టీకి ఓటు వేయడంతో పాటు ఈ రకమైనటువంటి వ్యూహం ఫలితంగా సమాజ్వాదీ పార్టీ గత ఎన్నికలలో మెరుగైన ఫలితాలను సాధించింది. బిహార్లో కూడా ప్రతిపక్షం ఇదే వ్యూహాన్ని పునరావృతం చేయగలుగుతుందా? దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది ప్రతిపక్షమే. బిహార్ ఎన్నికల్లో ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమి ఉత్తరప్రదేశ్లో సమాజ్వాది పార్టీ అనుసరించిన ఎన్నికల వ్యూహాన్ని అనుసరిస్తే కులగణన నిర్ణయం ద్వారా రాజకీయ లబ్ది పొందకుండా బీజేపీ, జేడీయూ కూటమిని నిలువరించడానికి అవకాశాలు ఉన్నాయి. ఇది సమీప భవిష్యత్తులో జరిగే పరిణామం మాత్రమే.

ఇదిలా ఉంటే కులగణన భారతీయ సమాజాన్ని రాజకీయాలను గణనీయంగా ప్రభావితం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కులగణన చేసినంత మాత్రాన అంతా అయిపోదు. వివిధ కులాలు మొత్తం జనాభాలో ఉన్న మోతాదు కనుగుణంగా బ్యూరోక్రసీలోనూ, రాజకీయాలలోనూ, ప్రభుత్వ రంగ సంస్థలలోనూ ఉన్నాయా లేవాని పరిశీలించేందుకు విశ్లేషించేందుకు కులగణన ఒక సాధనం మాత్రమే. సామాజిక న్యాయసాధనకు ఉద్యమిస్తున్న పలుసామాజిక తరగతులు కులగణన వివరాలు వెలుగు చూసిన తర్వాత అనేక కొత్త రకమైన డిమాండ్లను ముందుకు తెచ్చే అవకాశం ఉంది. 1990 దశకంలో మండల కమిషన్ నివేదికను బయటకు తీసి సిఫార్సులు అమలు చేయడానికి అప్పటి ప్రభుత్వాలు ప్రయత్నించినప్పుడు బీజేపీలో ఉన్న అగ్రకులాలు ఏ విధంగా ప్రతిఘటించాయో అదేవిధంగా ప్రస్తుతం ఈ అగ్రకులాలు ప్రతిఘటించే అవకాశాలు గణనీయంగానే ఉన్నాయి. మండల్ నివేదిక అమలు అనంతర రాజకీయ పరిస్థితులలో వచ్చిన మార్పులను ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక పత్రిక ఆర్గనైజర్ శూద్ర విప్లవమని పిలిచింది. కులగణన ద్వారా ఇప్పటివరకు మతాధిపత్యం కేంద్రంగా సాగుతున్న రాజకీయాలు కులం సామాజిక ఆర్థిక అంశాలు కేంద్రంగా పరిణామం చెందే అవకాశం ఉంది. ఈ దీర్ఘకాలిక పర్యవసానాలను నరేంద్ర మోడీ ఊహించి ఉండకపోవచ్చు. కానీ వ్యూహాత్మకంగా ప్రభుత్వాలు తీసుకునే కొన్ని నిర్ణయాలు అనూహ్యమైన పర్యవసానాలకు దారితీస్తాయి. ❑ **అనువాదం : కొండూరి వీరయ్య**

# ఓ వైపు పేదరికం.. మరో వైపు బిలియనీర్లు



- బొల్లిముంత సాంబశివరావు

దేశ సంపద వికేంద్రీకరణ జరగకుండా కేంద్రీకృతం కావటంతో సమాజంలో పేదల, ధనికుల మధ్య వ్యత్యాసం తీవ్రంగా పెరుగుతోంది. కొద్ది మంది కోటీశ్వరుల వద్ద ఎక్కువ సంపద, కొద్ది మంది భూకామందుల వద్ద ఎక్కువ సాగు భూములు ఉన్నాయి. దీంతో సంపదను సృష్టించే అత్యధిక మంది గ్రామీణ పేదలు, కార్మికులు, శ్రామికులు ఆ సంపదకే దూరంగా ఉన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న బడా పెట్టుబడిదారుల – భూస్వాముల అనుకూల విధానాలే ఇందుకు కారణంగా ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి సంఖ్య మీద వేర్వేరుగా అనేక నివేదికలు, అంచనాలు ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఎనభై కోట్ల ఎనభై లక్షల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, 101 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఈ 101 కోట్ల పేదల్లో సగం మంది 18 ఏళ్లకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు కాగా, 13.5 శాతం మంది పిల్లలు 18 ఏళ్ల పైబడిన వారుగా ఉన్నారు. సగం మంది పేదలు పోషకాహార లోపంతో జీవిస్తున్నారు. 83.7% మంది పేదలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. మొత్తం గ్రామీణ జనాభాలో 28% మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పేదలు ఎక్కువగానే ఉన్నారు. ఇండోనేషియాలో చూసుకుంటే 4 కోట్ల 70 లక్షల మంది పేదరికంలో ఉన్నారు. ఆ దేశ జనాభాలో ఇది 18% కాగా, అత్యధిక పేదలు ఉన్న దేశాల్లో 5వ స్థానంలో ఉంది. పాకిస్తాన్‌లో 5 కోట్ల 90 మంది ప్రజలు పేదరికంలో ఉండి, ఆ దేశ జనాభాలో 29%గా ఉన్నారు. అధిక పేదలు ఉన్న దేశాల్లో 4వ స్థానంలో పాకిస్తాన్ ఉంది. ఆఫ్రికా దేశం నైజీరియాలో 8 కోట్ల 60 లక్షల మందితో పేదరిక పరంగా 3వ స్థానంలో ఉంది. పేదలు, పేదరికంలో ఉన్న దేశాలు సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో ఎక్కువగా ఉన్నాయి. వివిధ నివేదికల ప్రకారం, చైనాలో పేదరికం నేడు తక్కువగా ఉంది. 2020లో 5 కోట్ల 60 లక్షల మంది ఆ దేశ పేదరిక రేటుకు దిగువన ఉన్నారు. ఇది చైనా దేశ జనాభాలో 1.7 శాతంగా ఉంది. 2025లో ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం పేదరికం 0.7%గా ఉంది. ప్రస్తుతం పేదలు ఎంత శాతంలో ఉన్నారనే సమాచారం అందుబాటులో లేదు. చైనాలో కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ



వ్యత్యాసాలు ఉన్నాయి. అమెరికాలో 2022లో 12.4% పేదల లెక్క బయటపడింది. ఇంకా ఇతర పెట్టుబడిదారీ దేశాల్లోనూ పేదలు గణనీయంగానే ఉన్నారు.

భారతదేశంలో 2011-12లో పేదరికం 27.1%(34.4 కోట్లు)గా ఉంటే, 2022-23 నాటికి 5.3%(7.5 కోట్లకు) తగ్గిందని మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. పేదరికం శాతం తగ్గినా, దేశ ప్రజల్లో 22% మంది పేదరికంలో జీవిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం, దేశంలో 35 కోట్ల మంది కనీస అవసరాలు తీర్చుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మోడీ ప్రభుత్వం చెప్పినట్లుగా పేదరికం తగ్గితే, 80 కోట్ల మందికి రేషన్ బియ్యం సప్లయి చేయటం ఎందుకు? భారతదేశంలో పేదరిక అంచనాపై అనేకమంది నిపుణులు, సంస్థలు బిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. దేశంలో దారిద్ర్య రేఖను అంచనా వేయటం, పేదరికం గురించి అనేక కమిటీలు చేసిన నిర్ధారణలు హాస్యాస్పదంగాను, పేదరికాన్ని అపహాస్యం చేసేవిగాను ఉన్నాయి. అమెరికాలో, రోజుకు 63 డాలర్ల కంటే తక్కువ ఆదాయం వున్న నలుగురు సభ్యుల కుటుంబాన్ని పేదలుగా పరిగణిస్తారు. భారతదేశంలో అర డాలర్ కంటే ఎక్కువ సంపాదించే వారిని పేదలుగా గుర్తించటం లేదు. ప్రపంచ బ్యాంకు మాత్రం భారత్‌లో 2.3 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్న వారిని పేదలుగా గుర్తించింది. భారతదేశంలో క్షేత్రస్థాయిలో పేదరికాన్ని అధ్యయనం చేస్తే కేంద్ర ప్రభుత్వం, ప్రపంచబ్యాంకు, ఐక్యరాజ్యసమితి చెప్పిన లెక్కలన్నీ తలకిందులవుతాయి.

ప్రపంచదేశాల్లో పేదరికం పెరుగుతూ ఉంటే, మరో వైపు బిలియనీర్లు కూడా పెరుగుతున్నారు. 2025 నాటికి ప్రపంచ

బిలియనీర్ల సంఖ్య 3,030 చేరుకుంది. వారి మొత్తం సంపద 12 లక్షల కోట్ల అమెరికా డాలర్లుగా అంచనా. ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలన్‌మస్క్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతని నికర ఆస్తి 377 బిలియన్ (30 లక్షల, 60 వేల కోట్ల రూపాయలు) డాలర్లు. అతని తర్వాత రెండో స్థానంలో మార్క్ జుకర్ బర్గ్ ఉండగా, అతని ఆస్తి 235 బిలియన్ డాలర్లు, జెఫ్ బెజోస్ 227 బిలియన్ డాలర్లతో మూడవ స్థానంలో ఉన్నాడు. వీరు గాక లారీ ఎల్లిసన్ 194 బిలియన్ డాలర్లు, బిల్ గేట్స్ 176 బిలియన్ డాలర్లు, స్టీవ్ బాల్మెర్ 160 బిలియన్ డాలర్లతో ఉన్నారు.

భారతదేశంలో 2024లో 191 మంది బిలియనీర్లు ఉంటే, 2025లో వీరి సంఖ్య 284కు చేరింది. బిలియనీర్లలో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. 2015 నుంచి భారతదేశంలో బిలియనీర్ల అదనంగా 123 మంది పెరిగారు. ముఖేష్ అంబానీ 8 లక్షల 60 వేల (8.6 ట్రిలియన్ రూపాయలు, ఒక ట్రిలియన్ లక్ష కోట్లు) కోట్ల రూపాయలతో ప్రథమ స్థానంలో ఉంటే, ఆ తర్వాత గౌతమ్ అదానీ 8లక్షల 40 వేల (8.4 ట్రిలియన్లు రూపాయలు) కోట్ల రూపాయలతో రెండవ స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత రోష్నినాడర్ (హెచ్‌సీఎల్ టెక్నాలజీ) 3.5 లక్షల కోట్లు, దిలీప్ షాంఘ్వీ (సన్ ఫార్మా) 2.5లక్షల కోట్లు, అజీమ్ ప్రేమ్‌జీ(విప్రో)2.2 లక్షల కోట్లు, కుమార్ మంగళం బిర్లా (ఆదిత్యబిర్లా గ్రూప్) రెండు లక్షల కోట్లు, సైరస్ పూని వల్లా(సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా) 2 లక్షల కోట్ల రూపాయలు, సిరాజ్(బజాజ్ ఆటో) 1.6 లక్షల కోట్లు, రాధా కిషన్ దమానీ(అవెన్యూ సూపర్ మార్ట్స్) 4.4 లక్షల కోట్ల రూపాయల సంపద కలిగి ఉన్నారు. భారత బిలియనీర్ల సగటు వార్షిక సంపద 34,514 కోట్లు. దేశంలో వెయ్యి కోట్లు సంపద కలిగి ఉన్న వారి సంఖ్య 1,539 మంది ఉంటే, అందులో 5 వేల కోట్ల సంపద కలిగిన వారు 534 మంది ఉన్నారు. నల్లధనాన్ని పరిగణలోకి తీసుకుంటే వీరి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం, భారతదేశంలోని 1% సంపన్నుల వద్ద దేశ సంపదలో 58% కలిగి ఉంటే, దేశంలోని 67 కోట్ల పేదల వద్ద ఒక శాతం సంపద మాత్రమే ఉంది. 13.8% ఉన్న ధనిక రైతుల వద్ద సాగు భూమి 46% ఉంటే, 84%గా ఉన్న చిన్న, సన్నకారు రైతుల వద్ద 47.3% భూమి ఉంది. దేశంలో కేవలం 4.9% భూకామందుల వద్ద 32% భూమి ఉంది. దేశంలోని ఒక పెద్ద భూకామందు ఒక్క సన్నకారు రైతు కన్నా 45 రెట్లు భూమి కలిగి ఉన్నాడు.

ప్రపంచంలో కానీ భారతదేశంలో కానీ బడా పారిశ్రామిక వేత్తల, సంపన్నుల, భూకామందుల వద్ద ఆయా దేశాల సంపద, సాగు భూములు కేంద్రీకృతమై ఉన్నాయి. దాని ఫలితమే అనేక దేశాల్లో అత్యధిక ప్రజలు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామీణ ఉపాధి, ఉద్యోగ కల్పన, శ్రమకు తగ్గ వేతనం లభించినప్పుడే పేదరికం తొలుగుతుంది. అందుకు సమగ్ర భూసంస్కరణలతో పేదలకు భూపంపిణీ జరగాలి. పరిశ్రమల్లో కార్మికులకు భాగస్వామ్యం ఉండాలి. బడా కోటీశ్వరుల సంపద ప్రజలపరం కావాలి. ఇవి సాధించుకోవటానికి భారతదేశ గ్రామీణ పేదలు, కార్మికులు, నిరుద్యోగులు, యువజనులు దోపిడీ వర్గాల పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. మిగతా ప్రపంచదేశాల్లో కూడా ఆ విధంగానే ఉద్యమించాలి. ❑

## ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ లక్షణాలు.. పరిశీలన

**(20వ పేజీ తరువాయి)**

ఆధిపత్యమతం, పెత్తందారి కులాలు, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ, ఆ కుల అసమానతల సమర్థన, బ్రాహ్మణీయ భావజాల అధిపత్యం, జాతుల అణిచివేత, భాషాధిపత్యం లాంటి పరిస్థితులు యూరప్‌లో ఒకనాడు ఉద్భవించిన అంతర్జాతీయ ఫాసిజానికి, ఇవి జాతీయంగా ఉన్న అదనపు లక్షణాలు తోడ్పడ్డాయి. ఈ లక్షణాలు భారతదేశంలో ఫాసిజం పెరగటానికి అనువైన భూమికను ఏర్పాటు చేశాయి. గత తొమ్మిది సంవత్సరాలుగా మనదేశంలో ముఖ్యంగా సాంస్కృతిక రంగంలో ఈ ఫాసిజం విలయతాండవం చేస్తున్నది. ఫాసిజం భారతదేశంలో పొందిన నిర్దిష్టరూపం హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం. అది బహుళత్వ సంస్కృతిని తొక్కిపట్టి ఏకాత్మకంగా మార్చడం దాని లక్ష్యం. మన సమాజంలో బహుళత్వంతో నిండిన భారత చరిత్రను తుడిచివేసి హిందూ మతోన్మాద, వర్ణాశ్రమ ధర్మ చరిత్రనే భారత చరిత్రగా ప్రకటించడం దాని ముఖ్య ఉద్దేశం. ఈ లక్ష్యాల కోసం ఎంతటి హింసకైనా, ఎంతటి చరిత్ర వక్రీకరణకైనా తెగించటం దాని కార్యక్రమం. ఇలాంటి భావజాలన్నీ ప్రతి ఘటించడం అత్యవసరం. కూలదోయటం అంతకన్నా అవసరం. మానవత్వానికి శత్రువైన ఆర్ఎస్ఎస్‌ను ప్రతిఘటించగలగాలి అది పీడిత ప్రజలకు వ్యతిరేకమైనది. కనీసపు ప్రజాస్వామ్యానికి పూర్తిగా అది సమాజంలో అది ఆధిపత్యాన్ని నిలదొక్కుకున్నట్లయితే ఈ పాటి ప్రజాస్వామ్యం కూడా ఉండదు. ఈ దేశంలోని శూద్రులకు అది శత్రువు. దాన్ని ఓడించాలి. కమ్యూనిస్టులు ప్రగతిశీల శక్తులు ఒక రెడ్ ఆర్మీగా తయారవ్వాలి. భావజాల రంగంలో ఆర్ఎస్ఎస్ విషతుల్య భావాలను ప్రతి మనిషికి చేరవేసి జాగృతం చేయాలి. ఆ భావజాలం సమాజంలోని సామాన్య ప్రజానీకానికి ఎంత ప్రమాదమో, ఎంత భయంకరమైనదో హెచ్చరించాలి. ఇప్పటి వరకు జరిగిన కృషి చాలా తక్కువ. చేయవలసిన కృషి ఎంతో ఉన్నదని ప్రగతి శీల శక్తులు కమ్యూనిస్టులు గుర్తించాలి. ❑

# నేరం వారిది కాదు.. కానీ శిక్ష వారికేనా?



- ఈడుగు రంజిత్

**జస్టిస్ డిలేడ్ ఈజ్ జస్టిస్ డినైడ్ అనే సామెత తెలిసిందే. ఈ సామెత ముస్లింలకు సరిగ్గా సరిపోతుంది. బొంబాయి బాంబు బ్లాస్ట్స్ కుట్ర కేసు, అలాగే తబ్లీగ్ జమాత్ సభ్యుల మీద ఢిల్లీ పోలీసులు పెట్టిన కేసులను దేశ అత్యున్నత న్యాయస్థానం జూలై నెల రెండవ వారంలో కొట్టి వేసిన నేపథ్యంలో ముస్లిం సామాజిక వర్గం బాధిత సమూహంగా ఎలా అన్యాయానికి గురవుతుందో, నేర విచారణ సంస్థలు, భద్రతా నిఘా సంస్థలు ఎలా పక్షపాతంతో పని చేస్తున్నాయో చర్చకు వచ్చింది.**



మన దేశంలోని ఖైదీలలో 30 శాతంపైగా ముస్లింలున్నారని, దేశ జనాభాలో ముస్లిం జనాభాకు అది రెండింతలని 2021లో ది హిందూ ఒక కథనాన్ని ప్రచురించింది. దేశంలో 14.2 శాతం ముస్లింలు వున్నారని ఒక అంచనా. శిక్షలు పడిన వారు, విచారణను ఎదుర్కొంటున్న వారు, నేరారోపణ కింద అరెస్టు అయిన వారు అని మూడు రకాలుగా విభజించి చూస్తే, వారిలో ముస్లింలే 30 శాతానికి పైగా వున్నారని ఒక అధ్యయనం తెలుపుతోంది. ఒక్క అస్సాంలోనే నేరం రుజువై శిక్షపడిన ఖైదీలు 61 శాతం వున్నారు. విచారణ నెదుర్కొంటున్నవాళ్లు 49 శాతం వున్నారు. మొత్తం అస్సాం జనాభాలో 34 శాతం మంది ముస్లింలున్నారు. ఇదీ వాస్తవం.

దేశంలోని వివిధ రాష్ట్రాలలో జైలులో మగ్గిపోతున్న ఖైదీలలో మెజారిటీగా ముస్లింలు, దళితులు, బీసీలు, ఆదివాసులే వున్నారన్నది నిజం. సామాజిక, ఆర్థిక కారణాల వల్ల దళితులు, ఓబీసీలు, ఆదివాసులు జైలులో మగ్గిపోతున్నారు. కానీ ముస్లిలది మతపరమైన సమస్య. వాళ్లు ముస్లింలు కావడం వల్లనే తీవ్రవాదులనే ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేయడంతో జైళ్లల్లో మగ్గిపోతున్నారు. బాంబు పేలుళ్లకు, అల్లర్లకు కుట్ర పన్నారనే నెపంతో ఐపీసీ 120(బి), 153 కింద అరెస్టు చేసి జైలులో వేస్తే, దశాబ్దాలపాటు చీకటి గదుల్లో మగ్గిపోయారు. టాడా, పోటా, ఊపా వంటి చట్టాలన్నీ ముస్లింలను లక్ష్యంగా చేసుకొని చేసినవే. వాటిని ముస్లింల మీద, వామపక్ష భావజాలం గల వారి మీద మాత్రమే మోపి హింసించారు. ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేకుండానే నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఆరోపణలు చేస్తోంది. కేసులు పెడుతోంది. ఏకంగా అరెస్టు చేసి రిమాండుకు పంపుతోంది. కోర్టులు కూడా ఈ అసమగ్రమైన దర్యాప్తును ప్రశ్నించవు. తీరా విచారణ అంతా పూర్తయ్యే నాటికి కోర్టులకు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎలాంటి సాక్ష్యాలు చూపలేదని కేసును సుప్రీంకోర్టు కొట్టేస్తుంది. అలాంటి తీర్పును 25 ఏళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత విన్న ఏ అండర్ ట్రయల్ ఖైదీ సంతోషించలేదు. జీవితం అంతా నాశనమైన తర్వాత అలాంటి తీర్పుకు ఎలాంటి విలువా వుండదని, కోల్పోయిన జీవితాన్ని కోర్టులూ పోలీసులూ తిరిగి ఇవ్వలేరని బాధితులు విలపించడం మనం చూశాము.

- బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత బాంబు పేలుళ్లకు కుట్ర చేశాడనే ఆరోపణతో పందొమ్మిదేండ్ల నసీరుద్దీన్ అహ్మద్‌ను 1994 అరెస్టు చేసి జైలులో పెట్టారు. 2016లో సరైన సాక్ష్యాలు, ఆధారాలేవీ లేవని సుప్రీంకోర్టు అతన్ని నిర్దోషిగా విడుదల చేసింది. అతడు జైలులో 23 ఏళ్లపాటు మగ్గిపోయాడు. తన 42 ఏళ్ల వయస్సులో బయటకు వచ్చాడు.
- జమీల్ అహ్మద్‌ఖాన్, మరో పది మందిని ఫిబ్రవరి 1994లో మహారాష్ట్ర పోలీసులు టాడా చట్టం ప్రకారం అరెస్టు చేశారు. అది బాబ్రీ మసీదు విధ్వంసానికి ప్రతీకారంగా బాంబు పేలుళ్లకు కుట్ర పన్నారన్నదే అభియోగం. సరైన సాక్ష్యాలు లేవని, అనుమానం ఒక్కటే నేరానికి ప్రాతిపదిక కాదని నాసిక్ టాడా కోర్టు 2019లో 25 ఏళ్ల జైలు జీవితం తర్వాత నిర్దోషులుగా విడుదల చేసింది.
- 1996/1997లో అబ్దుల్ ఘనీ, మీర్జా నిసార్ హుస్సేన్, మొహ్మద్ అలీ భట్, లతీఫ్ అహ్మద్ వాజా, జావేద్‌ఖాన్, రయీస్ బేగ్ అనే యువకులను సామ్లేటి బాంబు పేలుళ్ల కేసులో ముద్దాయిలుగా అరెస్టు చేశారు. 2019లో 23 యేండ్ల తర్వాత జైలు నుంచి విడుదలయ్యారు.

- అనేక పేలుళ్లతో సంబంధం వుందనే ఆరోపణతో మహ్మద్ అమీర్‌ఖాన్‌ను 1998లో అరెస్టు చేశారు. 14 ఏళ్ల తర్వాత 2012లో నిర్దోషిగా విడుదలయ్యాడు. న్యాయ స్థానం అతనికి అయిదు లక్షల నష్ట పరిహారం కూడా ఇచ్చింది.
- రెహ్మాన్ యూసుఫ్ ఫారూఖీని ఎర్ర కోట కుట్ర కేసులో 2000లో అరెస్టు చేసి ఢిల్లీ జైలులో బంధించారు. సరైన ఆధారాలు లేవని ఢిల్లీ హైకోర్టు 2006లో నిర్దోషిగా ప్రకటించింది. అతడు ఏ నేరమూ చేయకుండానే ఆరేళ్ల జైలు జీవితం అనుభవించాడు.
- నిషేధిత జైషే అహ్మద్ తీవ్రవాదులకు ఆశ్రయం ఇచ్చాడనే ఆరోపణలతో అష్ఫాక్ నాన్వే, మహ్మద్ వారిస్‌లను 2000లో అరెస్టు చేసి బంధించారు. 2019లో వాళ్లను అలహాబాదు హైకోర్టు నిర్దోషులని తీర్పు ఇచ్చింది. వాళ్లు 19 ఏళ్ల జైలు జీవితం అనుభవించారు.
- దేశద్రోహం, హత్యా ఆరోపణలతో సయ్యద్ వాసిఫ్ హైదర్‌ను 2001లో అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఎనిమిదేళ్ల తర్వాత విడుదలయ్యాడు.
- ముంతాజ్ అహ్మద్ పదేండ్లు, సబర్మతీ ఎక్స్‌ప్రెస్ పేలుడు కేసులో గుల్జార్ అహ్మద్ వనీ 16 ఏళ్లు జైలు జీవితం అనుభవించిన తర్వాత నిర్దోషులను కోర్టులు తీర్పు ఇచ్చాయి.
- ఊపా చట్టం కింద సూరత్‌లో నిషేధిత సిమీ సంస్థ సభ్యులనే నెపంతో 127 మందిని అరెస్టు చేసి సూరత్ కోర్టులో విచారణ నడిపారు. 2021లో 19 ఏళ్ల తర్వాత వాళ్లంతా అమాయకులని సూరత్ కోర్టు ప్రకటించింది. విచారణ సమయంలోనే ఆరుగురు మరణించారు. ఈ 127 మంది లో ప్రభుత్వ ఉద్యోగులున్నారు. యూనివర్శిటీ ఆచార్యులు న్నారు. యూనివర్శిటీ విద్యార్థులున్నారు. వాళ్ల జీవితమంతా నాశనమైంది. వాళ్లు ఉద్యోగాలు కోల్పోయారు. ఏ ప్రయివే టు సంస్థ ఉద్యోగాలివ్వడానికి అంగీకరించలేదు. పేదరికం తో, అవమానంతో 121 మంది నిర్వీర్యమైపోయారు.
- అక్షర ధామం కేసులో మరణశిక్ష పడిన ఆరుగురిని 2014 లో సుప్రీంకోర్టు విడిచిపెట్టింది. 2002లో అహ్మదాబాద్ టిఫిన్ బాంబు పేలుడు కేసులో నిందితులుగా అరెస్టు చేసిన హనీఫ్ పాకిట్వాలా, హబీబ్ హవాలను 2017లో సుప్రీం కోర్టు విడిచిపెట్టింది.
- ఢిల్లీలోని సరోజినీనగర్ పేలుడు కేసులో నిందితుడైన తారిఖ్ అమ్మద్‌దార్ పన్నెండేళ్లకు నిర్దోషిగా విడుదలయ్యాడు.
- మక్కా మసీదు బాంబు పేలుడు జరిగినప్పుడు హైదరాబాదు లోని 150 మంది యువకుల మీద కేసులు పెట్టారు. చిత్ర హింసలకు గురిచేశారు. తమ కొడుకులను విడుదల చేయమని పోలీసుస్టేషనుకు పోయిన ముస్లిం మహిళలను పాకిస్తాన్ మహిళా తీవ్రవాదులు స్టేషను మీద దాడి చేశారని మీడియా ట్రోలింగులు ఇచ్చింది. హేమంత్ ఖర్కరే నిజాయితీ వల్ల ఆ యువకులు అమాయకులని కోర్టు తీర్పు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నష్టపరిహారాన్ని కూడా బాధితులకు ఇచ్చింది. ఇలా అనేక మంది దశాబ్దాల పాటు నిందితులుగా జైలులో మగ్గిపోయారు.

ముస్లింలను నిందితులుగా చేసే వ్యూహం కూడా చాలా సులువైనది. ముస్లింలందరూ తీవ్రవాదులు కారు. కానీ తీవ్ర వాదులంతా ముస్లింలే అనే ఒక నినాదాన్ని సమాజంలోకి మీడియా ద్వారా ప్రచారం చేశారు. అందువల్ల ఎక్కడ బాంబు పేలుడు జరిగినా గంట లేదా రెండు గంటల్లో ఒక నిషేధిత తీవ్ర వాద సంస్థ మీడియా సంస్థలకు ఒక మెయిల్ పంపడమో లేదా ఒక ఎస్ఎమ్మెస్ పంపినట్టు వార్తలు ప్రసారమవుతాయని జస్టిస్ కట్జూ విమర్శించాడు. ఎలాంటి ప్రాథమిక విచారణ చేయకుండానే చాలా సంఘటనలలో నిఘా సంస్థలు ఏదో ఒక నిషేధిత సంస్థ ఆ సంఘటనకు పాల్పడినట్టు ప్రకటిస్తాయి. అంతేకాకుండా, మరో రెండు, మూడు గంటల్లో కొంతమంది తీవ్రవాదులను గుర్తించినట్టు మీడియాలో వార్తలు బ్రేకింగ్ న్యూస్‌గా వస్తాయి. ఇదంతా ఒక పథకం ప్రకారం జరుగుతుంది. ఎలాంటి ప్రాథమిక విచారణ చేయకుండా, ఆధారాలు ఏవీ సేకరించకుండానే నిందితులను కోర్టు ముందు హాజరు పరుస్తారు. వాళ్లను జైలులో పెడతారు. కస్టడీకి తీసుకొని హింసిస్తారు. కనీసం బెయిల్ ఇవ్వడానికి కూడా పోలీసుల సూచన మేరకు కోర్టులు నిరాకరిస్తాయి. ఆఖరికి తేలేదేమిటంటే, సరైన సాక్ష్యాలను కోర్టుకు సమర్పించడంలో దర్యాప్తు సంస్థలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు కేసును కొట్టేస్తుంది.

ఒక సమూహాన్ని దోషిగా నిలబెట్టే పనికి పోలీసులు బాజాప్తా ఎలా దిగుతున్నారు ? నిజమైన నేరస్తులను పట్టుకోవడానికి దర్యాప్తు సంస్థలెందుకు సిద్ధంగా లేవనే ప్రశ్నకు సమాధానం తెలిసిందే. ఈ దేశంలో అనేక కుట్రలకు, అల్లర్లకు, విధ్వంసానికి సంఘ్ పరివార్ కారణమని స్వయంగా 2014లో రాహుల్ గాంధీ ప్రకటించాడు. ముఖ్యంగా అత్యున్నత దర్యాప్తు సంస్థలు, నిఘా సంస్థలలోని అధికారులకు సంఘ్‌తో సంబంధాలు వున్నాయని, ఇద్దరూ కలిసి దేశంలో అనేక విధ్వంసకర సంఘటనలకు కారణమయ్యారని ఆయన విమర్శించాడు. ఆ ప్రకటన చేసినప్పుడు కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో వున్నది. ఆయన చేసిన ప్రకటనను రుజువు చేసేలా హేమంత్ ఖర్కరే విచారణ సాగింది. అందుకే ఆయనను కాల్చి చంపారనే ఆరోపణ వుంది. ఖర్కరేను ఎవరు చంపారనే గ్రంథం కూడా వచ్చిన సంగతి తెలిసిందే. అందువల్ల ఇస్లామోఫోబియా అన్ని రంగాలను ఆవహించింది. **(మిగతా 31వ పేజీలో)**

# నేటి వ్యవస్థలో సంక్షోభాలు, పరిష్కారాలు



- మహమ్మద్ అక్బర్

నేటి మన పెట్టుబడిదారీ పార్లమెంటరీ వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. అవినీతి, కుల, మత జాడ్యాలు రాజ్య మేలుతున్నాయి. ప్రభుత్వాలు తియ్యటి మాటలతో ప్రజలను విజయవంతంగా అమాయకులను చేసి పక్కదారి పట్టిస్తున్నాయి. ఆర్థిక దోపిడీ పెరిగి ధనవంతులు మరింత ధనవంతులుగాను, పేదలు మరింత పేదలుగా మారిపోతున్నారు. సంపద కేంద్రీకరణ విపరీతంగా జరుగుతున్నది. ఒక అంచనా ప్రకారం భారతదేశంలో కేవలం 10 శాతంగా ఉన్న ధనికుల వద్ద 85 శాతం సంపద, 90 శాతంగా ఉన్న ప్రజల వద్ద 15 శాతం సంపద ఉంది. మెజారిటీ పేదల కొనుగోలు శక్తి తగ్గిపోతున్నది. ఫలితంగా యంత్రాలతో, విపరీతంగా తయారయిన వస్తువులు అమ్ముడు పోకపోవడంతో మాంద్యం ఏర్పడి, భారత సమాజంలో సంక్షోభ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సంక్షోభాల వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ ఆటోమ్యాటిక్‌గా, దానంతట అది ఎప్పుడు కూలిపోదు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులుగా మారినందు న, వారు తమ లాభాలను ఇంకా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. లాభాలు తగ్గించుకుంటేనే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి స్థిరమైన అభివృద్ధి జరుగుతుంది. ఈ అంశాలను ప్రజలచే గుర్తింపజేయటం పురోగామి శక్తుల, వామపక్షాల కర్తవ్యం.

ఎన్నికల రాజకీయాల ద్వారా సంక్షోభాలు పరిష్కారమయ్యే అవకాశాలు తక్కువ. ఈ సంక్షోభాలకు పునాదిగా ఉన్న ఆర్థిక దోపిడీ నుంచి విముక్తి కలిగించినపుడే, అంటే విప్లవం ద్వారా మాత్రమే, పేదలకు, ప్రపంచ మానవాళికి విముక్తి లభిస్తుంది. విముక్తి లభించాలంటే సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేయడం తప్ప మరో దారిలేదు. ఈ విప్లవాన్ని ఎలా తేవాలి అనే విషయాన్ని మార్క్స్, ఎంగెల్స్ చెప్పిన కమ్యూనిస్టు ప్రణాళికలోని అంశాలు తేటతెల్లం చేస్తున్నాయి అందులో వున్న ప్రఖ్యాత నినాదం "ప్రపంచ కార్మికులారా ! ఏకంకండి. మీరు పోరాడితే పోయేది ఏమి లేదు, బానిస సంకెళ్లు తప్ప". మార్క్సిజం ఒక ఫార్ములా(సూత్రం) కాదు, "ఈ ఫార్ములాతో విప్లవం రాదు, నిర్ధిష్ట పరిస్థితుల యొక్క నిర్దిష్ట, విశ్లేషణ యే విప్లవానికి మార్గం చూపుతుంది" అని అంటాడు లెనిన్ మహాశయుడు. ఈ అంశాన్ని మరి కొంత వివరంగా చూద్దాం.

భారతదేశ పరిస్థితులలో పెట్టుబడిదారులు, భూస్వామ్య శక్తుల తో రాజీపడి ఉన్నందున సోషలిస్టు విప్లవానికి ముందు "జనతా ప్రజాస్వామిక విప్లవం జయప్రదం కావాలి. అంటే కార్మికుల, రైతాంగ, ఇతర శ్రామికులు" ఐక్యంగా పోరాడి ఈ విప్లవాన్ని తేవాలి. యూరప్ ఖండంలో 20వ శతాబ్దం ప్రారంభం నాటికే పెట్టుబడిదారీ వ్యవస్థ, సామ్రాజ్యవాద దశకు చేరింది, అంటే అత్యున్నత దశకు చేరింది. దీనిపై లెనిన్ మహాశయుడు చేసిన విశ్లేషణ ఏమంటే "సామ్రాజ్యవాదం మొత్తం ప్రపంచాన్ని ఒక గొలుసుతో కట్టివేసింది. ఆ గొలుసులో బలహీనమైన లింకు ఎక్కడైతే ఉన్నదో, అక్కడనుంచి విప్లవం మొదలవుతుంది. దాని ద్వారానే సోషలిజం ప్రత్యామ్నాయాన్ని నిర్మించగలం" అని ఆయన సిద్ధాంతీకరించాడు. 1917లో బలహీనమైన లింకుగా ఉన్న రష్యాలో, లెనిన్ మహాశయుడు ఆ లింకును ఛేదించి, విప్లవం విజయమయ్యేలా నాయకత్వం వహించి అమలు చేసి చూపించాడు. అయితే సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి నిలబడగల శక్తిగా వున్న సోవియట్ యూనియన్ పతనమైన తరువాత, పెట్టుబడిదారీ వ్యవస్థకు తన లాభాలను ఇంకా పెద్ద ఎత్తున పెంచుకొనే అవకాశాలు పెరిగిపోయాయి. ప్రపంచీకరణ ద్వారా, నయా ఉదారవాద విధానాలను వెనుకబడిన దేశాలలో అమలు జరపటం" అనే విధానాన్నే నయా సామ్రాజ్యవాదమని ఆర్థికవేత్తలు వివరిస్తున్నారు.

ప్రపంచీకరణ లేక నయా ఉదారవాదం యొక్క లక్ష్యం, లాభాలను నిరంతరం పెంచుకుంటూపోవడమే. లాభాలను పెంచుకోవాలంటే ప్రభుత్వరంగ సంస్థలనూ, సర్వీసులనూ ప్రయివేటీకరణ చేయాలి. అడవులు, జలవనరులు, ఇంధనం వంటి ప్రకృతి వనరులను ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పాలి. ఇప్పుడు భారతదేశంలో కూడా జరుగుతున్న ప్రక్రియ ఇదే. నయా ఉదారవాదం అంటే "నియంత్రణ లేని పెట్టుబడి ప్రవాహానికి, దేశాల మధ్య ఉన్న ఆటంకాలు లేకుండా చేసే వ్యవస్థను సృష్టించడం" దీని వలన ఒక కొత్త రకమైన సంక్షోభం పుట్టుకువచ్చింది. ఓ వైపు పెట్టుబడిదారులకు విపరీతంగా లాభాలు పెరుగుతుండగా, మరోవైపు ప్రజానీకం యొక్క కొనుగోలు శక్తి బాగా తగ్గిపోతున్నది. లాభాలు పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, ఇవి రెండూ పెట్టుబడిదారీ వ్యవస్థలో సహజంగా జరిగే ప్రక్రియలే. ఈ కొనుగోలు శక్తి భారీగా తగ్గడం వల్ల కొత్త సంక్షోభాలు వచ్చాయి. ఈ సంక్షోభం నుండి బయటపడటానికి, నయా ఉదారవాదం ఎన్నుకున్న కొత్త మార్గం - ప్రజల మీద దోపిడీని ఇంకా తీవ్రతరం చేసి, ఇంకా లాభాలను పిండుకోవడానికి ప్రయత్నించడం. అంటే దోపిడీ

ఇంకా తీవ్రతరం అవుతుంది కదా. వాటితోపాటు ఈ తీవ్రమైన దోపిడీకి వ్యతిరేకంగా, ప్రజలలో అసంతృప్తి పెరుగుతూ పోతున్నది. ఈ అసంతృప్తి అనేక దేశాలలో పెద్ద పెద్ద ఉద్యమాలుగా మారిపోయి, రాజకీయాలలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీనికి మంచి ఉదాహరణ చూడండి..

- చిలీ అనే (దక్షిణ అమెరికా ఖండంలో) దేశ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఆ దేశంలో ప్రపంచంలోనే మొట్ట మొదట (50 ఏళ్ల క్రితం) నయా ఉదారవాద విధానాలను అమలు చేయడా నికి, అలెండి నాయకత్వాన ఉన్న కమ్యూనిస్ట్ ప్రభుత్వం నిరాకరించింది. అందుకు కక్ష పెంచుకున్న అమెరికా నాయకత్వాన ఉన్న సి.ఐ.ఏ.(సెంట్రల్ ఇంటలిజెన్స్ ఏజన్సీ), సైన్యం కుట్రలు చేసి ఆ ప్రభుత్వాన్ని కూల్చివేశాయి. అయితే ఇప్పుడు (అంటే 50 ఏళ్ల తరువాత) ఆ ప్రజలే ఒక వామపక్ష ప్రభుత్వానికి తిరిగి అధికారం అప్పజెప్పారు.
- దక్షిణ అమెరికాలో, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, ప్రజా ఉద్యమాల ద్వారా, పెరూ, బొలీవియా, వంటి దేశాలల్లో వామ పక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. వెనుజులా దేశంలో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం సాగుతున్నది. ఈ దేశాలన్నిటికి సోషలిస్ట్ క్యూబా దేశం ప్రేరణ ఇస్తున్నది. అయితే నయా సామ్రాజ్యవాదం కొత్త ఎత్తుగడలు ప్రారంభించినది.
- ప్రజల అసంతృప్తి ఉద్యమాలుగా రూపం తీసుకొని, రాజకీయ ప్రత్యామ్నాయం ద్వారా దేశాలు సోషలిజం వైపుకు వెళ్లకుండా చూడటానికి, ఈ నయా ఉదారవాదం ప్రజలలో వెల్లుబుకుతున్న ఐక్యతను చెదరగొట్టటానికి, అనేక రూపాల్లో ప్రయత్నిస్తున్నది.
- మన దేశంలో మతతత్వ, కులతత్వ శక్తులు ప్రజల ఐక్యతను, విచ్ఛిన్నం చేసి, ప్రజలలో పెరుగుతున్న, అసంతృప్తి జ్వాలలను, విప్లవోద్యమం వైపు వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. అనేక ప్రభుత్వాలు ప్రజల ఐక్యతను దెబ్బ తీయటానికి ప్రయత్నిస్తున్న సంగతి మనం వార్తలలో చూస్తూనే ఉన్నాం. దీనిలో భాగంగానే కార్పోరేట్ పెట్టుబడిదారులు లాభాలు పెంచుకోవటానికి ఉద్దేశించిన నగదీకరణ, ప్రయివేటీకరణ, విదేశీ పెట్టుబడులకు అనుకూల చర్యలు తీసుకుంటున్నారు. కానీ ధరలను తగ్గించడానికి, నిరుద్యోగం, పేదరికం అసమానతలను పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. నేటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులలో పురోగామి శక్తులు(లౌకికవాదుల, ప్రజాతంత్ర వాదులు), వామ పక్షాలు) ప్రజానీకంలో నెలకొన్న అసంతృప్తి జ్వాలను నిర్దిష్టంగా అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఉన్నది. అసంతృప్తి చెంది ఉన్న వివిధ ప్రజా సమూహాలను చైతన్య పరచి, ఒక ప్రత్యామ్నాయం దిశగా నడిపించే ప్రయత్నం చేయాలి. ❑

---

# నేరం వారిది కాదు.. కానీ శిక్ష వారికే ?

**(28వ పేజీ తరువాయి)**

ఆ ఫోబియా నిఘా సంస్థలకు ఎక్కువగా పాకింది.

స్వతంత్రం రాక ముందు నుంచి ముస్లిం ఫోబియా తీవ్ర స్థాయికి చేరింది. రెండు మత సమూహాలను రెండు జాతులుగా నిర్వచించి ద్విజాతి సిద్ధాంతానికి సర్వత్రా అంగీకారం వచ్చేలా చూశారు. మనం, వాళ్లు అనే విభజన ముస్లింలను పరాయి వాళ్లుగా, ఆవలివాళ్లుగా మార్చేసింది. ఈ పరాయివాళ్లు, అవతలి వాళ్లు అనే విభజన ముస్లింలను నేరస్తులుగా, శత్రువులుగా ముస్లిమేతరులను నమ్మించే ఒక ప్రక్రియ బ్రిటీషువాళ్ల కాలం నుంచే మొదలైంది. అంటే, ఈ విద్వేష రాజకీయాలను బ్రిటీషు పాలకులు మొదలు పెట్టారని కాదు. బ్రిటీషు పాలన నుంచి అధికారం ఒక వర్గం చేతిలోకి రావాలంటే, ముస్లిం వర్గాన్ని విలనైజ్ చేయాలనే వ్యూహాన్ని ఒక వర్గం శక్తిమంతంగా అమలు చేసింది. ఈ విలనైజేషన్ ప్రాసెస్‌లో మతపరమైన అల్లర్లను ముఖ్యమైన సాధనంగా చేసుకున్నారు.

ఎవరు ఎవరి మీద దాడి చేసినా ముస్లింలను అరెస్టు చేసి జైళ్లలో నిర్బంధించే ఒక పద్ధతిని అమలు చేస్తూ వచ్చారు. అల్లర్లలో పాల్గొన్న హిందూ సంస్థల నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపిన దాఖలాలు లేవు. కానీ, వేలాదిగా ముస్లింలను అరెస్టు చేసిన సంఘటనలు అనేకం వున్నాయి. ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేకున్నా, అరెస్టులు చేసి రోజుల తరబడి బంధించిన ఉదంతాలెన్నో వున్నాయి. ఇదే ధోరణి స్వతంత్రం వచ్చిన తర్వాత కొనసాగుతున్నది. దేశ విభజన తర్వాత పెచ్చరిల్లిన హింసకు మన దేశంలో ముస్లింలు బాధితులయ్యారు. ఆ బాధితులను పోలీసులు, ఇతర భద్రతా వ్యవస్థలు అవాంఛిత వర్గంగా భావించడం ఒక విషాదం. అధికారం కోసం బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు. ముస్లిం ఫోబియాను పెంచుతున్నారు. ముస్లింలను బూచిగా చూపిస్తూ మరొక వర్గాన్ని ఏకం చేసే మాటలు, చేతలను ప్రపంచం గమని స్తూనే వున్నది. మైనార్టీలకు న్యాయపరమైన సహాయం అందడం లేదనీ, దర్యాప్తు సంస్థలు పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయనీ, ముస్లిం మైనార్టీల మీద అంతులేని హింస పెరుగుతుందని పలు అంతర్జాతీయ సంస్థలు నివేదికలు వెలువరిస్తూనే వున్నాయి. ప్రపంచ దేశాల నుంచి ఒత్తిడి ఎదురైన సమయాలలో మన ప్రధాని ముస్లింల ఔన్నత్యాన్ని కొనియాడుతూ ప్రసంగించే సన్నివేశాన్ని మనం చూస్తూనే వున్నాం. దీనినే వంచన అంటారేమో. ❑

# పి.సి.జోషి - భారతీయ సాంస్కృతిక పునర్జీవనం



- అనిల్ రజీమ్‌వాలే

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా 1935 నుండి 1947 వరకు పనిచేసిన పి.సి.జోషి ఆధునిక భారత సాంస్కృతిక చరిత్రపై ప్రగాఢ ముద్ర వేశారు. ప్రాచీన కాలం నుండి స్వాతంత్ర్యానంతర భారతం వరకు ఆ రంగంలో ఆయన చేసిన కృషి అనితరసాధ్యమైనది. మన దేశంలో ఆధునిక సాంస్కృతిక పునరుజ్జీవనానికి చేసిన కృషి కోసం ఒక వ్యక్తికి ఏదైనా అత్యున్నత అవార్డు ఇచ్చే అవకాశం ఉంటే అది నిర్ద్వందంగా పి.సి.జోషినే వరిస్తుంది. కార్మికులను, రైతులను సంఘటితం చేయడమనేది తప్పనిసరైన అత్యంత కీలకమైన విషయమన్న అంశం ప్రత్యేకంగా చెప్పవనసరం లేదు. పి.సి. జోషి తాను నివసించిన కాలంలోని పరిస్థితులను సరిగా అవగతం చేసుకున్నారు. వాటి సారాన్ని అనేక రూపాల్లో వ్యక్తం చేయడానికి ఆయన కృషిచేశారు. ఆ వ్యక్తీకరణలు అనేక రూపాల్లో విస్తృతంగా, విశేషంగా కనిపించాయి. వాటిలో సాంస్కృతిక వ్యక్తీకరణలు చాలా ముఖ్యమైనవి. ఇక్కడ కీలకమైన విషయం ఏమిటంటే కమ్యూనిస్టు పార్టీ అత్యున్నత నాయకుడే ఆధునిక సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం ముందడుగు వేయడం. ఈ దృక్కోణంలో చూస్తే పి.సి.జోషి ఒక 'ఆర్గానిక్ ఇంటెలెక్చువల్' పాత్రను కొంత మేరకైనా పోషించారని చెప్పవచ్చు. ఆయన ఎంతో విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి ఒక సామూహిక సాంస్కృతిక శక్తిని విడుదల చేశారు. ఈ దిశలో ఆయన చేసిన కృషిని ఇప్పటి వరకు ఎవరూ సరిగ్గా విశ్లేషించలేదు. ఎందుకు ఆయన దీనిపై దృష్టి సారించారు ? ఎలా దానిని సాధించగలిగారు? అన్న ప్రశ్నలకు జవాబు అంత సులభంగా చెప్పలేం. దీనికి సంబంధించిన అనేక పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. అయితే, ఆయనకు భారతీయ కళ, సాహిత్యం, సాహిత్య-కళా ఉద్యమాలపై లోతైన అవగాహన ఉందని స్పష్టంగా చెప్పవచ్చు. (ఉదాహరణకు 1857లో విస్తృతంగా ప్రచారంలో ఉన్న పాటలు, భారతదేశంలో సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలు ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ (పిడబ్ల్యుఎ), ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) వంటి ఉద్యమాలను ప్రభావితం చేశాయి. ఈ ఉద్యమాలకు ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న సాంస్కృతిక ఉద్యమాలు కూడా ప్రేరణనిచ్చాయి.

### ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచ రచయితల ఉద్యమం

1935, జూన్ 21న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ప్రపంచ రచయితల సమావేశం జరిగింది. ఆంద్రే గిడ్, మాక్సిమ్ గోర్కీ,



ఆంద్రే మాల్‌రక్స్, ఇ.ఎం.ఫోర్స్‌టర్ తదితరులు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశ ఫలితంగా 'ఫాసిజానికి వ్యతిరేకంగా సాంస్కృతిక పరిరక్షణ కోసం అంతర్జాతీయ రచయితల సంఘం' (International Association of Writers for the Defence of Culture Against Fascism) ఏర్పాటైంది.

అది ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావంతులు ఫాసిజాన్ని ఎదిరిస్తూ వేగంగా ముందుకు వస్తున్న కాలం. జర్మనీలో హిట్లర్ అధికారంలోకి రావడానికి కొద్దిగా ముందు నుంచి, ముఖ్యంగా ఆయన అధికారం చేపట్టిన తర్వాత, సమాజంలోని మేధావులు, విద్యావంతుల్లో గట్టి వ్యతిరేకత చెలరేగింది. అల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటి ప్రతిభావంతులను వేటాడి, బయటకు పంపే పరిస్థితులు జర్మనీలో నెలకొన్నాయి. ఉన్నతశ్రేణి రచయితలు, శాస్త్రవేత్తలు, ఇతర రంగాల ప్రముఖులు కూడా ఫాసిస్టుల నుండి తీవ్ర హింసకు గురవుతామనే భయంతో ఆ దేశాన్ని వదిలి వెళ్లిపోయారు. ఎటువంటి భిన్నాభిప్రాయాలనూ, విమర్శలనూ ఫాసిజం సహించలేదు. ఈ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విజ్ఞాన, సాహిత్య రంగాలకు చెందిన వారిలో కలకలాన్ని రేపాయి. అంతర్జాతీయ రచయితల సంఘం (International Association of Writers) ఫాసిజానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ఒక కొత్త అవగాహన, స్పష్టతను తీసుకువచ్చింది.

రాల్ఫ్ ఫాక్స్, క్రిస్టఫర్ కాడ్వెల్, రొమె రోలా, గోర్కీ, రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మాగాంధీ వంటి నాయకుల స్ఫూర్తి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది. హెన్రీ బార్బస్ క్రియాశీల పాత్ర పోషించగా, లూయి అరగాన్ ఫ్రెంచ్ సాహిత్యానికి, తత్వ శాస్త్రానికి, మానవీయతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

**పి.సి.జోషి, రచయితలు - కళాకారులు**

పి.సి.జోషి అనేక విధాలుగా ఫాసిజానికి, సామ్రాజ్యవాదంతో పాటు ఏ రకమైన అన్యాయానికైనా వ్యతిరేకంగా చైతన్య వంతమైన పోరాటం చేయగల వ్యక్తిగా నిలిచారు. ఆయన వ్యక్తిత్వంలోనే అంతర్లీనంగా స్వేచ్ఛ, స్వాతంత్రం, ఆత్మగౌరవ భావనలు నిండిఉన్నాయి. అందువల్లే ఆయనలో సహజంగానే ఫాసిజం పట్ల వ్యతిరేకత వ్యక్తమైంది. 1930ల ప్రారంభం నుంచి, ముఖ్యంగా 1934-36 మధ్యకాలంలో భారతదేశంలో అభ్యుదయ రచయితల ఉద్యమం అవసరం అన్న భావన బలంగా ఏర్పడింది. దేశం నలుమూలలలోని అనేక రచయితల సమూహాలు స్వప్న ప్రపంచాలకు, పలాయనవాదాలకు పరిమితమైన తమ పాత తరహా రచనా విధానాన్ని విడిచిపెట్టి అభ్యుదయకరమైన నూతన మార్గంలో నడవాలనే తపనతో ఉన్నారు. ఆ రోజుల్లో విస్తృతమౌతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక భావనలు కూడా భారతీయ రచయితలపై ప్రభావం చూపాయి. దీంతో క్రియాశీల, సమకాలీన, ప్రజా జీవితంతో ముడిపడ్డ రచనల కోసం రచయితలు సంకల్పం తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు.

భారత కమ్యూనిస్టు ఉద్యమం పి.సి. జోషి నేతృత్వంలో సాగిన కాలం అది. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని సృజనాత్మకంగా అర్థం చేసుకునే దశగా ఆ కాలం నిలిచింది. రచయితలు, కళాకారులు భారీగా ముందుకు వచ్చి ఈ సామూహిక సృజనాత్మక కార్యకలాపంలో పాల్గొన్నారు. ఆ కాలంలో జరిగిన పరిణామాలకు సహజ ఫలితంగా అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవించింది. పి.సి. జోషి నేతృత్వం, సరైన దిశానిర్దేశం కారణంగా ఆ అవకాశాన్ని వృదా కానీయకుండా వినియోగించకోగలిగారు.

1936 ఫిబ్రవరిలో ఒక మానిఫెస్టోను విడుదల చేశారు. దీనిపై ప్రేమ్‌చంద్, ఆబిద్ హుస్సెయిన్, దయా నరైన్ నిగమ్, అబ్దుల్ హక్ తదితరులు సంతకం చేశారు. ప్రజలను కేంద్రంగా చేసుకుని, మార్క్సిజం దృష్టికోణంలో సాహితీ ప్రక్రియలను సృష్టించాలన్న ఆలోచనలకు అది భూమికగా మారింది. అభ్యుదయ రచయితల సంఘం (ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్)కు ఒక వ్యవస్థాపక కమిటీ ఏర్పాటయ్యింది. ఢిల్లీ, అలహాబాద్, లాహోర్, అలీగఢ్ వంటి నగరాలలో అసోసియేషన్‌కు శాఖలు స్థాపించబడ్డాయి. లండన్‌లో భారతీయ అభ్యుదయ రచయితల సంఘం ఒక సంవత్సరం ముందుగానే ఏర్పడింది. భారతదేశంలోని ప్రతి సాహిత్య కేంద్రంలో శాఖలను స్థాపించడానికి ప్రయత్నాలు జరిగాయి. పూణె, కలకత్తా, బొంబాయి, కాన్పూర్, బెనారస్ తదితర ప్రాంతాల్లో రచయితలతో సమావేశాలు, చర్చలు జరిగాయి.

భారతదేశ చరిత్రలో మొదటిసారి మద్రాస్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, బెంగాల్ వంటి విభిన్న ప్రాంతాల నుండి వచ్చిన రచయితలు లక్నోలో కలుసుకున్నారు. 1936 ఏప్రిల్ 10న అక్కడే మొట్టమొదటి సారి అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘ సమావేశం జరిగింది. ఈ సభకు పెద్దగా సన్నాహాలు చేయలేదు. కేవలం మూడువారాల సమయంలోనే ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సభను భారతీయ సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా రచయితలు మొదటిసారిగా ఒకే వేదికపై వచ్చిన సందర్భమది. ఈ సభ కేవలం సాహిత్య అంశాలకు పరిమితం కాలేదు. అంతకన్నా విస్తృతమైన అంశాలు చర్చకు వచ్చాయి.

కేవలం సాహిత్య పరంగానే కాకుండా జాతీయ, సాంస్కృతిక సామాజిక అంశాలతోపాటు స్వాతంత్ర్యపోరాటం, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై కూడా ఈ సభలో చర్చించారు. ఈ సమావేశమే, 'అభ్యుదయ రచయితలు' అనే కొత్త దృక్పథానికి మార్గం వేసింది. భారతీయ పునరుజ్జీవన ఉద్యమానికి ఒక కొత్త దశగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఫాసిజపు వాతావరణానికి వ్యతిరేకంగా నిలిచింది. పెద్ద సంఖ్యలో రచయితలను, సాహితీ ప్రముఖులను అభ్యుదయ ఉద్యమంలోకి తీసుకువచ్చింది. ఈ సమావేశం తరువాత అభ్యుదయ రచయితల ఉద్యమం విస్తృతమైంది. కోల్‌కత్తాతో పాటు, దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో శాఖలు ఏర్పడ్డాయి.

1936లో జరిగిన సాహితీ సమ్మేళనం అనంతరం ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ వేగంగా విస్తరించింది. కోల్‌కత్తా సహా అనేక ప్రాంతాల్లో దీని శాఖలు స్థాపించారు. 1938 డిసెంబరులో కోల్‌కత్తాలో జరిగిన రెండవ మహాసభలో ప్రముఖ సాహిత్యవేత్త ముల్క్ రాజ్ ఆనంద్ మాట్లాడుతూ, 'భారతదేశంలో ఆధునిక సాహిత్య అభివృద్ధిని నిర్బంధాలు, సెన్సార్ విధానాలు తీవ్రంగా అడ్డుకున్నాయని, ఆ విధానాలు నాజీయిజం, ఫాసిజం తరహా శక్తుల అభివృద్ధికి దోహదపడ్డాయని భారతీయ రచయితలు ఇప్పుడు స్పష్టంగా గ్రహించారు' అని అన్నారు.

ఇరవైవ శతాబ్దం ప్రారంభంలో, బ్రిటిష్ పాలన కొనసాగు తున్నప్పటికీ సాహిత్యం, సాహిత్య- జాతీయవాదం అనేవి ఒక గొప్ప ఉద్వేగంతో విస్తరించాయి. బ్రిటిష్ నిబంధనలు ఈ రకాల రచనలను చట్టబద్ధంగా నిషేధించినా, రచనల ఉధృతి తగ్గలేదు. నయా సంసార్ పబ్లిషింగ్ హౌస్‌ను స్థాపితమైంది. సజ్జాద్ జహీర్ రచించిన నాటకం బీమార్, అలీ సర్దార్ జాఫ్రీ రచించిన మంజిల్, హయత్ ఉల్లా అంసారీ రాసిన అనోఖీ ముసీబత్, బీ.బీ

బేనిపురి రచించిన లాల్ తారాలి, కృష్ణన్ చందర్, ఖాజా అహ్మద్ అబ్బాస్ స్పారోస్ వంటి రచనలతో పాటు, ప్రేమ్‌చంద్ రచనలు, 1938 ఏప్రిల్‌లో జరిగిన రైతుల కవుల మహాసభ, బాంబే, కాన్పూర్‌లలో నిర్వహించబడిన మజ్దూర్ (కార్మిక) కవుల ముషైరా, జుగల్ కిశోర్ శుక్లా రచనలు, వీటితో సమానమైన అనేక సాహిత్య కార్యక్రమాలు... ఇవన్నీ జాతీయవాదులలోనూ, అణగారిన ప్రజలలోంచి వచ్చిన సజీవ మేధావుల్లోనూ లోతైన ఆలోచనా ప్రక్రియలను ప్రతిబింబించాయి.

### సాహిత్య రంగలో జోషి

పి.సి.జోషి రచయితల, కళాకారుల, మేధావర్గాల ఆర్గనైజర్‌గానే కాకుండా తానే స్వయంగా ఒక సాహిత్య రచయితగా, మేధావిగా కూడా పేరుపొందారు. ఆయన రచనల్లో ఇది స్పష్టంగా కనిపిస్తుంది, ముఖ్యంగా 1857 విప్లవ కాలంలో వచ్చిన సాహిత్యంపై ఆయన అనేక పరిశీలనలు చేశారు.

'1857పై ప్రజాగీతాలు' అనే వ్యాసంలో జోషి "ప్రజల వరకు చేరే భారతీయ సంప్రదాయ పద్ధతి ప్రజాగీతాలే! 1857 తిరుగుబాటును నడిపించిన నేతలు ఈ ప్రజా గీతాలను, ఇతర జానపద రూపాలను సమర్థవంతంగా ఉపయోగించారు. బొమ్మలాట వాళ్లు తమ ప్రదర్శనల ద్వారా బ్రిటిష్ పాలనపై ద్వేషాన్ని ప్రేక్షకులలో వ్యాపింపజేశారు. అప్పటిదాకా వివిధ జాతీయ ఘటనలపై వచ్చిన జానపద గీతాలను పరిగణనలోకి తీసుకుంటే, 1857 తిరుగుబాటుపైనే అత్యధికంగా వచ్చాయి. ఇది ఆ పోరాటానికి ప్రజలలో వచ్చిన మద్దతును, జానపద కళల్లో ఉన్న విప్లవ ఆవేశాన్ని సూచిస్తుంది" అని రాశారు.

అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) స్థాపనకు ముందు నుంచీ, ఆ సంస్థలను స్థాపించిన తరువాత కూడా పి.సి.జోషి పలువురు రచయితలను, కళాకారులను సంఘటితం చేసి, చైతన్య పరచేవారు. స్వతహాగా రాజకీయ నాయకుడైనా, మేధావులు, కవులు, రచయితలు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులు, పాత్రికేయులు, న్యాయవాదులు ఇలా ఎన్నో రంగాల ప్రతిభావంతుల ప్రేమనూ, గౌరవాన్నీ ఆయన పొందారు. రైతులు, కార్మికులు ఇలా సాధారణ ప్రజలు కూడా ఆయనను ఎంతో అభిమానించేవారు. సుమిత్రానందన్ పంత్, రాహుల్ సాంకత్యాయన్, బల్రాజ్ సహ్ని, యశ్‌పాల్ లాంటి ప్రముఖులతో పాటు సాహిత్య, కళ, శాస్త్ర, అకడమిక్ రంగాలకు చెందిన అనేక అనేక మంది జోషిని ఎంతో గౌరవంగా చూసేవారు. ఆయన చెప్పేది వినేందుకు, ఆయన రచనలను చదవటానికి వారు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు. నేషనల్ ఫ్రంట్, పీపుల్స్ వార్, పీపుల్స్ ఏజ్ తదితర పార్టీ ప్రచార పత్రికల చుట్టూ అనేకమంది ప్రసిద్ధ రచయితలు, పాత్రికేయులు, కళాకారులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, సినిమా, రంగస్థల ప్రముఖులను ఆయన సమీకరించారు. చిత్త ప్రసాద్ వంటి చిత్రకారులు, సునీల్జన వంటి ఫోటోగ్రాఫర్లు ఆయన నేతృత్వంలో పనిచేశారు. ఆయన నేతృత్వంలోని పార్టీ పత్రికలు, ప్రచార సాహిత్యం నేటికీ ఆదర్శమే. కమ్యూనిస్టు పార్టీ, అనుబంధ సంఘాల సాహిత్యం రాజకీయ, సిద్ధాంతపరమైన లోతుతో ఉండేది. సంఘటనలను పైపైనుండే కాకుండా, వాటి అంతరార్థాలను. కారణాలను కూడా వివరించేవారు.

### ఇప్టా (ఐపిటిఎ) ఆవిర్భావం

భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఒక కీలకాంశంగా ఇండియన్ పీపుల్స్ థియేటర్ కళా ఉద్యమం రూపుదిద్దుకుంది. 1943లో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) స్థాపన భారత సాంస్కృతిక చరిత్రలో అత్యంత ముఖ్యమైన ఘటనగా చెప్పవచ్చు. ఇది భారత దేశ సాంస్కృతిక జీవితంపై చెరగని ముద్ర వేసింది. 1943లో చోటుచేసుకున్న భయంకరమైన బెంగాల్ క్షామ పరిస్థితుల నేపథ్యంలో ఈ సంఘం ఆవిర్భవించింది. ఆ సంక్షోభ సమయంలో సృజనాత్మక వ్యక్తులు తమ గళాలను విప్పడానికి ముందుకు వచ్చారు. కళను ప్రజలకోసం, ప్రజా పక్షంగా సామాజిక మార్పుల కోసం వినియోగించడం ఇప్టా లక్ష్యం.

దేశవ్యాప్తంగా ప్రజల్లో ఉన్న సాంస్కృతిక సామర్థ్యాన్ని వెలికి తీసి, చైతన్యపరిచే కార్యక్రమాన్ని సీపీఐ అప్పటికే ప్రారంభించింది. సీపీఐ తొలి మహాసభ (1943 మే 23 నుండి జూన్ 1వరకు) జరిగిన సందర్భంలోనే ఇప్టా ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ తొలి మహాసభ ఒక గొప్ప రాజకీయ సంఘటన మాత్రంగానే కాకుండా, గొప్ప సాంస్కృతిక సంఘటనగా కూడా చరిత్రలో నిలిచింది. పార్టీ మహాసభకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి, విభిన్న ప్రాంతీయ, సాంస్కృతిక గుర్తింపులతో కూడిన బృందాలు తరలివచ్చాయి. తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి. ఆంధ్ర, బెంగాల్, బిహార్, కేరళతో పాటు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కళాకారులు, బృందాలు ఉల్లాసభరితమైన కార్యక్రమాలు నిర్వహించాయి. రాజకీయంగా అత్యంత కీలకమైన ఈ సమావేశంలో ఒక్క క్షణం కూడా నిరుత్సాహంగా అనిపించలేదు. పార్టీకి ఉన్న సాంస్కృతిక గాథ అనుబంధాన్ని, భారతదేశ సాంస్కృతిక వైవిధ్యానికి, కళా సంపదకు ఉన్న గొప్ప వైభవానికి ఈ సభ అద్దం పట్టింది.

ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ప్రారంభ సదస్సు 1943 మే 25న బాంబేలోని మార్వాడీ విద్యాలయంలో జరిగింది. దీనికి కొన్ని సంవత్సరాలు ముందు నుండి ఏర్పడిన అనేక సంస్థలు, వాటిలో సాగిన సిద్ధాంత చర్చలు అంతిమంగా ఇప్టా ఏర్పాటుకు దారి తీశాయి. 1836లో ఏర్పాటైన అభ్యుదయ

రచయితల సంఘం 1940లో కలకత్తాలో యూత్ కల్చరల్ ఇన్‌స్టిట్యూట్ స్థాపన, 1941లో బెంగుళూరులో ఏర్పాటైన 'పీపుల్స్ థియేటర్' (శ్రీలంక మూలాలు ఉన్న అనిల్ డి సిల్వా అనే మహిళ దీనిని ఏర్పాటు చేశారు) తదితర సంస్థలు, సంఘాల్లో జరిగిన చర్చలు ఇప్టా ఆవిర్భావానికి దారి తీశాయి. ప్రముఖ శాస్త్రవేత్త హోమి జహంగీర్ బాబా పీపుల్స్ థియేటర్ అనే పేరును సూచించారు. ఇదే అంశంపై రోమె రోలా అనే ఫ్రెంచ్ రచయిత రాసిన ఒక పుస్తకం ఆధారంగా ఆయన ఈ పేరును సూచించారు.

బెంగాల్ కరువు సమయంలో చేపట్టిన సహాయ చర్యలు గొప్ప ప్రేరణగా నిలిచాయి. ఆ సమయంలో బెంగాల్‌లోనే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ పలు బృందాలు ఏర్పడ్డాయి. ఈ బృందాలు కేవలం ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడమే కాదు, కరువుతో ప్రభావితమైన ప్రజల కోసం డబ్బు, ఇతర సహాయక వస్తువులను సేకరించాయి. చిత్రపరిశ్రమలో ప్రఖ్యాతి గాంచిన స్వరకర్త ప్రేమ్ ధవాన్, సినీ నటి ఉషా దత్, గాయని రేబా రాయ్, డ్రమ్ వాదకుడు దశరథ్ లాల్ వంటి వారు ఎందరో ఎంతో ఉత్సాహంగా ఈ సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పడిన సహాయ బృందాలను అఖిల భారత స్థాయిలో సంఘటిత పరచి, ఏకీకృత సంస్థగా రూపొందించేందుకు పి.సి. జోషి ముందడుగు వేశారు. దీనిలో భాగంగా జరిగిన ఇప్టా ఆవిర్భావ సభకు ప్రొఫెసర్ హిరెన్ ముఖర్జీ అధ్యక్షత వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ, సరోజినీ నాయుడు, డాక్టర్ రాజేంద్రప్రసాద్ వంటి పలువురు ప్రముఖులు తమ శుభాకాంక్షలు పంపారు. సరోజినీ నాయుడు ఆ తరువాత కాలంలోనూ ఇప్టాపై ఆసక్తి చూపించారు.

ఇప్టా తొలి ప్రధాన కార్యదర్శిగా బొంబాయ్ ఇప్టా కార్యదర్శి అనిల్ డి సిల్వా ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిన ఎన్.ఎం. జోషిని ఇప్టా తొలి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యవర్గంలో కొందరు ప్రముఖులు ఉన్నారు. వారిలో బినోయ్ రాయ్, కె.టి. చాండి, మామా వరేర్‌కర్, కె.ఎ.అబ్బాస్, మఖ్దూమ్ మొహియుద్దీన్, డాక్టర్ రషీద్ జెహాన్, ఎస్.ఎ.శంభూ మిత్రా తదితరులు ఉన్నారు.

ఇప్టా తొలి నివేదికలో వివిధ కళారూపాలను సమగ్రంగా చర్చించారు. సామాజిక నిర్మాణం, మారుతున్న వర్గాల స్వరూపాన్ని, వాటి మధ్య ఉన్న పరస్పర సంబంధాలను విశ్లేషించారు. అణచివేతకు గురవుతున్న ప్రజలు కొత్త ఆశలతో జాగృతమవుతున్నారని, ఇది కొత్త కళా, సాంస్కృతిక రూపాల అవతరణకు దారి తీస్తోందని నివేదిక పేర్కొంది. స్వేచ్ఛ, సంస్కృతులపై పెరుగుతున్న ఫాసిస్టు దాడుల క్రూరత్వాన్ని కూడా నివేదిక గుర్తు చేసింది. ఆ అణచివేత ఫలితంగా నిజమైన కళా, సాంస్కృతిక వ్యక్తీకరణలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపింది. ప్రేమ్‌చంద్, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి వారు ఈ కొత్త ధోరణులకు ప్రాతినిధ్యం వహించేవారు. రచయితలు, కళాకారులలో ఉన్న ఈ ప్రగతిశీల ధోరణులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇప్టా పెట్టుకుంది.

కాలక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా)లు శక్తివంతంగా మారాయి. హంగల్, అమర్ శేఖ్, అన్నా భౌ సాథే, నారాయణ్ సుర్వే, అమృత్‌లాల్ నాగర్, దీనా పాఠక్, సలీల్ చౌధురి, నేమీచంద్ జైన్, సుధీ ప్రధాన్, శాంతి వర్ధన్, రవి శంకర్, శైలేంద్ర, సాహిర్ లుధియాన్వి, భూపెన్ హజారికా, అనిల్ బిస్వాస్, బిష్ణు దే, రాజేంద్ర రఘువంశి తదితరులు ఈ క్రమంలో కీలకపాత్ర పోషించారు.

## కేంద్ర సాంస్కృతిక బృందం (సెంట్రల్ కల్చరల్ స్క్వాడ్)

ఇప్టాతో పాటు భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన కేంద్ర సాంస్కృతిక బృందం కూడా ఈ ప్రక్రియలో గొప్ప చారిత్రక పాత్రను పోషించింది. ప్రముఖ నర్తకుడు శాంతి వర్ధన్ నేతృత్వంలో ఇది 1944 మధ్యలో ఏర్పాటయ్యింది.

బాలే నృత్యరూపాన్ని ప్రజాప్రచారానికి, ప్రజల్లో చైతన్యాన్ని కలిగించేందుకు ఉపయోగించవచ్చని పి.సి జోషి ప్రత్యేకంగా గుర్తించారు. పి.సి జోషి ప్రజా సంస్కృతిని విస్తృతంగా వినియోగించేందుకు చేసిన ప్రయత్నాల వల్ల ఎన్నో కొత్త కళా బృందాలు ఏర్పడ్డాయి. అవి ప్రజలను ఆకట్టుకోవడంతో వేగంగా ఎదిగాయి. ఈ స్క్వాడ్‌ను మొదట ముంబయిలోని అంధేరీ ప్రాంతంలో, పేరేరా హిల్ రోడ్డులో స్థాపించారు. శాంతి వర్ధన్, ఉదయ శంకర్, సచిన్ శామ్లియెన్, బాని దాస్‌గుప్తా, నరేంద్ర శర్మ, రవి శంకర్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. క్రమేణా దీనిలో కళాకారుల సంఖ్య 15కి పెరిగింది. రేఖా జైన్, గంగాధరన్ రెడ్డి, నేమీచంద్ జైన్, బినోయ్ రాయ్, శాంతా గాంధీ, దీనా పాఠక్ వంటి వారు కూడా భాగస్వాములయ్యారు.

ఈ కళాబృందాలు దేశవ్యాప్తంగా అనేక నాటకాలను, బాలే ప్రదర్శనలను, ఇతర కార్యక్రమాలను ప్రదర్శించింది. ఉదాహరణకు 'నావల్ రివల్ట్'లిలి, 'అమర్ భారత్', 'భారత్ కీ ఆత్మా' వంటి నాటకాలు. అలాగే 'లంబాడీ' 'డివైన్ మ్యూజిషియన్' 'రామలీల', 'హెూలీ', 'కలెక్టివ్ ఫార్మ్' వంటి నృత్యనాటికలను దేశ వ్యాప్తంగా ప్రదర్శించారు. ఇవన్నీ ఎంతో ప్రజాదరణ పొందాయి.

జ్యోతిరీంద్ర మోయిత్రా రచించిన 'నవజీవనేర్ గాన్' ఆంధ్రాలో డా. గరికపాటి రాజారావు ప్రదర్శించిన బుర్రకథ, మలబార్ నృత్యాలు, మగాయ్ ఓజ్హా, అమర్ శేఖ్ ప్రదర్శనలు అద్భుతమైన ప్రజాప్రత్యామ్నాయాన్ని అందించాయి. ఇప్టా, కేంద్ర

సాంస్కృతిక బృందం భారతీయ రంగస్థలానికి కొత్త దిశను ఇచ్చాయి. బిజోన్ భట్టాచార్యా రాసిన 'నబన్నా', శంకర్ వాసిరెడ్డి రచనలు, తోప్పిల్ భాసి రచించిన 'నీవే నన్ను కమ్యూనిస్టుని చేశావు' వంటి నాటకాలు దేశవ్యాప్తంగా పేరుపొందాయి. హబీబ్ తన్వీర్, బల్వంత్ గార్గీ, అలీ సర్దార్ జాఫ్రి, ఆచార్య అత్రేయ, ఉత్పల్ దత్, షీలా భాటియా, త్రిప్తి మిత్రా, ఋత్విక్ ఘటక్, దమయంతి సహ్నీ, బలరాజ్ సహ్నీ వంటి పేర్లు దేశమంతా ప్రఖ్యాతి పొందాయి. సీపీఐ, ఇప్టాలతో పాటు పి.సి.జోషి చేసిన అసాధారణ కృషికి ఇది ఫలితం.

ఇప్టా, కేంద్ర సాంస్కృతిక బృందం దేశంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల లోపలకు వెళ్లగలిగాయి. అక్కడ వేలాది మంది ప్రజలు తమ ఇష్టమైన కళాకారులను చూడటానికి, వారి కార్యక్రమాలను ఆస్వాదించటానికి గుమిగూడేవారు. ఈ సంస్థలు కళాపరమైన, సాహిత్యపరమైన ఆసక్తి ఉన్న యువతీ, యువకులకు ప్రేరణగా మారాయి. ఆ సంస్థలలో సభ్యులుగా వారు చేరేవారు. దీనివల్ల భారీ స్థాయిలో శిక్షణ పొందిన కళాకారులు, రచయితలు తయారయ్యారు 1946లో భారత కమ్యూనిస్టు పార్టీ తరపున ఎన్నికల నిధుల కోసం చేసిన విజ్ఞప్తిలో, పి.సి జోషి స్వయంగా రచయితలు, కళాకారులు పార్టీకి క్రియాశీలక సహకారం అందిస్తున్నారని స్పష్టంగా చెప్పారు. 'పెద్ద ప్రజాదరణ కలిగిన కవులు వల్లతోల్, జోష్ మలిహాబాది, సుమిత్రానందన్ పంత్, నిరాలా, నవలాకారుడు శంకర్ బెనర్జీ. సాహితీవేత్తలు మాణిక్ బెనర్జీ తదితరులు కమ్యూనిస్టు పార్టీతో అన్ని విషయాల్లో ఏకీభవించకపోయినా, కమ్యూనిస్టు పార్టీకి మేము మిత్రులం, మేం వారి మేలు కోరుతాం అని గర్వంగా చెబుతున్నారు' అని జోషి తెలిపారు.

## పి. సి. జోషి మాటల్లో..

'బెంగాలీ రంగస్థలానికి గొప్ప గురువు అయిన మనోరంజన్ భట్టాచార్య, అలాగే ప్రసిద్ధ సినీ ప్రముఖులు అయిన కె. ఎల్. సేహ్గల్, మోతిలాల్, జగ్రాజ్, కె. ఎన్. సింగ్, పంకజ్ మల్లిక్ లాంటి వారు మా పార్టీ రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలను గణనీయంగా ప్రశంసించారు. అనేక సందర్భాల్లో పార్టీ నిధులకు తమ వంతు సహకారం అందించారు.' 'ప్రగతిశీల రచయితల ఉద్యమానికి, భారతీయ ప్రజా నాటక ఉద్యమానికి మా పార్టీ చురుకుగా సహకరించింది. రాజకీయ భిన్నాభిప్రాయాలు ఎలా ఉన్నా, దేశంలో ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమాలను అభినందిస్తున్నారు' 'ఈ దేశంలో నిజమైన దేశభక్తి, నీతి, ప్రజాస్వామ్యం, జాతీయత కోసం మా పార్టీ పోరాడుతోంది. కార్మికులు, రైతులు ఆధారంగా ఒక కొత్త సంస్కృతిని అభివృద్ధి చేయాలనే సంకల్పం మా పార్టీకి ఉంది.'

'మా మేధావి మిత్రులు దేశంలో అత్యంత కఠిన పరిస్థితుల్లో కూడా పార్టీకి తగిన సహకారం అందించిన విషయం మాకు తెలుసు.'

'దేశంలోని అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చినప్పుడే సామ్రాజ్యవాద కోటను కూల్చగలం. అప్పుడు మాత్రమే మన ప్రియమైన భారత్ స్వాతంత్ర్యం సాధించగలదు. అప్పుడు మాత్రమే మన సంస్కృతి పుష్పించి, పూర్తి వికాసాన్ని పొందగలదు' 'పార్టీకి మద్దతు ఇవ్వాలని, సాధ్యమైన అన్ని రకాలుగా సహకరించాలని మేధావి మిత్రులకు హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నా' అని ఆయన వివిధ సందర్భాల్లో చెప్పారు.

## ఇప్టా సినిమాలు

ఇప్టా కొన్ని ఫీచర్ సినిమాలను కూడా నిర్మించింది. వాటిలో 'ధర్తీ కే లాల్' అనే చిత్రం భారతీయ చలనచిత్ర చరిత్రలో అతి ప్రాశస్త్యమైన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ముల్క్ రాజ్ ఆనంద్ మాటల్లో చెప్పాలంటే 'ధర్తీ కే లాల్'కి ఉన్న మహాకావ్య గుణాలు, అమెరికన్ సినిమాలు అయిన 'గ్రేప్స్ ఆఫ్ రాథ్', 'ద గుడ్ ఎర్త్' చిత్రాలతో పోల్చదగ్గవి. ఈ చిత్రం బెంగాల్‌లోని తీవ్ర క్షామ పరిస్థితుల్లో ఒక చిన్న గ్రామంలోని కొన్ని కుటుంబాల కథను ఆధారంగా తీసుకుంది. ఈ చిత్రానికి పండిట్ రవిశంకర్ సంగీతాన్ని అందించారు. ఈ తరహాలో మరికొన్ని సినిమాలను కూడా ఇప్టా నిర్మించింది.


అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ కలిసి తదుపరి కాలంలో పలు ముఖ్యమైన సమావేశాలు, సాంస్కృతిక రాజకీయ కార్యక్రమాలను నిర్వహించాయి. పి.సి. జోషి ప్రేరణతో పాటు, ఆయనే ప్రత్యక్షంగా దిశానిర్దేశనం చేసిన సందర్భాలు వీటిలో అనేకం ఉన్నాయి. ఇవి భారతదేశ చరిత్ర, సాంస్కృతి, కళ, సాహిత్య రంగాలపై చిరస్థాయిలో ముద్ర వేసిన ఘట్టాలు. వీటితో ఆ రంగాల కొత్త పునర్జీవనం ప్రారంభమైంది. ఈ కొత్త వికాసానికి కర్త పి.సి.జోషినే!

భారతీయ కళా-సాంస్కృతిక రంగాలకు అభ్యుదయ రచయితల సంఘాన్ని, ఇప్టాను కేంద్రంగా మార్చిన ఘనత పి.సి.జోషికే దక్కుతుంది. ఈ పునర్జీవనానికి కమ్యూనిస్టులను ప్రేరణ శక్తిగా తీర్చిదిద్దిన ఘనత కూడా ఆయనదే. కానీ, తరువాత కాలంలో ఈ పునర్జీవన ఉత్సాహం వైభవాన్ని, శక్తిని కోల్పోయింది. జోషి సృష్టించిన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని తిరిగి నిలబెట్టడం. ముందుకు నడిపించడం కోసం చాలా చేయాల్సిఉంది. దీనికోసం పి.సి.జోషి వేసిన బాటలో మరింత ఉత్సాహంతో, నమ్మకంతో నడవాల్సి ఉంది. ❑

**(అనువాదం: పొగడపు దొరువు)**

**(మార్క్సిస్టు మాసపత్రిక సౌజన్యంతో..)**

# నాటకంగా కొడవటిగంటి కుటుంబరావు 'బకాసుర'



- దివికుమార్

సాహిత్యం రాజకీయాలకు అతీతంగా వుండాలని ఎవరన్నా అంటే వాళ్ళు మోసపుచ్చే వాళ్ళో మోసపోయిన వాళ్లో కావాలి

\- కొ.కు.



**మహా భారతంలో బకాసుర సంహారానికి ఒక ప్రశస్తి వున్నదని చెబుతారు. భీముడు, దుర్యోధనుడు, కీచకుడు, జరాసంధుడు, బకాసురుడు.. ఈ ఐదుగురు ఒకే సమయంలో (ముహూర్తంలో) జన్మించిన వారనీ, వారిలో మొదట ఎవరి చేతుల్లో మరొకరు చనిపోతే మిగిలిన వారందరూ కూడా తొలి యుద్ధంలో గెలిచి బతికిన వాని చేతుల్లోనే చస్తారనీ.. ఆ విధంగా మహా భారత యుద్ధ ఫలితం బకాసుర సంహారంతోనే తేలిపోయిందని అంటుంటారు. భీమ-బకాసుర యుద్ధానికి ఈ కారణంగా ప్రాముఖ్యత హెచ్చి అంత పెద్ద కథలోని ఇంత చిన్న సంఘటన కూడా మహాభారతాన్నెరిగిన వారందరూ తప్పక జ్ఞాపకం పెట్టుకుంటారు.**

**18** పర్వాల ఉద్గ్రంధమైన ఆంధ్ర మహాభారతంలో బకాసుర సంహారం 49 పద్యాలతో, వాటి నడి మధ్య 25 వచన 'సంధు'లతో ముద్రణలో కేవలం 14 పేజీల నిడివిని మాత్రమే కలిగి వుంటుంది.

భీముడు బకాసురుణ్ణి చంపేదాకా ప్రజల కడగండ్లను తీర్చాల్సిన రాజు ఏం చేస్తున్నట్లు ? మూల ఉపకథలో ఏకచక్రపురానికీ, బకాసురునికీ మాత్రమే పేరుంటుంది. రాజు దుర్బలుడని పాండవులు తలదాచుకుంటున్న ఇంటి బ్రాహ్మడుతో నన్నయ చెప్పిస్తాడు. అంతకుమించి రాజు ప్రస్తావనే లేదు.

'వ్యక్తిగత ఆస్తుల సమాజపు రాజ్యమనేది, అత్యధికులైన శ్రామిక ప్రజలను దోపిడీ పీడనలకు గురిచేసే, ఆధిపత్య వర్గాల ప్రయోజనాలను కాపాడే, అణచివేతల సాధనం' అని తన 'రాజ్యాంగ యంత్రం-విప్లవం' అనే గొప్ప పుస్తకంలో లెనిన్ సిద్ధాంతీకరించాడు. రాచరిక కాలంలో దుర్బల రాజ్యాన్ని బలమైన రాజ్యం కబళించి వేస్తుంది. ఒక్క రాక్షసుడినే సంహరించలేని "రాజ్యం" మనుగడలో కొనసాగడం అసాధ్యం. కనుక రాజు దుర్బలుడు కాదు. మరేవో ఇతరేతర ప్రయోజనాలు బకాసుర సంహారానికి రాజును పూనుకోనివ్వకుండా చేసి వుండాలి. "రాజ్యం" యొక్క ప్రయోజనాల్ని, దాని ఆధిపత్య వర్గానుకూల, ప్రజావ్యతిరేక స్వభావాన్నీ, వాటికి భంగం కలిగించే శక్తుల పట్ల అది ప్రదర్శించే క్రౌర్యాన్నీ బహిర్గతం చేసి, దోపిడీ వర్గాల చేతుల్లో పనిముట్టుగా వుండే దాని తత్వాన్ని బట్టబయలు గావించటం కొరకే కొ.కు. 'బకాసుర' కథను తిరగ రాశారు. కొ.కు. యొక్క మేధోశక్తికీ, సామాజిక పరిజ్ఞానానికీ, సృజనశీలతకూ గొప్ప నిదర్శనంగా నిలిచే కథ "బకాసుర". ఈ కథను ఆయన రాసిన కాలంలో (1961లో) ప్రపంచవ్యాపితంగా కమ్యూనిస్టు శక్తులు రెండు శిబిరాలుగా ఏర్పడి పెద్ద చర్చ (గ్రేట్ డిబేట్) సాగిస్తున్నాయి. ఆ శిబిరాలకు రష్యా, చైనా కమ్యూనిస్టు పార్టీలు చెరో వైపునా నాయకత్వ స్థానాల్లో వున్నాయి.

ఆ చర్చలో వ్యక్తిగత ఆస్తులను నిలబెట్టటానికి పుట్టిన - రాజ్యాంగ యంత్రం' (స్టేట్), శాంతియుతంగా శ్రామిక వర్గాల ప్రయోజనాలను కాపాడే విధంగా పరివర్తన చెందుతుందా? లేదా ? అనేదొక ముఖ్యమైన అంశంగా వుండేది.

ధనికులూ-పేదలుగా వుండిన, పితృస్వామ్యమూ కుల వ్యవస్థలతో కూడిన, జవహర్ లాల్ నెహ్రూ నాయకత్వాన గల

భారతదేశపు అసమాన సమాజాన్ని దోపిడీ పీడనలు లేని సమ సమాజంగా ఈ భారత రాజ్యాంగ యంత్రం, దాని వ్యవస్థ మార్చేయగలవా ? అలా మారితే బాగుండుననే ఆశలు ఎవరైనా పెట్టుకోవచ్చు. అందుకు గల అవకాశము, సాధ్యాసాధ్యాలు నిర్ణయించేదెవరు ? ఆశలు పెట్టుకున్న వారా ? లేక ఆ రాజ్య వ్యవస్థ యొక్క వాస్తవిక స్వభావతత్వమా ? ఆనాటి గొప్ప చర్చలో కొ.కు. తన అవగాహనను ఈ కథ ద్వారా అద్భుతంగా వ్యక్తం చేశారు. దాదాపు ఎవరూ కాదనలేనంత తార్కికంగా, హేతుబద్ధంగా, అదే సమయంలో సుస్పష్టంగా రాజ్యాంగ యంత్రం యొక్క వర్గ స్వభావాన్ని బహిర్గతం చేశారు. బకాసురుడు లాంటి విపత్తులు, 'పీడ'ల నుండి ప్రజల్ని కాపాడటం దోపిడీ వర్గ రాజ్యపు లక్షణమూ, లక్ష్యమూ కాదనీ, అలా కాకపోగా ఆ విపత్తుల ద్వారా తాను, తమ మిత్ర ధనిక వర్గాలే ప్రయోజనం పొందేదెలా అని మాత్రమే అది పట్టించుకుని వ్యవహరిస్తుందనీ కొ.కు. తేల్చి చెప్పారు. ఈ కథను రాసిన తదనంతర కాలపు ఇటీవలి ఐదు దశాబ్దాల చరిత్రా, కొ.కు. అవగాహనను, ఆలోచనను సరైనవని రుజువు పర్చింది.

రాజూ-మంత్రీ-వారి సైనిక బలగాలూ, ఉన్నతాధికారులూ ఇంకా నగర ప్రముఖులైన ధనిక వర్గాలూ కలగలిసి రాజ్యం యొక్క మొత్తమవుతుంది. సాధారణంగా మన బూర్జువా పత్రికల మేధావులు నేటి రాజకీయ నాయకులను పరమ అవినీతి పరులుగా చెడదిడుతూ వారిని నిజంగా నడిపించే బహుళజాతి కంపెనీలు, రిలయన్స్‌లు వంటి వారిని దేశాన్నభివృద్ధి పథంలో నడిపిస్తున్న వారుగా చిత్రిస్తుంటారు. రాజకీయ నాయకుల అవినీతి వల్లే దేశం నాశనమై పోతుందని చెబుతూ, వారిని వెనుక నుండి అదుపు చేసే, శాసించే ధనాఢ్య వర్గాలను కాపాడుతూ వుంటారు. నేటి బూర్జువా మీడియా కొ.కు. 'బకాసుర'లోని వేదాంతులకు అత్యాధునిక రూపాలు.

కొ.కు. తనకు బకాసుర కథ యిచ్చిన కొద్ది జాగాలో కూడా ముఖ్యాంశాల్ని విడిచి పెట్టకుండా కొ.కు. రాశారు. రాజ్యంకుండే దోపిడీ వర్గ అనుకూల స్వభావాన్ని స్పష్టం చేశారు. సాంప్రదాయక సంస్కృతి, భావజాల రంగం పాలక వర్గాలను దాని రాజ్యాన్ని కాపాడటానికి సిద్ధంగా ఉంటాయని సోదాహరణంగా చెప్పారు. కర్మ సిద్ధాంతం నుండి పునర్జన్మ వరకు, సమస్త మౌఢ్యాలను విశ్వాసాలను వినియోగించటానికి రాజ్యం ఎలా తయారుగా వుంటుందో 'వేదాంతి' పాత్ర ద్వారా రుజువు చేశారు.

ఆధిపత్య భావజాల రంగం 'దోపిడీ వ్యవస్థను ప్రశ్నించేవారిని అజ్ఞానులని' ప్రచారం చేస్తుంది. నేటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వ్యతిరేకించే వారిని బుర్రలు వట్టిపోయిన వారుగా బూర్జువా మీడియా చిత్రిస్తోంది. ఇది దాని స్వభావంగా రుజువు పరుస్తూ, కొ.కు. 'అజ్ఞాని' అనే పాత్ర ద్వారా 'నిజాలు చెప్పించటం, ప్రశ్నలు లేవనెత్తటం' చేశారు.

పరిణామాలు అర్థమవుతున్నా వాటిని ఎదుర్కొన లేని, నిరోధించ లేని, అశక్తతలో చిక్కుకు పోయిన వాళ్ళు ప్రతి చారిత్రక కాలంలోనూ వుంటారు. వారి నోళ్ళు మూగబోయి వుంటాయి. "బకాసురుణ్ణి భయపెట్టేవాడై వుండి కూడా, వాణ్ణి చూసి హడలిపోయే మంత్రి వగైరాలకు తాను లొంగవలసి వచ్చింది. వైపరీత్యం" అని భటుడు అనుకున్నట్లు కొ.కు. చెప్పింది ఈ తరహా పరిస్థితీ, మనుషులనుద్దేశించే.

సూత యువకుడు బలభద్రుడు సాహసవంతుడు, నిజాయితీ ఉన్నవాడు. కానీ బకాసురుడనే విపత్తు వెనకాల 'రాజ్యం' అనే ప్రబలశక్తి వుంటుందని ఎరుగని అమాయకుడు. మన కాలంలో రాజ్య స్వభావాన్నెరుగని బలభద్రునికి భిన్నమైన మాయా మేయ 'అమాయకుల్ని' పెంచటంలో ఆధునిక సంస్కరణ వాదులదే కాక గాంధీయిజం పాత్ర కూడా చాలా వుంది. వీరు రాజ్యానికుండే 'వర్గ' స్వభావాన్ని పట్టించుకోరు. ప్రజలందరిదీ ననుకుంటారు.

> **కొ.కు.నే ఒకసారి యిలా రాశారు.**
> **ప్రజాపీడ అన్నది నాకు వయసు వుడిగినది గానూ, చత్వారంతో కూడుకున్నది గానూ, స్వతహాగా దుర్బలమైనదిగానూ కనిపిస్తుంది. దాని అసలు శక్తి ప్రజల అజ్ఞానం. ప్రజల భీతి. ప్రజా శత్రువులు దాని బలాన్ని పెంచటానికి ప్రజలలో అజ్ఞానాన్ని, భీతినీ రెచ్చగొడతారు. సరిగ్గా ఈ దృష్టితోనే కొ.కు. బకాసురుణ్ణి అనుసృజించారు. రాజ్యం కంటె, ప్రజాశక్తి కంటె ఎంతో దుర్భలమైన వ్యవస్థలు మనగలగటానికి వాటిని బలోపేతం చేసే రాజ్యమే ముఖ్యకారణం. వేలం వెర్రి భక్తినీ, ఇంగ్లీషు భాషా వ్యామోహాన్ని ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. మాతృభాషలోనే కనీసం ప్రాథమిక విద్య దాకా బోధించమని డిమాండు చేసే మిత్రులు కొందరేమంటారంటే "ప్రభుత్వానికి సంకల్పం లేద"ని!**

కనీసం రోశయ్య గారన్నా అలాంటి సంకల్ప బలాన్ని ప్రదర్శించాలని కోరుతుంటారు. ప్రపంచీకరణ శక్తులకు దాసోహమనే సంకల్పంలో పాలకులు ఉన్నారని, ఇంగ్లీషుని రుద్దటం తప్ప మరొక సంకల్పం ప్రస్తుతానికి వారు తీసుకోలేరని మాతృ భాషాభిమాన మిత్రులు ఎరగరు. ఎరిగే వుంటే అనలేరు. నిజంగా అంటే తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుని బరిగీసి వ్యవహరించవలసి వస్తుంది.

అట్లాగే 'బూతు' సినిమాలను, చెత్త టీవీ సీరియళ్ళను ఆపమని ప్రభుత్వాలకు కొందరు విజ్ఞాపన పత్రాలిస్తూంటారు. ఈ బూతు సినిమాలు, చెత్త సీరియళ్లు ద్వారా సమాజాన్ని యువతరాన్ని పక్కదారి పట్టించకపోతే, అజ్ఞానంలో ముంచి వుంచకపోతే తమ దోపిడీ రాజ్యానికి పుట్టి మునిగిపోయే పరిస్థితి వస్తుందని రాజ్యవ్యవస్థకు బాగా తెలుసు. అది తెలియని వారికి తెలియ చెప్పటానికి ఉద్దేశించి విజ్ఞాపన పత్రాలు ఇవ్వవచ్చును గానీ, నిజంగానే ఈ పాలకులు కుళ్లు సంస్కృతి అనే బకాసురుణ్ణి సంహరించేస్తారని భ్రమలు పెట్టుకుంటే ప్రయోజనం ఎవరికో స్పష్టమే !

'నేటి కాలానికి ప్రజలపాలిట బకాసురుడు లాంటి 'పీడ' సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, దాని టెర్రరిజం, మతతత్త్వం, నిరుద్యోగం, అధిక ధరలు, మృగోన్మాద పితృస్వామ్యం, కులవ్యవస్థ.. మరింకెన్నో రూపాలుగా వ్యక్తమవుతున్నాయి'.

మరి దీన్ని ఎదుర్కోగలిగిన భీముడెవరు ?

'ప్రజాస్వామిక యుగంలో ప్రజలే, కష్టజీవులే, వారి ఉద్యమాలూ, పోరాటాలే, వారి సంఘటిత శక్తే బకాసురులను అదుపుచేయ గలిగేది.' ఇవి దోపిడీ రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేసి, ప్రజల రాజ్యాన్ని నిర్మించుకోగలుగుతాయి.

వ్యక్తిగత ఆస్తులను కాపాడటానికి ఉనికిలోకొచ్చిన ఈ రాజ్యాంగ యంత్రం ప్రజలకొచ్చిన విపత్తులను, తన ధనికవర్గ ప్రయోజనాలకు వినియోగిస్తుంది తప్ప శ్రామిక ప్రజల ప్రయోజనాల కొరకు కృషి చేయదని చెప్పటం ద్వారా, ప్రజా విప్లవం, విముక్తి పోరాటాలతో మాత్రమే నూతన వ్యవస్థ నిర్మాణం సాధ్యమని కొ.కు. తనదైన శైలిలో 'బకాసుర' కథలో స్పష్టం చేశారు. కథలోని రాజు–మంత్రి భీముడిని అంతం చెయ్యటానికి వేసిన పథకం, చేసిన కుట్ర అల్లూరి సీతారామరాజు కాలం నుండి నేటి దాకా విరామమెరగకుండా సాగుతున్న ఎన్‌కౌంటర్ల చరిత్రను తలపిస్తోంది.

**నాటకంగా ఎన్.టి.రామారావు రచన 'బకాసుర'**

కొ.కు. 48 ఏళ్ళ క్రితం రాసిన ఈ కథను 18 ఏళ్ళ క్రితం అంటే 1991లో (నేటికి 30 ఏళ్ల క్రితం) 'నెమలికంటి తారక రామారావుగారు' నాటకంగా మలిచారు. కె.ఎస్.ఎన్.మూర్తి దర్శకత్వంలో రెండు గంటల నిడివితో దీన్ని హైదరాబాదు, తెనాలి, గుంటూరు, మదనపల్లిలాంటి చోట్లనే కాక బొంబాయి, సూరత్, అహ్మదాబాద్‌ల్లో కూడా ప్రదర్శించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయపు థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులు దీన్ని నేర్చుకొని కొన్ని ప్రదర్శనలు కూడా యిచ్చారట.

కొ.కు. 'బకాసుర' కథలోనే మంచి నాటకీయత ఉంది. సంభాషణల్లోనూ వుంది, కథా గమనంలోనూ ఉంది.

నన్నయ బకాసురునికి తప్ప మరెవరికీ పేర్లే పెట్టలేదు. కొ.కు. పాండవులనూ, వారి తల్లినీ ఆదరించిన బ్రాహ్మడికి చయనులు అని పేరు పెట్టారు. మిగిలిన పేరున్న, పేరు లేని పాత్రలన్నిటినీ కొ.కు.నే కల్పించారు. నాటకంలో కొత్వాలు అనే మరొక ముఖ్య పాత్రను తారక రామారావు కల్పించారు. చయనులుకు దీక్షితులనే మరో పాత్రను తోడు చేశారు. నగర ప్రముఖులను వర్తకుడనీ, భూస్వామి అనీ పేరు పెట్టారు. బకాసురుని దెబ్బకు తొలిగా దెబ్బ తిన్న వ్యక్తిని నాటకంలో యిమిడ్చారు. 3 రంగాలను చిరు దృశ్యాల (సీన్లు) వారీగా నడిపించారు.

నాటకం ముగింపులో రాజు మంత్రి నడుగుతాడు 'నిజంగా బకాసురుడు చచ్చాడా? లేక పుకారు లేవ దీశారా?' అని. నేపథ్యం నుంచి 'నేను చావలేదు. నాకు చావురాదు. మీలాంటి ప్రభువులు, ఈ ప్రభువులను గుడ్డిగా నమ్మే ప్రజలున్నంతకాలం నేను బ్రతికే వుంటాను' అని పెద్ద గొంతు వినిపిస్తుంది.

"నీ పేరు" అనడుగుతాడు మంత్రి.

గొంతు : ఇంతవరకు బకుడు, బకాసురుడు.. ఇక ముందు మరోపేరు. ఏ పేరయితేనే దైవం, దయ్యం, మతం, మూఢాచారం, అజ్ఞానం, అనారోగ్యం, ఆకలి, అరాచకం.. ఇవి వున్నంతకాలం, సమాజంలో రాక్షసత్వానికి చావు లేదు.. మహాత్ములు, మహనీయులు, మహా పురుషులు, పాలితులు, పీడితులు–పరాన్న భుక్కులు వున్నంత కాలం ఏదో మూల, ఏదో రూపంలో రాక్షసాంశ వుంటూనే వుంటుంది. 'బకాసురుడు చిరంజీవి' అనగానే రాజు మంత్రీ సంతోషంగా నమస్కరించటంతో నాటకానికి తెరపడుతుంది.

నాటకంలో రాజును 'తిక్క వాడు'గా చిత్రించారు. నాటకీయ ఆకర్షణకు అది ఉపయోగపడి వుండవచ్చు గానీ, కొ.కు. ఏ అంశాన్ని ప్రముఖంగా అర్థం చేయించదలుచుకున్నాడో అది పలచనైనట్లుంది. రాజ్యానికుండే దోపిడీవర్గ స్వభావం, ప్రజావ్యతిరేక తత్వం, క్రూర అణచివేతల విధానం బహిర్గతం కాకుండా, ఇవన్నీ 'తిక్కల' రాజుల చిక్కిరిబిక్కిరి పనులు, అదే మంచి రాజు అధికారంలోకొస్తే అలాంటివి వుండవనే భావానికి దారి తీస్తుంది. ఈ రాజ్యాంగ యంత్ర వ్యవస్థను ప్రజలు అర్థం చేసుకుని దాన్ని సమూలమైన మార్పులకు గురిచేయాల్సి ఉంటుందనే లోతైన అవగాహనకు తిక్కలరాజు రానివ్వడు. ఔత్సాహిక నాటక బృందాలు కూడా 'బకాసుర'ను ప్రదర్శించటానికి ప్రయత్నించవచ్చు. ప్రోసీనియం (స్టేజి) నాటక ప్రక్రియ ద్వారా కంటే వీధి నాటిక ప్రక్రియ తొలి కొ.కు. 'బకాసురను' మరింత బలంగా దృశ్యీకరించి ప్రదర్శించవచ్చు. ❑

**(319వ ప్రజాసాహితి, నవంబరు, 2009, కొడవటిగంటి కుటుంబరావు శతజయంతి సంచిక)**

# స్వాతంత్ర్య దినాన గుర్తు చేసుకోవాల్సిన మంచి విషయాలు



- డాక్టర్ దేవరాజు మహారాజు

స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొని, జైలు జీవితం గడుపుతున్న దశలో అంటే 1934-35 ప్రాంతంలో జవహర్ లాల్ నెహ్రూ తన ఆత్మకథ(TOWARDS FREEDOM) రాసుకున్నారు. బానిస సంకెళ్లు తెంచుకుని, దేశం స్వేచ్ఛ కోసం తపిస్తున్న దశలో ఆయన ఆ గ్రంథంలో తన అనుభవాలు నమోదు చేసుకున్నారు. నెహ్రూజీ జైలులో ఉన్నప్పుడే ఆయన భార్య కమలా నెహ్రూ అనారోగ్యంతో మంచానపడి ఉన్నారు. కూతురు ఇందిర అప్పటికి చిన్న పిల్ల. ఆమె ఆలనాపాలనా చూసే వారు ఎవరూ లేకపోవడం వల్ల, ఆమెను తరచూ రవీంద్రుడి శాంతినికేతన్‌కు పంపుతూ ఉండేవారు. రవీంద్రుడి పర్యవేక్షణలో ఆమె బాల్యం అక్కడ గడుస్తూ ఉండేది. అందరినీ సమంగా ప్రేమగా చూసే లక్షణం ఆ బాలికలో ఉందని గ్రహించి, విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ ఆమెని ముద్దుగా 'ప్రియదర్శిని' అని పిలిచేవారు. అప్పటి నుండి ఆమె అలా ఇందిరా ప్రియదర్శిని అయింది !

పండిట్ నెహ్రూకు సాహిత్యం కళల పట్ల ఉన్న అవ్యాజ్యమైన ప్రేమ జగద్విదితం ! ఆయన ఆత్మకథను చదివి టాగూర్ ఆశ్చర్య చకితుడైపోయారు. ప్రశంసల వర్షం కురిపిస్తూ ఉత్తరం రాశారు. అప్పటికి నెహ్రూ భారత తొలి ప్రధాని కాలేదు. స్వాతంత్రోద్య మంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న యోధుడు-దేశ భక్తుడు మాత్రమే ! భార్య అనారోగాన్ని, అస్తవ్యస్తమైన కుటుంబాన్నీ పక్కనపెట్టి, పూర్తి సమయం దేశం కోసం వెచ్చించడం, మానవీయ విలువల కోసం తపించడం రవీంద్రుడికి బాగా నచ్చింది. 31 మే, 1936న తన నివాసమైన శాంతినికేతన్ నుంచి రవీంద్రనాథ్ టాగూర్, జవహర్‌లాల్ నెహ్రూకు రాసిన ఉత్తరం ఇలా ఉంది.

**'ప్రియమైన జవహర్,**

మీ పుస్తకం 'టు వర్డ్స్ ఫ్రీడమ్' - ఇప్పుడే పూర్తి చేశాను. నిజంగా అది చాలా గొప్ప పుస్తకం ! చదువుతూ చదువుతూ ఎంతగానో చలించిపోయాను. మీరు సాధించిన విజయాలు తెలుసుకుని గర్వపడుతున్నా. అన్నింటినీ మించి అట్టడుగున ప్రవహించే లోతైన మీ మానవత్వపు దృక్కోణం-సంక్లిష్టమైన చిక్కు ముడులన్నింటినీ విప్పుతూ ఉంది ! వాస్తవాల్ని నిబ్బరంగా బహిర్గతం చేస్తూ ఉంది. ఇంత వరకు మీరు సాధించిన విజయాలకు మించిన మహోన్నతమైన వ్యక్తిత్వం - అనే



విషయం మీ పుస్తకం పుటలు తిప్పేస్తూ ఉంటే తెలిసిపోతూ ఉంది. సమకాలీన స్థితిగతుల నుంచి నిజాయితీ అయిన ఒక నిఖార్సయిన మీ వ్యక్తిత్వం గోచరిస్తూ ఉంది" అని కితాబిచ్చారు రవీంద్రనాథ్ టాగూర్ !

సాహిత్య ప్రేమికుడు, సాహిత్యకారుడూ అయిన భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు విశ్వకవి రవీంద్రుడు, సరోజినీ నాయుడు, అమృతా షేర్‌గిల్, ఫ్రెంచ్ సాహిత్యకారుడు, నోబెల్ గ్రహీత రోమైన్ రొల్లాండ్ వంటి దిగ్గజాల నుండి తరచూ ఉత్త రాలు వస్తూ ఉండేవి. సమయం చూసుకుని వారికి నెహ్రూజీ జవాబులు రాస్తుండేవారు. ఆ రోజుల్లో విషయాలు తెలుపు కోవా లంటే ఏకైకమార్గం ఉత్తరాలు రాసుకోవడమే ! దానితోపాటు లేఖలు రాయడం ఒక కళగా పరిగణింపబడుతూ ఉండేది. ఆలోచనాపరుల మధ్య సాగే ఉత్తరాలైతే మరింత ఉత్తేజ భరితంగా ఉంటుండేవి. జైలు నుంచి నెహ్రూజీ తన కూతురు ఇందిరా ప్రియదర్శినికి రాసిన ఉత్తరాలు సాహిత్య ప్రపంచంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆ ఉత్తరాల్లో స్వాతంత్రోద్యమ అంశాలు, దేశ కాల పరిస్థితులు, చారిత్రక, సామాజిక, సాహిత్య, కళారంగాలకు సంబంధించిన అనేక అంశాలు చర్చించబడుతూ ఉండేవి. తరువాతి కాలంలో ఆ ఉత్తరాలన్నీ 'Glimpses of world history ' శీర్షికతో పుస్తకంగా వెలువడింది. విశ్వ సాహిత్యంలో విశిష్టమైన గుర్తింపు తెచ్చు కుంది. తర్వాత మరో పుస్తకం Discovery of India ఈ గ్రంథం ఆధారంగానే చిత్ర దర్శకుడు శ్యామ్ బెనెగల్ "భారత్ ఎక్ ఖోజ్" పేరుతో టెలివిజన్ సీరియల్ రూపొందించారు.

"తన తర్వాత తన భాష మాట్లాడేది నెహ్రూనే"- అని గాంధీజీ

తరచూ అనేవారు. సి.రాజగోపాలాచారి (రాజాజి) నెహ్రూకన్నా వయసులో పదకొండేళ్ల పెద్ద-అయినా కూడా, తనకన్నా నెహ్రూ పదకొండు వందల రెట్లు గొప్పవాడని రాజాజీ ప్రశంసిస్తూ ఉండేవాడు. అలాగే సర్దార్ వల్లభాయి పటేల్ పండిట్ నెహ్రూ కన్నా పధ్నాలుగేళ్లు పెద్దవాడు. అయినా కూడా నెహ్రూకి తను జీవిత కాలం విధేయుడినని ప్రకటించుకున్నాడు. నెహ్రూ తొలి ప్రధాని అయ్యాక, తన మంత్రి వర్గంలో చేరి, హోం శాఖ నిర్వహించాల్సిందిగా పండిట్‌జీ పటేల్‌కు లేఖ రాశారు. దానికి వల్లభాయ్ రాసిన ప్రత్యుత్తరం ఇలా ఉంది. ఆ ఉత్తరమే అన్ని విషయాలు తెలియజేస్తూ ఉంది. అందులోని ముఖ్యమైన అంశాలు ఇక్కడ పొందుపరుస్తున్నాను.

**"ముప్ఫయ్యేండ్లుగా కొనసాగుతున్న మన స్నేహబంధం, స్వాతంత్రోద్యమంలో కార్యకర్తలుగా మన అనుబంధం చాలా గొప్పవి. వాటి ముందు ఈ ఆనవాయితీ అంగీకారాలు అవసరం లేదు. నా సేవలు మీరు ఎలాగంటే అలా ఉపయోగించు కోవచ్చు. ఈ దేశం కోసం మీరు చేసిన త్యాగం గొప్పది. అలాంటి త్యాగం మీరుకాక మరొకరు ఎవరూ చేయలేదని నా విశ్వాసం! అందువల్ల ఇక నా జీవితమంతా మీకు ఎదురు చెప్పనివాడిగా, విశ్వాసపాత్రుడిగా ఉంటానని మాట ఇస్తున్నాను. మీరు నాకు కేటాయించిన పనిని అంకితభావంతో చేస్తాను"**

మరొక సందర్భం గుర్చి కూడా పటేల్ ఇలా రాశాడు. "నేను కశ్మీరుకు చేయగలిగింది చేశాను. మీకూ, నాకూ కశ్మీరు సంబంధించిన విధానపరమైన అభిప్రాయభేదాలు లేవు. కానీ, మనకింద ఉన్న వారు మన మధ్య పెద్ద అగాధాలు ఉన్నట్లు భావించారు. అలాగని ప్రచారం చేసినట్లున్నారు. అయినా నిజాలు దాగవు". సర్దార్ వల్లభాయ్ పటేల్ 1947 అక్టోబరులో రాసిన ఉత్తరాన్ని నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా ఒక పుస్తకంలో (2010) ప్రచురించింది. ప్రముఖుల ఉత్తరాలన్నీ సేకరించి ఎన్.బి.టి ప్రచురించిన పుస్తకంలో ఇది ఉంది. జవహర్‌లాల్ నెహ్రూ నాటి దేశ రాజకీయాలనే కాదు, ప్రపంచ రాజకీయాలను కూడా శాసించారు. దేశానికి దిశా నిర్దేశం చేస్తూ, దేశ ప్రజలకు వైజ్ఞానిక స్పృహను నూరిపోశారు.

వాల్టర్ కూకర్ మాటల్లో నెహ్రూ ఒక అరుదైన వ్యక్తి, సర్వ స్వతంత్రుడై ఉండి, తెలివీ, శక్తి సామర్థ్యాలు ఉండి, మంచివాడుగా, వినయశీలిగా ఉండడం చాలా అరుదు !" మరి ఇప్పుడు సమకాలీనంలో ఎలాంటి దేశ నాయకుల్ని చూస్తున్నాం? చదువు లేక, సంస్కారం లేక, వ్యక్తిత్వం లేక, మందబలంతో బరితెగించిన నేతల్ని మనం మన కండ్లముందు చూస్తున్నాం. ఇంతెందుకూ? వారి పార్టీ నాయకుడూ, మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి నెహ్రూను 'భరతమాత ముద్దు బిడ్డ-అని ప్రశంసించాడు. నెహ్రూ మరణించినప్పుడు వాజ్‌పేయ్ అర్పించిన నివాళి ఈ విధంగా ఉంది.

"ఒక కల విచలితమైంది.  
ఒక పాట మూగబోయింది.  
ఒక జ్వాల అనంతంలో కలిసిపోయింది.  
భయం, ఆకత లేని ఒక ప్రపంచపు కల అది !  
ఇటు గీతాసారాన్ని ప్రతిధ్వనించే గీతం.  
అటు రోజా పువ్వు వెదజల్లే పరిమళం.  
ఎదురైన ప్రతీచీకటితో పోరాడుతూ, వెలుగులీనుతూ,  
ప్రతి రాత్రీ మేల్కొని మండుతున్న దీపం అది.  
మాకు దారి చూపుతూనే  
ఒకనాటి ఉదయం నిర్వాణం చెందింది.  
మరణం తప్పదు - భౌతిక శరీరం తాత్కాలికం.  
ఆ బంగరు శరీరం నిన్న గంధపు చెక్కల మధ్య మాయమైంది.  
కానీ, ఆ మృత్యువు ఎందుకు అంత తొందరపడిందీ ?  
స్నేహితులంతా నిద్రలో ఉన్నప్పుడు,  
పహరా కాస్తున్న వారు ఒకింత మగతగా ఉన్నప్పుడు..  
జీవితంలో మాకు ఎంతో విలువైన ఆ బహుమతిని  
మృత్యువు ఎందుకంత నిర్లక్ష్యంగా లాక్కుపోయిందీ ?  
భరతమాత విషాదంలో మునిగిపోయి ఉంది.  
తన ముద్దు బిడ్డను ప్రియతమ రాకుమారుణ్ణి  
ఈ రోజు కోల్పోయానని!  
తన అనుచరుణ్ణి, తన సహచరుణ్ణి కోల్పోయానని -  
మానవత్వం ఈ రోజు భిన్నవదనంతో ఉంది.  
తన పరిరక్షకుడు ఇక లేడని - శాంతి  
ఈ రోజు అసహనంగా ఉంది.  
అణగారిన బతుకులకు అండ లేకుండా పోయింది.  
సామాన్యుడి కండ్లలో వెలుగులు ఆరిపోయాయి.  
తెర పడిపోయింది.  
ప్రపంచ రంగస్థలం మీది నుంచి ఒక ముఖ నటుడు  
తన చివరి పాత్ర పోషించి, ప్రేక్షకుల వద్ద సెలవు  
తీసుకుని నిష్క్రమించాడు"

భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పాయి స్వయంగా కవి గనుక, భావోద్వేగంలో ఆయన చెప్పిన ఈ పైమాటలు కేవలం ఆనవాయితీగా చెప్పిన పొడిమాటలు కావు. ఆయన గుండె లోతుల్లోంచి తన్నుకుని వచ్చినవి అని అర్థమవుతూ ఉంది! పార్టీలు వేరైనా, రాజకీయంగా భేదాభిప్రాయాలున్నా ఒక మహామనిషి కనుమరుగైనప్పుడు - ఆయన వ్యక్తిత్వాన్ని నిజాయితీగా వ్యక్తీకరించాలి. ఆ పని ఆనాటి బీజేపీ అగ్రనేత వాజ్‌పేయ్ చేశాడు. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు వాజ్‌పేయ్ విమర్శను ఆహ్వానించి **(మిగతా 38వ పేజీలో)**

# వివక్ష, విధ్వంసాలపై కవితాస్త్రం



- తంగిరాల సోని




తరతరాల కుల చట్రాలను, మత మౌఢ్యాలను సమాజంలో పేరుకుపోయిన అసమానతలను జీవిత స్వీయ, స్వయ, సంఘర్షణలను, చారిత్రక, వాస్తవ పరిస్థితులను, జరుగుతున్న విషయాలను కళ్ళకు కట్టినట్టు చూపిస్తోంది చల్లపల్లి స్వరూప రాణి కొత్త కవితా సంపుటి 'అల్లిక'. ఇందులో మొత్తం 50 కవితలు వున్నాయి. మంకెన పువ్వు, వేకువ పిట్ట తర్వాత వచ్చిన మూడో సంపుటే ఈ అల్లిక. కవితలు ఒక దాని తర్వాత మరొ కటి అని ఏకబిగిన చదివించి చదువరిని ఆలోచింప చేస్తాయి. మనుషుల్లోనే ఇంత వ్యత్యాసాలు, ఇంత వైషమ్యాలు ఉంటాయా? అని మనల్ని మనమే ప్రశ్నించుకునేలా చేస్తాయి. కులం దాటి మతం, మతం దాటి జాతి, జాతి దాటి అంతర్జాతీయ విషయాలను అల్లికలో కనబడతాయి. దేశం నడిబొడ్డున నిలబడి ఆత్మ గౌరవ కేక ఈ అల్లిక.



**మొదటి కవిత 'గోవు కేక'తో ప్రారంభమవుతుంది.**

"యేపనీ చేతగాని పిల్లోడ్ని/ వేదికపైకి పిల్చి/ పరమ వీరచక్ర బిరుదిచ్చినట్టుంది నా పని/ పేరుకి సాధు జంతువునే అయినా యెందుకో/ మూట కట్టుకుంటున్నదాన్ని !/ యీమధ్య కొందరు/ యెన్నడూ లేని ప్రేమ కురిపిస్తున్నారు/తమ పగోళ్ళని మట్టుబెడుతున్నారు / సిగ్గుతో కుచించుకు పోతున్నా!/ నిజానికి నాకూ వూపిరాడ్డం లేదు / యే బాబా అయినా కనికరించి నాకు నోరు తెప్పిచ్చండి బాబయ్యా ! చచ్చి మీ కడుపున పుడతా ! నేనూ చెప్పాల్సింది వుంది/ అవును, నేను ఆవునే మాట్లాడుతున్నా" దేశంలో గోవు పేరిట జరుగుతున్న ఉదంతాలను, గొడవలను కళ్ళకు కట్టినట్లు చూపించారు ఈ కవితలో.

'అనల్ప' కవితలో-'నాకొక బుజ్జి పిల్లి పిల్ల దొరికింది/కాదు, నేనే దానికి దొరికాను/ చిన్న చీపురు పుల్ల/ దాని చేతికి దొరికినాఆ పుల్లతో ఆనందంగా ఆడుకుంటది/నిష్టా గరిష్టుల కన్నా/ చెవిలో జోరీగల్లా పిల్లికి బిచ్చం పెట్టని భద్రయ్యలకన్నా ప్రేమలో నా చిన్నారి పిల్లి పిల్ల యెప్పుడూ పైయెత్తునే కూకుంటది/తమ శాకాహారం, ఆయిల్ పుల్లింగ్ లోక కళ్యాణార్ధమే సుమీ!/ అని బీరాలు పోయే అల్ప బుద్ధుల ముందు మా బుజ్జి పిల్లి యెప్పుడూ అనల్పమే" అంటూ తన ఇంట్లో పెంచుకునే పిల్లి పట్ల ఒక గొప్ప కవితా ఇందులో వుంది.

'ట్యాంకు పెట్టె' కవితలో - 'లేడీస్ హాస్టల్, వో వింతలమారి ట్రంకు పెట్టె/ తీపి చేదు కలబోతల భాండాగారం/ అక్కడ కులం వో కక్కీసుదొడ్డి/కులం బుస్సుమంటుంది అయితేనేం హాస్టల్ బందిఖానా బృందావనం" అంటారు. 'కడిగినట్టే వుంటది, కంపు వదలదు/అన్నంలో పురుగులొచ్చాయని చెప్పాలంటే/ పెద్ద కులం అర్హత వుండాలి/ఆడపిల్లల్ని వ్యక్తులుగా మార్చే కర్మాగారం లేడీస్ హాస్టల్/తేలీకుండానే యెన్నో యిచ్చింది/కలలు, కలతలు, కేరింతలు, కలవరింతలు/ అన్నీ నిండిన కుండ నేను యిష్టంగా తెరిచి తరచి తరచి చూసుకునే ట్రంకు పెట్టె' అని చదువుకునే చోట కనిపించే వివక్షను ఎండగట్టారు. హాస్టల్ జీవితాలను, దళిత ఆడపిల్లల బతుకులను, జ్ఞాపకాలను కన్నీళ్ళగా భద్రపరిచిన కవిత ఇది.

'సోషల్ డిస్టెన్స్' కవితలో.. 'కరోనా! హమ్ అబ్ నహీ రోనా ! 'సోషల్ డిస్టెన్స్' క్యా బాత్ హై!/ 'సామాజిక దూరం' అని అందరూ పైకి అనేస్తుంటే/ వినడానికి చెవులకి బోయింపుగా వుందిలే!/ 'సోషల్ డిస్టెన్స్' అది మాకెప్పుడో తెలుసుగా!/ నీకు తెలీదు కామోసు!/ చేతులు కడుక్కుంటే యేమొస్తది గానీ వోపాలి మనసుల్ని కడుక్కోమని యిక్కడి మడి మనుషులకి చెప్పి వెళ్ళు!' అంటూ తరతరాలుగా ఈ దేశంలో అణిచివేతకు గురవుతున్న

దళితులకు ఈ సోషల్ డిస్టెన్స్ అంటే కొత్త కాదని చెప్పారు. కరోనాతో సోషల్ డిస్టెన్స్ అంటే పెద్దగా మాకు వింతే కాదని తెలియజెప్పారు.

'నరబలి' కవితలో– 'చచ్చినాక బ్రాహ్మణ చండాలుడైన ఒకటే అన్నావు అన్నమయ్యా! మేము చచ్చినా పూడ్చుకోడానికి కాసింత జాగా దొరకదని ఎన్నిసార్లు రుజువైందో చూసావా?" అంటూ ఈ దేశంలో మనిషి చచ్చినా ఆరు అడుగుల నేల దొరకని దేశంలో, నాలుగు దిక్కులు కులం వుంటుందని, నేల ఇవ్వని దేశంలో అస్వతంత్రంగా బతుకుతున్న బతుకుల గురించి వచ్చిన కవిత.

'మామిడి పళ్ళ రక్తం' కవితలో– 'అప్పుడు కోటేసు/ చెంబు దొంగతనం చేస్తే / సజీవ దహనం చేయలేదా / ఇప్పుడు శీను / మామిడికాయ దొంగతనం చేసినందుకు/ వురిశిక్ష వేశాం/ స్థల కాలాలే మారింది/ అంతా సేమ్ టు సేమ్" అని ఆవేదన వ్యక్తం చేశారు. వివక్ష వికృత చర్యలను ఎద్దేవా చేశారు.

2019లో మామిడికాయ దొంగతనం చేసినందుకు బక్కీ శీను అనే దళితుడిని పశ్చిమ గోదావరిలో పెత్తందారి కులాలు చంపిన ఘటన నేపథ్యంలో ఈ కవిత రాశారు. 'ఐ కాంట్ బ్రీత్' కవితలో "ఒక తెల్లటి బూటు కాలు/ తరాల నుంచి/ మెడ నరాల మీద/ అదిమి వుంచిన ఆకాశమంత స్వేచ్ఛగా/గాలి పీల్చుకోవాలని నా శతాబ్దాల కల/ నీ తెల్ల మెడ మీద/నల్లటి తారుజల్లు/ కురవబోతుందని/ వాతావరణ హెచ్చరిక జారీ అయింది..' అంటారు. అమెరికాలో తెల్లవారి దురహంకారానికి బలైన జార్జ్ ఫ్లొయిడ్ హత్యకు నిరసనగా రాసిన కవిత ఇది.

ఇంకా ఇలాంటి చురకత్తుల్లాంటి కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయి. వర్తమాన సంఘటనలను, సందర్భాలను చరిత్ర తోనూ, పీడిత జన పక్ష దృష్టితోనూ కవిత్వంగా మార్చి, ప్రతి కవితనూ ఒక మార్గదర్శిగా మార్చారు. దళిత జీవితాలపై విస్తరించి ఉన్న తరతరాల వివక్షను తీవ్రంగా ఎండగట్టారు. 'కుట్టు' కవితలో "చందమామా!/ నన్ను క్షమించవోయి!/ నీ మీద రాద్దామంటే/ కలం మొరాయిస్తుంది/నువ్వు నాకు ద్వేషం నిండిన సిబిరేకులా/ ఆగపడతావు/ కాని వారు చేసే ద్రోహం కంటే/ అయిన వారు చేసే గాయాలు/ యెక్కువగా సలప్రరిస్తున్నాయి/ గుండె చిదపలు చిదపలుగా పడి వుంది/ కావ్యమా! సుదీ దారం పట్టుకురా!/ జీవితం నన్ను బదాబదాలుగా చించి పోగులు పెట్టింది/ ముందు నన్ను నేను కలిపి కుట్టుకోవాలి" అంటూ జీవితంలో జరిగిన విషయాలను కవిత్వీకరించారు. అల్లికలో దళితుల యాస, వ్యంగ్యం, పదునైన వాక్యాలు పల్లె వాతావరణం కనబడుతుంది. ఈ కవితా సంపుటి చదివితే కవిత్వం ఎలా రాయాలి? కవిత్వం ఎవరి పక్షం ఉండాలి? కవిత్వం దేనికోసం రాయాలి? ఎలా రాయాలి? అన్న సంగతులు స్పష్టంగా అనుభవంలోకి వస్తాయి. ❑

# స్వాతంత్ర్య దినాన గుర్తు చేసుకోవాల్సిన మంచి విషయాలు

**(35వ పేజీ తరువాయి)** ప్రోత్సహించేవాడు. ఇందిరాగాంధీ తర్వాత వేర్వేరు వ్యక్తులు ప్రధానులయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో ఎవరో నెహ్రూ చిత్రపటాన్ని తొలగించారు. అది గమనించిన వాజ్‌పేయ్ కలత చెందారు. దేశ తొలి ప్రధానిగా ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాల్సిందేనని గొడవ చేసి, మళ్లీ నెహ్రూ చిత్రపటాన్ని అక్కడ యథావిధిగా ఏర్పాటు చేయించారు. ప్రధానిగా అటల్‌జీ పార్లమెంట్‌లో చేసిన ఒక ఉపన్యాసంలో ఆయనే స్వయంగా ఈ విషయం తెలియజేశారు. అందుకే రాజకీయాల్లో ఉన్నవారంతా రాజనీతిజ్ఞులు కారు – అనేది సామాన్య ప్రజలు గ్రహించుకోవాలి! మరి, నేటి వాజ్‌పేయ్ వారసులు ఏ స్థాయిలో, ఎక్కడ ఉన్నారో కూడా ప్రజలు ఆలోచిస్తూ ఉండాలి !

స్వాతంత్యం లభించిన నాటికి దేశంలో నెహ్రూ స్థానం ఏమిటీ? వల్లభాయ్ పటేల్ స్థాయి ఏమిటీ ? అనేది పటేల్ ఉత్తరాల వల్ల, వాజ్‌పేయ్ నెహ్రూకు అర్పించిన శ్రద్ధాంజలి వల్ల కొంత అర్థమవుతోంది కదా ? దేశానికి స్వాతంత్ర్యం చేజిక్కే నాటికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తిరుగులేని అగ్రనాయకుడు. ఆయన దార్శనికుడు గనుక, దేశ అవసరాలకు కావల్సిన ప్రాజెక్టుల విషయంలో, వైజ్ఞానిక పరిశోధనాశాలల స్థాపన విషయంలో, వైజ్ఞానికుల్ని ప్రోత్సహించిన విషయంలో విమర్శల్ని ఆహ్వానించే విషయంలో, లలిత కళల్ని, బాలల అవసరాల్ని గుర్తించిన విషయంలో ఆయనకు ఆయనే సాటి. పిల్లలు పెద్దవాళ్లవుతారు. ముసలివాళ్లు అవుతారు. తరాలు మారినా పండిట్ నెహ్రూ మాత్రం చాచా నెహ్రూగానే పిలవబడతారు. ఆయన పుట్టినరోజు 14 నవంబర్‌ను పిల్లల దినంగా జరుపుకుంటున్నాం. సైంటిఫిక్ టెంపర్ – పదాన్ని రూపొందించి ప్రపంచానికి అందించిన వాడు మన తొలి ప్రధాని నెహ్రూ. దేశ ప్రజలు మూఢ నమ్మకాల్లోంచి బయటపడాలని నిరంతరం చెబుతూ ఉండేవాడు. ధనం, స్థాయి, స్థోమత ఏమీ లేని వాడు త్యాగం చేయడానికి ఏముంటుంది ? ఇవన్నీ ఉండి కూడా, దేశం కోసం అన్నింటినీ త్యజించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడం గొప్ప! పైగా, కాశ్మీరీ పండిత్ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వాడై ఉండి, నిరీశ్వరవాది కావడం అంతకన్నా గొప్ప!!

మరి నేటి దేశ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తూ, ఎందుకు నెహ్రూ స్థాయిని తగ్గిస్తున్నారూ? అంటే, వీరిలాగా ఆయన విద్వేషాన్ని వెదజల్లుతూ, దేశంలో మారణ హోమాల్ని జరిపించలేదు. ఫుల్ టైం బయటి దేశాల్లో తిరుగుతూ, దేశంలో పార్ట్ టైం ప్రధానిగా పనిచేయలేదు కదా? బాధ్యతగల దేశ పౌరులం, మనమే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి ! ❑

# ఒక తరం మానసిక పరిస్థితికి ప్రతీక 'అంపశయ్య' నవల

- ఏఆర్ శ్రీకాంత్

1960 మధ్యభాగంలో వచ్చిన ఒక విప్లవాత్మక నవలగా అంపశయ్య పరిగణించబడుతుంది. ఈ నవల ఆనాటి యువతలో నిరాశ, ఆర్థిక పరిస్థితులు, సామాజిక మార్పులు, విద్యా వ్యవస్థపైన ఉన్న విమర్శను ప్రతిబింబిస్తుంది. ఎంతో ప్రసిద్ధి పొందిన ఈ నవలను రచయిత నవీన్ రచించారు. రచయిత నవీన్‌కు మంచి గుర్తింపును తెచ్చిపెట్టిన ప్రథమ రచన అంపశయ్య నవల. ఈ నవల ప్రధానంగా భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత కొన్ని దశాబ్దాలలో విద్యార్థి జీవితం, యువత అభిప్రాయాలు, సామాజిక సంక్షోభం ఇంకా ఒక విద్యార్థి అంతర్మథనాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. 'అంపశయ్య' అంటే మంచంపై పడి ఉన్న స్థితి. దీనికి ఆత్మనిరోధం, అశక్తత, నిరాశ అనే భావాలు కూడా జతవుతాయి.




### ప్రధాన కథానాయకుడు సురేష్

ఈ నవల కథానాయకుడు సురేష్. అతను పట్టభద్ర విద్యార్థి. ఊరిలో చదువుకొని, ఉన్నత విద్య కోసం నగరానికి వచ్చి, కళాశాలలో చేరిన వ్యక్తి. సురేష్ మానసికంగా గాఢమైన ఆలోచనలలో ఉంటూ, జీవితానికి అర్థం వెతికే వ్యక్తిగా మారిపోతాడు. అతను చదువు పూర్తయ్యాక జీవితం ఎలా ఉండబోతుందో అర్థం కాని స్థితిలో ఉంటాడు. ఉద్యోగం కోసం తాపత్రయపడతాడు కానీ తనకు ఆసక్తిలేని రంగాల్లో చేరాలనిపించదు. సురేష్ మానసికంగా ఉక్కిరిబిక్కిరవుతుంటాడు. ఈ నవల మొత్తం అతని మంచంపై పడి ఉన్న సమయంలో జరిగే ఆలోచనలు, జ్ఞాపకాల రూపంలో సాగుతుంది. అతని మిత్రులతో గడిపిన రోజులు, విద్యార్థి ఉద్యమాలు, ప్రేమ అనుభవాలు, కుటుంబ పరిస్థితులు అన్నీ అతని జ్ఞాపకాల్లో ప్రత్యక్షమవుతాయి.

### నవల నేపథ్యంలో సమకాలీన సమాజం..

ఈ నవల 1960 నేపథ్యంలో ఉంది. ఆనాడు దేశంలో పెరిగిన నిరుద్యోగం, విద్యార్థులలో నిరాశ. ఇటువంటి పరిస్థితుల్లో విద్యను ఆశగా చూసిన యువత, చివరికి నిరుద్యోగులుగా మిగిలిపోవడం. ప్రభుత్వం మీద, రాజకీయ వ్యవస్థ, విద్యావ్యవస్థ మీద కూడా యువత విశ్వాసం కోల్పోవడంలాంటి సామాజిక అంశాలను నవీన్ చాలా బలంగా చిత్రీకరించారు.

### ఆత్మవిమర్శ, భావోద్వేగాలు..

సురేష్ ఒక వైపు వ్యక్తిగత జీవితంలో నిరాశతో బాధపడుతుంటే, మరోవైపు సమాజంపై తనకు ఉన్న కోపం, అసహనం వ్యక్తం చేస్తాడు. అతను ప్రేమ, విద్య, కుటుంబం, మిత్రులు అన్నింటిపైనా గంభీరమైన ఆత్మవిమర్శ చేస్తూ, జీవితానికి అర్థం ఏమిటనే అన్వేషణలో ఉంటాడు.

### మిత్రులు, ప్రేమ, మానసిక స్థితి..

నవలలో సురేష్‌కు ఉన్న కొందరు మిత్రులు విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొనేవారు. కొందరు భవిష్యత్తు గురించి కలలుగనేవారు. వీరితో అతని సంభాషణలు ద్వారా ఆనాటి యువత ఆలోచనా సరళిని మనం గమనించవచ్చు. సురేష్ ప్రేమించిన యువతి గురించి కూడా నవలలో స్పష్టంగా ఉంటుంది. ప్రేమ జీవితం అతనికి పూర్తి సంతృప్తిని ఇవ్వదు. ఇది కూడా అతనిలో మరింత విరక్తిని కలిగిస్తుంది.

### విధానం- శైలి..

ఈ నవల ప్రత్యేకత రచనా విధానం. సాంప్రదాయిక కథన శైలికి భిన్నంగా, ఈ నవలలో సురేష్ నిద్రలో మంచంపై పడుకొని తన జీవితం గురించి తలచుకుంటూ ఉంటాడు. ఇది ఒక "స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్నెస్" శైలికి దగ్గరగా ఉంటుంది. అర్థం చేసుకోవడానికి కొంత లోతుగా ఆలోచించాల్సిన విధంగా రచయిత రచన సాగుతుంది.

### సామాజిక వ్యాఖ్యానం..

సమాజంలోని సమస్యలపై నవీన్ విప్లవాత్మక దృష్టితో వ్యాఖ్యానం చేస్తారు. విద్యా వ్యవస్థ ఉపయోగకరంగా ఉండకపోవడం, యువతకు అవకాశాల కొరత, ప్రభుత్వ పాలన లోపాలు. ఇవన్నీ

ఈ నవలలో తీవ్రంగా ప్రస్తావించబడతాయి. ఇది కేవలం ఒక వ్యక్తిగత కథ కాదు, అది ఒక తరం ప్రతినిధిగా నిలిచే కథగా చెప్పవచ్చు.

**సాంస్కృతిక ప్రాశస్త్యం..**

'అంపశయ్య' నవల ద్వారా నవీన్ కొత్త తరానికి కొత్త బాటలు చూపించారు. ఈ రచన ఆధారంగా ఉన్నత చదువులు చదివే విద్యార్థుల్లో ఆలోచనలకు దారితీసింది. ఇది వాస్తవికతకు దగ్గర గా ఉండే రచనగా "నవల వాస్తవికతకే అద్దం" పడుతుంది అనే అభిప్రాయాన్ని అందించింది. సంపూర్ణంగా చూస్తే అంపశయ్య ఒక వ్యక్తిగత జీవితం, మానసిక సంఘర్షణ మాత్రమే కాదు. అది ఒక సమాజపు, ఒక తరపు, ఒక తరం మానసిక పరిస్థితికి ప్రతీక. నవలలో సురేష్ అనుభవించిన సంక్షోభం లక్షలాది యువత ఎదుర్కొన్న ఆత్మవేదన. నవీన్ ఈ నవలతో "సాహిత్యం మానవ అనుభవాలకు అద్దం" అని కొత్త ప్రకటన చేశారు. ఈ నవలలోని వ్యక్తులేమీ సంపూర్ణంగా మంచివాళ్లు కాదు, చెడ్డవా ళ్లు కూడా కాదు. వారు మనలాగే సందేహాలతో, ఆశలతో, విరక్తులతో ఉండే సాధారణ వ్యక్తులు. ఇదే ఈ నవల గుండె స్పందన. ❑

---

# ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి

**(16వ పేజీ తరువాయి)**

అంతకుముందు, 2013లో, ఆయన గోవా మొదటి లోకాయుక్తగా నియమితులయ్యారు, ఇది ఆయన సమగ్రత మరియు ప్రజా జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడంలో ఆయన పాత్రపై ఉన్న విశ్వాసాన్ని సూచిస్తుంది.

**మన రాజ్యాంగం మనం అందరం రాసుకున్నదే!**

ఇటీవల, "రాజ్యాంగ పీఠిక" (ఈ రచయిత రాసిన పుస్తకం)కు ఆవిష్కరణ ప్రసంగంలో, భారత రాజ్యాంగం నిజంగా భారతదేశానికి చెందినది కాదని వాదించే సిద్ధాంత వేత్తలు పెద్దలు అంటూ ఉంటే ఆ వ్యక్తులను జస్టిస్ సుదర్శన్ రెడ్డి విమర్శించారు. రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగాన్ని రూపొందించిన రోజున కూడా, ఆర్గనైజర్ వార్తాపత్రికలో వచ్చిన ఒక సంపాదకీయం త్రివర్ణ పతాకాన్ని రాజ్యాంగాన్ని బహిరంగంగా తిరస్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. తాము దానిని అంగీకరించబోమని, పాటించబోమని వారు ప్రకటించారు. ఇటువంటి రాజ్యాంగపరమైన సిద్ధాంతాల ద్వారా ఉపరాష్ట్రపతి పదవికి సరైన అభ్యర్థిగా నిలబడుతున్నారు.

అటువంటి మేధావులను ఉద్దేశించి జస్టిస్ రెడ్డి, డాక్టర్ అంబేద్కర్ ప్రతిస్పందనను వివరించారు. భారతదేశ రాజ్యాంగ నిర్మాణంలో అనేక ప్రపంచ రాజ్యాంగాలనుంచి నియమాలను తీసుకున్నట్లయితే, అందులో సిగ్గుపడాల్సిన అవసరం లేదని ఆయన గర్వంగా అన్నారు. "మంచి ఆలోచనలు ఎక్కడ నుండి వచ్చినా వాటిని స్వీకరించడం తెలివైన పని."


**రాజ్యాంగ నిర్మాతలైన పెద్దలను దూషించడమా?**

నెహ్రూ గాంధీజీ వంటి వివేకత్వాన్ని వాడుకుని "తాజా ఆలోచనలు ఎక్కడ నుండి వచ్చినా వాటిని లోపలికి రానివ్వడానికి నా కిటికీలన్నీ తెరిచి ఉంచుతాను" అని గాంధీ చెప్పిన మాటలను ఉటంకిస్తూ, కొంతమంది అంబేద్కర్ గాంధీ మధ్య కృత్రిమ సంఘర్షణను సృష్టించి, అటువంటి తప్పుడు చెప్పుడు మాటలతో సంతృప్తి పొందుతారని జస్టిస్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రం సమాఖ్య వ్యవస్థ ఆలోచన రాజ్యాంగం అమలులోకి రాకముందే, జవహర్‌లాల్ నెహ్రూ పీఠికకు ముందుమాటగా ఉన్న ఆబ్జెక్టివ్స్ రిజల్యూషన్‌ను రూపొందించారు. ఆయన అప్పుడే రాష్ట్రాల సమాఖ్యను ఊహించారు, రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు ఉండాలని, కేవలం అవసరమైన అధికారాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి ఉండాలని నొక్కి చెప్పారు. ఈ తీర్మానం విభజన ప్రణాళికకు ముందే, ఏప్రిల్ 31, 1946న ప్రవేశపెట్టారు.

**న్యాయవ్యవస్థలో మానవతా విలువలు**

నెహ్రూ కృషిని తక్కువ చేసి మాట్లాడే విమర్శకులను జస్టిస్ రెడ్డి తిప్పికొట్టారు. ప్రశ్నించారు, వారిలో ఆయన ఆలోచన లోతును ఆయన గొప్ప రచన 'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో ఉపనిషత్తులు, హిమాలయాలు, గంగ, ఆర్యన్లు మరియు మొహెంజో–దారో గురించి పరిశోధన స్పష్టంగా కనిపిస్తుందని అర్థం చేసుకునేవారు ఉన్నారా అని అడిగారు. అన్యాయంగా నెహ్రూను నిందించే, తాము పండితులమని నటిస్తున్న వారికి ఆయన సవాలు విసిరారు.

న్యాయవ్యవస్థలో మానవతా విలువలు జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి న్యాయపరమైన నీతి, మానవ హక్కులు రాజ్యాంగ నైతికతకు ప్రతీకగా నిలిచారు. ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి నామినేట్ చేయడం భారతదేశంలో ప్రజాస్వామ్య మానవతా విలువలను కాపాడాలనే ఒక విస్తృత నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా సాల్వా జుడుం తీర్పు, ఒక ప్రజాస్వామ్య సమాజంలో న్యాయం కోసం మానవులకు కారుణ్యంతో వ్యవహరించేందుకు చట్టం ఏ విధంగా ఒక సాధనంగా ఉపయోగపడుతుందో ఉదాహరణగా నిలిచింది. కనుక జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి న్యాయవ్యవస్థలో మానవతా విలువలను ప్రతిబింబిస్తారు. ఆయన తీర్పులు రాజ్యాంగం పట్ల గౌరవం, ప్రజల హక్కులను పరిరక్షించడం పారదర్శక పాలన పట్ల బలమైన నిబద్ధతను నిలకడగా ప్రతిబింబిస్తాయి. ❑




జ్ఞాన బోధ !

నిజమా.. ఒట్టేసి చెప్పు !









అది అప్పుడు..
ఇది ఇప్పుడు

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**
Vol : 3 - Issue No : 11 July 2025


## కొత్త పుస్తకాల స్వీకారం




ప్రతులకు..
ప్రజాశక్తి బుక్ హౌస్,
విజయవాడ




ప్రతులకు..
విశాలాంధ్ర బుక్ హౌస్,
విజయవాడ

if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.